
మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - మంగళవారం 13 అక్టోబర్ 2026 || సంపుటి: 10 || సంచిక: 278 || పేజీలు:12 || వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

71 బైకులతో దుర్గామాత అక్కృతి



2

ఎవరీ నేహాబోరా! గూగుల్‌లో.. మోస్ట్ వాంటెడ్ పర్సన్



9



సుప్రీంకోర్టుకు మార్చ్

రాహుల్, ప్రియాంకతో పాటు కదం తొక్కిన నాయకులు

- పాల్గొన్న సీఎం రేవంత్, రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నేతలు
- వేలాదిగా పాల్గొన్న కార్యకర్తలు, ప్రజలు

ఢిల్లీ, అక్టోబర్ 12: కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ.. నేహా బోరాతో కలిసి సుప్రీంకోర్టు దిశగా మార్చ్ చేపట్టారు. వీరికి మద్దతుగా వేలాది మంది నిరసనకారులు తరలివచ్చారు. దీంతో దేశ రాజధానిలోని పలు ప్రాంతాలు నిరసనకారులతో కిక్కిరిసిపోయాయి. కనాట్ ప్లేస్ నుంచి మండీ హౌస్ వరకు ...మిగతా 2లో

ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన జరిగే దాకా పోరాడతాం

సీఈసీ జ్ఞానేశ్ నుంచి నాకు సందేశాలు వస్తున్నయ్

మోడీజీ.. మీ వాళ్లు 200 మంది మాతో టచ్‌లో ఉన్నరు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

2

కొత్త ఫారం-6 సవరణలను మేం ఆమోదించలే



సీఈసీపై భారత ప్రధాన న్యాయమూర్తి ఆగ్రహం



సైమన్ గో బ్యాక్ స్ఫూర్తితో

జ్ఞానేశ్ గో బ్యాక్ ఉద్యమం

ఎస్ఐఆర్ పేరుతో ఓట్ చోరీకి మోడీ, షా కుట్ర

రాహుల్ గాంధీ నేతృత్వంలో తీవ్ర పోరాటం చేస్తం

నాడు స్వాతంత్ర్యం కోసం పోరాడిన గాంధీ కుటుంబం.. నేడు ప్రజల ఓటు హక్కు కోసం పోరాడుతోంది • ఢిల్లీలో మంత్రులు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీఎం రేవంత్ దిశా నిర్దేశం



హైదరాబాద్, అక్టోబర్ 12, (మనం బ్యూరో): దేశ ప్రజల ఓటు హక్కును కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటం మరో స్వాతంత్ర్య ఉద్యమమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బ్రిటీష్ పాలన నుండి దేశానికి స్వేచ్ఛ, స్వపరిపాలన కల్పించేందుకు ఆనాడు కాంగ్రెస్ నాయకులు పోరాడారనీ, ఇప్పుడు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవడానికి ...మిగతా 2లో

మేం చెప్పే వరకు ఢిల్లీలోనే ఉండాలె

తెలంగాణ నాయకులకు సీఎం రేవంత్, మహేశ్ ఆదేశాలు

2

కాక్రోచ్ ఎఫెక్ట్

ఢిల్లీ ధర్నా చౌక్ క్లోజ్

జంతర్ మంతర్‌ను డీనోటిఫై చేసిన ఢిల్లీ పోలీస్

9

కేసీఆర్ బాటలోనే మోడీ

జంతర్‌మంతర్‌పై ఆంక్షలు

ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం

మంత్రి పొంగులేటి



3



తీవ్ర రూపం దాలుస్తున్న ఎల్‌నినో

- తాగునీటికే తొలి ప్రాధాన్యం
- రబీలో వరి, పత్తి సాగు వద్దు
- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు



హైదరాబాద్, అక్టోబర్ 12(మనం న్యూస్): రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. రాబోయే కాలంలో ఎదురుకానున్న దుర్భిక్ష పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు, ప్రజలకు తాగునీటికి ఎటువంటి ఇబ్బంది రాకుండా చూసేందుకు కార్యాచరణను సిద్ధం చేసింది. 'రైతు నేస్తం' కార్యక్రమంలో భాగంగా ...మిగతా 2లో

నేషనల్ హైవే 65 విస్తరణను వేగంగా చేయాలె

ఎన్‌హెచ్ఏఐ చైర్మన్‌ను కోరిన మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 12(మనం న్యూస్): హైదరాబాద్-విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి (ఎన్‌హెచ్-65) విస్తరణ పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా ప్రారంభించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌ను కోరారు. ఈ మేరకు న్యూఢిల్లీలో ఎన్‌హెచ్ఏఐ చైర్మన్‌తో పాటు ప్రాజెక్టుల విభాగం సభ్యులు విప్పేష్ శర్మతో మంత్రి సమావేశమై ఈ కీలక ప్రాజెక్టుపై చర్చించారు. తెలుగు రాష్ట్రాలకు అత్యంత కీలకమైన ఈ రహదారిపై రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీ, తరచూ ...మిగతా 2లో

పొన్నం సవాల్‌ను స్వీకరిస్తున్నా



- ఓట్ల తొలగింపు ఆరోపణలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు
- కాంగ్రెస్ నేతలు ఒసామా బిన్ లాడెన్ వారసులు
- క్యాబినెట్ రద్దు చేసి ఢిల్లీకి వెళ్లాల్సిన అవసరం ఏముంది?

2



ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్

ధరలపై రివ్యూ

మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 12: ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ ఛార్జీలపై పునఃపరిశీలన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కామన్ పాస్ ధరలు ఎక్కువగా ఉన్నాయంటూ ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఛార్జీలపై సమీక్ష జరిపేందుకు సర్కార్ నిర్ణయించినట్లు తెలిపారు. దీనిపై త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రోజువారీ కామన్ పాస్ ...మిగతా 2లో



అసెంబ్లీ ప్రాంగణంలో బతుకమ్మ సంబురాలు

వేడుకలో పాల్గొన్న స్పీకర్, మండలి చైర్మన్ • ఆడపడుచులతో కలిసి బతుకమ్మ ఆడిన డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్

3




3

నో అన్నా.. అయిపోయినట్టే

టీసీఎస్ రిక్రూట్‌మెంట్‌లో 80 శాతం ఫ్రెషర్లే

డిజిటల్, ఏఐ స్కిల్స్ ఉన్న వారికే ఛాన్స్



ముంబై, అక్టోబర్ 12: ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఫ్రెషర్ల నియామకానికి సంబంధించి కీలక అప్డేట్ ఇచ్చింది. కొత్తగా నియమించుకునే ఉద్యోగుల్లో ఇకపై 80 శాతం వరకు డిజిటల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నైపుణ్యాలు కలిగిన వారే ఉంటారని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఆరతి సుబ్రమణియన్ పేర్కొన్నారు. ఇటీవల ముగిసిన సెప్టెంబర్ త్రైమాసికంలో మొత్తం ఆదాయంలో ఏఐ ఆదాయం 10 శాతానికి పెరిగిందని, ఈ వాటా మరింత పెరిగితే కంపెనీ మార్జిన్లు కూడా పెరుగుతాయని చెప్పారు. రెండో త్రైమాసికంలో తాము నియమించుకున్న 4,500 మందిలో దాదాపు 25 నుంచి 30 శాతం మంది పూర్తిగా ఏఐపై పట్టున్నవారని సీఓఓ వెల్లడించారు. అందులో 80 శాతం మంది కొత్తవారినికి చెందిన వారేనని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇదే నిష్పత్తిలో ...మిగతా 2లో

రియాద్ విమానాశ్రయంపై క్షిపణిదాడి..

కామారెడ్డి వాసికి తీవ్ర గాయాలు

రియాద్, అక్టోబర్ 12: సౌదీ అరేబియాలోని రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై శనివారం జరిగిన క్షిపణి దాడుల్లో కామారెడ్డికి చెందిన 36 ఏళ్ల షేక్ సయీద్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం ఆయన పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. రియాద్లోని కింగ్ ఫహద్ ఆర్మ్డ్ ఫోర్సెస్ ఆస్పత్రిలో ఆయనకు చికిత్స కొనసాగుతోంది. కామారెడ్డిలోని సైనీ బాబా కాలనీకి చెందిన షేక్ సయీద్ సుమారు 12 ఏళ్లుగా సౌదీ అరేబియాలో ఉంటున్నాడు. కొన్నేళ్లుగా రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ దాడిలో 13 మందికిపైగా మృతి చెందగా.. దాదాపు 300 మందికి గాయాలైనట్లు తెలుస్తోంది.



జ్ఞానేశ్‌ను తొలగించాల్సిందే


తీర్మానం ఆమోదించిన కేరళం అసెంబ్లీ

2

ఆర్థిక శాస్త్రంలో ఇద్దరికి నోబెల్

అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఇ.హాల్, మైఖేల్ వుడ్ ఫోర్డ్‌లకు పురస్కారం

'స్థూల ఆర్థిక స్థిరీకరణకు సూక్ష్మ ఆర్థిక పునాదులు' అంశంపై పరిశోధనలకు గుర్తింపుగా అవార్డు



స్టాక్‌హోం, అక్టోబర్ 12: రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఆర్థిక శాస్త్రంలో నోబెల్ విజేతలను ప్రకటించింది. 'స్థూల ఆర్థిక స్థిరీకరణకు సూక్ష్మ ఆర్థిక పునాదులు' అంశంపై పరిశోధనలు చేసిన అమెరికాకు చెందిన ప్రముఖ ఆర్థికవేత్తలు రాబర్ట్ ఇ. హాల్, మైఖేల్ వుడ్ ఫోర్డ్ లకు ఈ ఏటి నోబెల్ పురస్కారం లభించింది. స్టాక్ హోం లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ఈ పురస్కారాన్నిస్థూల ఆర్థిక ...మిగతా 2లో

రష్యా-ఉక్రెయిన్ మధ్య ఇంధన వనరుల కాల్పుల విరమణ

9

ఎల్లరనూ గిల్లడమే ఎలాన్ పని

బెదిరింపులు.. ధిక్కరింపులు

ఏ దేశాన్నీ ఖాతరు చేయని మస్క్

రాహుల్, ప్రియాంకతో పాటు కదం తొక్కిన నాయకులు

(మొదటి పేజీ తరువాయి)

రహదారులపై పెద్ద సంఖ్యలో నిరసనకారులు కనిపించారు. ఈ మార్చ్ నేపథ్యంలో ఢిల్లీ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రధాన ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తమయ్యారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసే ఉద్దేశంతో ఈ మార్చ్ కొనసాగింది.

మార్చ్‌ను అడ్డుకున్న పోలీసులు..

విపక్ష నేతలు ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, తేజస్వీ యాదవ్, అఖిలేశ్ యాదవ్, సుప్రియా సూలే, సంజయ్ రౌత్, శశి థరూర్, సచిన్ పైలట్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తదితరులు ఇందులో పాల్గొన్నారు. వీరికి మద్దతుగా వేలాది మంది కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. అయితే, భగవాన్ దాస్ రోడ్డు వద్ద బారికేడ్లు పెట్టి విపక్ష నేతలను నిలువరించారు.

సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు..

మరోవైపు, సీఈసీ జ్ఞానేశ్ కుమార్కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో కాంగ్రెస్ పిటిషన్ దాఖలు చేసింది. రాహుల్ గాంధీ ర్యాలీలోనే ఆగిపోవడంతో న్యాయస్థానానికి రాలేకపోయారు. దీంతో ఆయన తరఫున న్యాయబృందమే పిటిషన్ దాఖలు చేసింది. అంతకుముందు, 'ఓట్ల చోరీ' అంశాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వద్ద లేవనెత్తాలని ఇండియా కూటమి నిర్ణయించింది. ఇందుకు సంబంధించి విజ్ఞాపన పత్రం సమర్పించేందుకు తమకు సమయం ఇవ్వాలని సీజేఐని అభ్యర్థించింది. అయితే, ఇందుకు సీజేఐ తిరస్కరించారు. న్యాయస్థానంలో పెండింగ్లో ఉన్న అంశాన్ని విపక్షాలతో చర్చిస్తే.. అది చట్టవిరుద్ధమే అవుతుందని జస్టిస్ సూర్యకాంత్ విపక్షాలకు లేఖ రాశారు.

జ్ఞానేశ్ గో బ్యాక్ ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)



పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఓటు బచావో, దేశ్ బచావో ఆందోళనలో భాగంగా ఢిల్లీ సుప్రీం కోర్టు మార్చ్‌లో సీఎంతో సహా, మంత్రులు, రాష్ట్ర నాయకులు పాల్గొన్న సందర్భంగా ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు అడ్లూరి లక్ష్మణ్, వాకాటి శ్రీహరి, ఏఐసీసీ పరిశీలకులు సచిన్ సావంత్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ముందు పెట్టి ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. రాచరిక, కుటుంబ పాలనకు ముగింపు పలికి ప్రజల చేతిలోఅధికారం పెట్టడంలో ఓటు హక్కు కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. గతంలోనూ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ జరిగిందన్న సీఎం ఈ ప్రక్రియ ద్వారా ఓటు హక్కు లేని వారికి ఓటు హక్కు కల్పించడం జరిగిందన్నారు. దేశ విభజన సమయంలో ప్రజలు ఎక్కడ స్థిరపడ్డారు ? ఎవరు ఏ ప్రాంతానికి వెళ్లారు ? అనే వివరాలను గుర్తించాల్సిన అవసరం కూడా అప్పట్లో ఏర్పడిందని గుర్తు చేశారు. ఇందిరా గాంధీ, అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వాల హయాంలోనే ఈ ప్రక్రియ జరిగిందనీ, అయితే గతంలో ఓటు హక్కు లేని వారికి ఓటు కల్పించడానికే ఈ ప్రక్రియ జరిగిందని గుర్తు చేశారు. ఇప్పుడు మోడీ, అమిత్ షా హయాంలో సర్ పేరుతో ఇప్పటికే ఓటు హక్కు ఉన్న వాళ్ల వారి పేర్లను తొలగించే ప్రయత్నం జరుగుతుందని విమర్శించారు. గతంలో ఈ ప్రక్రియను ప్రజలకు మేలు చేసే చర్యగా చూశారనీ, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం దాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఈడీ, సీబీఐ ఆదాయపు పన్ను శాఖ నార్కోటిక్స్ విభాగం వంటి సంస్థలను ఉపయోగించుకుందనీ, ఇప్పుడు వాటితో రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవడం కష్టమవుతుందనే ఉద్దేశ్యంతో ఎస్ఐఆర్‌ను తెరపైకి తీసుకొచ్చిందని విమర్శించారు. ఎన్నికల సంఘం స్వతంత్ర సంస్థగా నిస్పక్షపాతంగా పని చేయాల్సిన అవసరం ఉందనీ, అలాంటి సంస్థను రాజకీయ అవసరాలకు ఉపయోగించుకోవడం మంచిది కాదని వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం విశ్వసనీయత దెబ్బతింటే ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోతుందనీ, ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నికల సంఘం ఒకే కమిషనర్ పరిధిలో పని చేసేదనీ, అయితే, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పారదర్శకత కోసం ముగ్గురు కమిషనర్ల విధానాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. గతంలో ఎన్నికల కమిషనర్ల నియామకంలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చే వారనీ, ప్రధానమంత్రి, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధాన ప్రతిపక్ష నేత భాగస్వామ్యంతో నియామక ప్రక్రియ సాగేదన్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను సీఈసీగా నియమించే సమయంలోనే రాహుల్ గాంధీ తప్ప అభ్యంతరం వ్యక్తం చేశారనీ, ఆయన ద్వారా ప్రధాని మోడీ ఓటర్ల తొలగింపుకు అవకాశం కల్పిస్తున్నారని ఆరోపించారు. దేశంలో ఓటు హక్కు ఉన్న వారు లేని వారని సృష్టించే పరిస్థితి ఏర్పడిందనీ, ఆందోళన వ్యక్తం చేశారు. గాంధీ కుటుంబం గతంలో దేశానికి స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిందనీ, ప్రస్తుతం అదే కుటుంబానికి చెందిన రాహుల్ గాంధీ ఓట్ చోరీ పోరాటం ద్వారా ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ పోరాటాన్ని మరో స్వాతంత్ర్య పోరాటంగా భావించి ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందనీ, అంబేద్కర్ అణగారిన వర్గాలకు కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ ఇండీ కూటమి తమ పోరాటాన్ని కొనసాగిస్తాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

కొత్త ఫారం-6 సవరణలను మేం ఆమోదించలే

ఢిల్లీ, అక్టోబర్ 12: కేంద్ర ఎన్నికల కమిషన్ పై సుప్రీంకోర్టు ఆగ్రహంవ్యక్తం చేసింది. బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా కొత్తగా తీసుకొచ్చిన ఫారం-6 పై తాము ఎటువంటి తీర్పు ఇవ్వలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు సోమవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. బిహార్ ఎస్ఐఆర్ పై తీర్పు వచ్చే సమయానికి ఫారం-6 లో మార్పులు చూపలేదన్న సీజేఐ.. దరఖాస్తులో మార్పులు ఎవరు చేశారో రికార్డులు పరిశీలించి తేలుస్తామన్నారు. కొత్త ఫారం-6 కు సుప్రీంకోర్టు ఆమోదం ఉందంటూ ఈసీ చేసిన ప్రకటనపై సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మరోసారి అదే వ్యాఖ్య..

బీహార్ ఎస్ఐఆర్ కేసు విచారణ సందర్భంగా.. తాము సవరించిన 'ఫారం 6'కు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందని ఎన్నికల సంఘం పేర్కొన్నట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. కొత్త ఫారం 6పై సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పు ఇవ్వలేదు. బీహార్ ఎస్ఐఆర్ కేసును విచారించిన సమయంలో ఈ కొత్త ఫారమ్ము సంబంధించిన అంశం మా ముందు చర్చకు రాలేదని తేల్చిచెప్పింది. కాగా, బీహార్ ఎస్ఐఆర్ము సంబంధించి మే 2026లో వెలువరించిన తీర్పులో తాము కొత్త ఫారం 6 ప్రకటనను సమర్థించినట్లు సెప్టెంబర్ 26న ఎన్నికల సంఘం ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. అయితే, ఈ వాదనను అప్పట్లో (అక్టోబర్ 5న) విచారించిన మరో వేర్వేరు పిటిషన్ల సందర్భంగా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. తాము ఎటువంటి మార్పులకు ఆమోదం తెలపలేదని స్పష్టం చేసింది. తాజాగా సోమవారం మరోసారి ఇదే విషయాన్ని పునరుద్ఘాటించడంతో జాతీయ స్థాయిలో ఎన్నికల ప్రక్రియపై ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన జరిగే దాకా పోరాడుతాం

ఢిల్లీ, అక్టోబర్ 12: సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండుతో సుప్రీం కోర్టుకు తలపెట్టిన ర్యాలీ నేపథ్యంలో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రత్యేక మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రానికి పలు ప్రశ్నలు సంధించారు. నిరసనల వేళ ఢిల్లీని ఎందుకు జైలుగా మార్చారని ప్రశ్నించారు. 'ఓట్ల చోరీ' అంశాన్ని లేవనెత్తేందుకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అపాయింట్మెంట్ కోరినా అనుమతి లభించని విషయాన్ని ఆయన ప్రస్తావించారు. సీజేఐని ఎవరు నిర్దేశిస్తున్నారని అడిగారు.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నుంచి తనకు సందేశాలు వస్తున్నాయని రాహుల్ ఈ సందర్భంగా తెలిపారు. 'ఆయన ఎంత ఒత్తిడిలో పనిచేస్తున్నారో మేం అర్థం చేసుకోగలం. ఇకనైనా అపూర్వ మారి రాజీనామా చేయండి. అదే మీరు దేశానికి చేసే నిజమైన సేవ. అప్పుడు మేం క్షమిస్తాం'' అని కాంగ్రెస్ ఎంపీ పేర్కొన్నారు.

ఢిల్లీని జైలుగా మార్చిందెందుకు?

'బీజేపీకి దేశ ప్రజల్లో 12 ఏళ్లుగా వ్యతిరేకత ఉంది. ఇప్పుడిది ఒక స్పష్టమైన రూపం దాల్చుతోంది. కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనల వేళ ఢిల్లీలో ఒక భయానక వాతావరణాన్ని సృష్టించారు. నగర రోడ్లపై దాదాపు 30వేల మంది పోలీసులను మోహరించారు. దేశ రాజధానికి రాకుండా అడ్డుకుంటున్నారు. మొత్తం ఢిల్లీని కోటగా, జైలుగా మార్చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? ఆర్ఎస్ఎస్ గూండాలకు ఉన్న స్వేచ్ఛ.. యువతకు ఎందుకు లేదు? మహిళలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ గూండాలు దాడులు చేస్తున్నారు. ప్రస్తుత పరిణామాలతో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని మాకు తెలుసు. ఆయన రాజీనామా చేయాల్సిందే. అప్పటివరకు మేం వదిలిపెట్టబోం' అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

సుప్రీంకు వెళ్తాం..

''దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని.. భారత ప్రధాన న్యాయమూర్తికి చెప్పాలని భావించాం. ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలను సీజేఐ దృష్టికి తీసుకెళ్లాలనుకున్నాం. అందుకోసమే ఆయన అపాయింట్మెంట్ కోరాం. కానీ, మా విజ్ఞప్తిని సీజేఐ తిరస్కరించారు. సుప్రీం కోర్టులో పిటిషన్ వేసుకోవాలని అన్నారు. అందుకే నేడు అత్యున్నత న్యాయస్థానం వరకు ర్యాలీగా వెళ్తున్నాం. జ్ఞానేశ్ కుమార్ పై సుప్రీంలో పిటిషన్ వేస్తాం'' అని రాహుల్ వెల్లడించారు.

200 మంది ప్రభుత్వాధికారులు మాతో టచ్‌లో..

''ప్రస్తుతం ప్రజలు, ప్రతిపక్షాలన్నీ ఒకవైపు ఉంటే.. మోడీ, అమిత్ షా, అజిత్ ధోబాల్, జ్ఞానేశ్ కుమార్, మోహన్ భాగవత్ మరోవైపు ఉన్నారు. వారు ప్రజాస్వామ్యాన్ని చంపేస్తున్నారు. మోడీకి నేను చెప్పేది ఒక్కటే.. మీ ప్రభుత్వంలోని 200 మంది అధికారులు మాతో టచ్ లో ఉన్నారు. ఇది మోడీ-రాహుల్ మధ్య జరిగే యుద్ధం కాదు. దేశ యువత భవిష్యత్తు, రాజ్యాంగాన్ని రక్షించడం కోసం జరుగుతున్న పోరాటం. ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది. ఆ ఐదుగురు నేరగాళ్లు న్యాయవిచారణ ఎదుర్కొనే వరకు వదిలిపెట్టేది లేదు'' అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్
ధరలపై రివ్యూ

(మొదటి పేజీ తరువాయి)



ధర రూ.400 కాగా.. నెలవారీ కామన్ పాస్ ధర రూ.8,500గా నిర్ణయించామని మంత్రి తెలిపారు. అయితే సామాన్యులకు అందుబాటులో ఉండేలా ఛార్జీలపై పునఃసమీక్ష చేయనున్నట్లు వెల్లడించారు. ప్రయాణికుల అభిప్రాయాలు, వాస్తవ పరిస్థితుల ఆధారంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రజలపై అదనపు ఛార్జీల భారం మోపడం ప్రభుత్వ లక్ష్యం కాదని స్పష్టం చేశారు. ఆర్టీసీ-మెట్రో సేవలను మరింత విస్తృతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే కామన్ పాస్ ధరలపై తుది నిర్ణయం ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

నేషనల్ హైవే 65 విస్తరణను వేగంగా చేయాలె

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని టెండర్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి కోరారు.ప్రస్తుతం ఉన్న నాలుగు లేన్ల రహదారిని ఆరు లేన్లుగా విస్తరించడంతో పాటు, ఇరువైపులా సర్వీస్ రోడ్లు, నియంత్రిత ప్రవేశ సౌకర్యాలను అభివృద్ధి చేయాలని మంత్రి ప్రతిపాదించారు. ఈ విస్తరణ పూర్తయితే వాహనాల రాకపోకలు సులభతరమవడంతో పాటు ట్రాఫిక్ రద్దీ తగ్గి, ప్రయాణ సమయం ఆదా అవుతుందని మంత్రి పేర్కొన్నారు.

నిరంతరం సమన్వయం..

ముఖ్యంగా ప్రమాదాల నివారణకు, రహదారి భద్రతను మెరుగుపరచడానికి ఈ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని వివరించారు.మంత్రి విజ్ఞప్తికి ఎన్హెచ్ఏఐ ఛైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి టెండర్ల దాఖలుకు నవంబర్ 11 చివరి తేదీగా నిర్ణయించినట్లు వారు తెలిపారు. అన్ని ప్రక్రియలు పూర్తి చేసి 2027 జనవరి నాటికి క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్లు మంత్రి వెల్లడించారు. ఈ మార్గంలో ప్రమాదాలను తగ్గించి, ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు.

రహదారుల అభివృద్ధి అంటే కేవలం ప్రయాణ సౌకర్యాలను పెంచడమే కాకుండా, ప్రజల ప్రాణాలను కాపాడటం, వాణిజ్య కార్యకలాపాలకు ఊతమివ్వడం, తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా అనుసంధానాన్ని బలోపేతం చేయడమేనని మంత్రి పేర్కొన్నారు.ఎన్హెచ్-65 విస్తరణ పనులు సకాలంలో పూర్తయ్యేలా కేంద్ర సంస్థలతో నిరంతరం సమన్వయం చేసుకుంటామని ఆయన తెలిపారు.



71 బైకులతో దుర్గామాత ఆకృతి

సూరత్, అక్టోబర్ 12: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సూరత్ కు చెందిన కొంతమంది బైకర్లు తమ భక్తిని అత్యంత వినూత్న రీతిలో చాటుకున్నారు. సూరత్ లోని సముద్ర తీరంలో 71 ప్రీమియం బైకులను నిర్దిష్ట రీతిలో నిలిపి, ఆకాశం (డ్రోన్) నుంచి చూస్తే 'దుర్గామాత రూపం' కనిపించేలా ఒక అద్భుతాన్ని ఆవిష్కరించారు. తమ వృత్తి, అభిరుచి అయిన బైకింగును అమ్మవారిపై ఉన్న అపరిమితమైన భక్తిశ్రద్ధలతో మిళితం చేసి వారు ప్రదర్శించిన తీరు అందరినీ కట్టిపడేస్తోంది.

'ఇది కదా అసలైన క్రియేటివిటీ.. భక్తికి, ప్యాషన్ కు పర్ఫెక్ట్ కాంబినేషన్! అంటూ బైకర్ల బృందంపై ప్రశంసలు కురుస్తున్నాయి.

జ్ఞానేశ్‌ను తొలగించాల్సిందే
తీర్మానం ఆమోదించిన కేరళం అసెంబ్లీ

తిరువనంతపురం, అక్టోబర్ 12: కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ను తొలగించాలని కోరుతూ కేరళం అసెంబ్లీ సోమవారం ఒక తీర్మానాన్ని పాస్ చేసింది. భారత ఎన్నికల సంఘంలో పారదర్శకత తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని కోరింది. ముఖ్యమంత్రి వీడీ సతీశన్ ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి అధికార కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్), ప్రతిపక్షం సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) మద్దతు తెలిపాయి. కాగా.. తీర్మానంలోని పలు అంశాలపై బీజేపీ అభ్యంతరం తెలిపింది. వాటికి సవరణ చేయాలని బీజేపీ నేతలు కోరగా వాటిని తిరస్కరించారు.

సీఈసీపై వచ్చిన ఆరోపణలపై సభ ఆందోళన వ్యక్తం చేసింది. స్వేచ్ఛాయుత, పారదర్శక, నిష్పక్షపాత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని, అలా నిర్వహించిన ఎన్నికలపైనే భారతదేశ ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుందని సభ పేర్కొంది. 'భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) పారదర్శకతపై సందేహాలు వస్తున్న నేపథ్యంలో ఆ రాజ్యాంగబద్ధ వ్యవస్థ విశ్వసనీయతను పునరుద్ధరించడానికి సీఈసీని తొలగించాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి' అని తీర్మానం పేర్కొంది.

ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియలో లోపాలను పరిష్కరించాలని, అర్హులైన ఓటర్లందరికీ ఓటు హక్కును పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వం, ఈసీఐని సభ కోరింది. అలాగే, సీఈసీని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. సీఈసీ ఎంపికలో ప్రధాన మంత్రి, లోక్సభ ప్రతిపక్ష నేతతో పాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన ప్యానెల్ను ఏర్పాటు చేయాలని తీర్మానం పేర్కొంది. 'సరైన విధానాన్ని అనుసరించకుండానే ఓటరు జాబితా నుంచి కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. బడుగు బలహీనవర్గాలు, మైనారిటీలు, యువత, కార్మికుల ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్య సూత్రాలను కాలరాయడమే. అలాగే, ఓటర్ల జాబితాను తయారు చేయడానికి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ల అధికారాలను కూడా తగ్గించారని మీడియాలో కథనాలు వచ్చాయి. ఫామ్-6కు సవరణలు చేశారని, దీనిపై ఇద్దరు ఎన్నికల అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేశారని పత్రికలు ప్రచురించాయి' అని తీర్మానం వ్యాఖ్యానించింది.

మేం చెప్పే వరకు ఢిల్లీలోనే ఉండాలె

ఢిల్లీ, అక్టోబర్ 12: రాష్ట్ర నేతలకు సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. తాము చెప్పేంత వరకు ఢిల్లీ వదిలి వెళ్లొద్దని నేతలకు స్పష్టం చేశారు. సీఈసీ నిర్ణయాలు, సర్ అంశాలపై ఇండియా కూటమి నేతలు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే పీసీసీ అధ్యక్షుడు మహేశ్ తో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు పెద్దసంఖ్యలో ఢిల్లీలోనే ఉన్న విషయం తెలిసిందే. మరోవైపు సోమవారం నిర్వహించిన ఇండియా కూటమి ర్యాలీలో రాహీఛార్జ్, తొక్కిసలాట చోటు చేసుకుంది. పలువురు తెలంగాణ నేతలు కిందపడటంతో స్వల్ప గాయాలయ్యాయి.



ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

నగరంలోని మల్లేపల్లి సీతారాంబాగ్ డి-క్లాస్ గ్రౌండ్‌లో దేవీ నవరాత్రి ఉత్సవాలు నవయువక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. అసోసియేషన్ సభ్యులు అరవింద్, పరమేష్, బాలకిషోర్, రాజ్ కుమార్, చిన్న, ముఖేష్, మురళి తదితరులు ప్రతి రోజూ ప్రత్యేక పూజలు జరిపిస్తున్నారు.

ఆర్థిక శాస్త్రంలో ఇద్దరికి నోబెల్

(మొదటి పేజీ తరువాయి)

నమూనాల ఆధునికీకరణ, మార్కెట్ శక్తుల పనితీరును సూక్ష్మ ఆర్థిక పునాదులతో విశ్లేషించడంలో వారిద్దరూ చేసిన మార్గదర్శక పరిశోధనలకు గాను ఈ అత్యున్నత గౌరవాన్ని అందజేస్తున్నట్లు నోబెల్ కమిటీ వెల్లడించింది. ఆర్థిక మాంద్యం, వడ్డీ రేట్ల నియంత్రణ, విధాన నిర్ణయాల రూపకల్పనలో వీరి సిద్ధాంతాలు ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులకు దిశానిర్దేశం చేశాయి. అమెరికాకు చెందిన ఈ ఇద్దరు ఆర్థిక నిపుణులు ద్రవ్యోల్బణ నియంత్రణ, వినియోగదారుల ప్రవర్తన, ప్రభుత్వ ద్రవ్య విధానాల ప్రభావాలపై సమగ్ర అధ్యయనాలు చేశారు. స్టాన్ఫోర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన రాబర్ట్ హాల్, కొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన మైఖేల్ వుడఫ్ట్ పోర్డులు పరస్పరం సమాంతరంగా అభివృద్ధి చేసిన సిద్ధాంతాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను అర్థం చేసుకోవడంలో కీలక మైలురాళ్లుగా నిలిచాయని జ్యూరీ ప్రశంసించింది. ఈ అవార్డు కింద లభించే 11 మిలియన్ల స్వీడిష్ క్రోనర్ల నగదు బహుమతిని వీరిద్దరూ సమంగా పంచుకోనున్నారు. కాలిఫోర్నియాకు చెందిన రాబర్ట్ ఇ.హాల్.. 1967లో మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) నుంచి పీహెచ్ డీ పట్టా అందుకున్నారు. ప్రస్తుతం స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్ గాపనిచేస్తున్నారు. మసాచుసెట్స్ కు చెందిన వుడ్ ఫోర్డ్ సైతం ఎమ్ఐటీ నుంచి 1983లో పీహెచ్డీ పట్టా పొందారు. కొలంబియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ గా ఉన్నారు.

టీసీఎస్‌లో రిక్రూట్‌మెంట్‌లో 80 శాతం ఫ్రెషర్లే

(మొదటి పేజీ తరువాయి)

నియామకాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. మార్కెట్లో తగిన ప్రతిభ అందుబాటులో ఉందన్నారు. ఫ్రెషర్లు మాత్రమే కాకుండా.. కొత్త విషయాలు నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండే ఉద్యోగులకూ ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మిడ్ లెవల్ ఇంజినీర్ కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఆసక్తి చూపిస్తే.. వారికి మరింత ప్రయోజనం ఉంటుందని కంపెనీ సీఈఓ కె కృతివాసన్ పేర్కొన్నారు. వారికి సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సంబంధిత డొమైన్ నాలెడ్జ్ కూడా ఉంటుందని చెప్పారు. జూనియర్ ఇంజినీర్లకు ఆ స్థాయిలో అవగాహన ఉండకపోవచ్చని అన్నారు.



పొన్నం సవాల్‌ను స్వీకరిస్తున్నా

హైదరాబాద్, అక్టోబర్ 12 (మనం బ్యూరో): కాంగ్రెస్ నేతలు ఒసామా బిన్ లాడెన్ వారసులని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు వ్యాఖ్యానించారు. దేవుళ్లను ఎగతాళి చేయొద్దనీ, సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో హిందువులు ఆగ్రహంగా ఉన్నారని పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ 2014కు ముందు దేశంలో అనేక కుంభకోణాలను చూశామనీ, మోడీ ప్రధాని అయ్యాక దళారీ వ్యవస్థ లేకుండా లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చారని తెలిపారు. తెలంగాణకు 12 ఏళ్లలో పెద్ద ఎత్తున నిధులు కేటాయించారనీ, 41 రైల్వే స్టేషన్లను ఆధునీకరించారని గుర్తు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఛాలెంజ్‌ను తాను స్వీకరిస్తున్నానని, ఓట్ డీలిట్ అయిన వాళ్లలో పది మందిని ఎన్నికల కమిషన్ కార్యాలయానికి తీసుకు రావాలని సూచించారు. రైతులు చనిపోతుంటే ముఖ్యమంత్రి, మంత్రులు స్పెషల్ ఫ్లైట్‌లలో ఢిల్లీకి వెళుతున్నారనీ, రాహుల్ గాంధీ చేసే పిచ్చి తుగ్లక్ పనులను సమర్థించడానికి ఢిల్లీకి వెళతారా ? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు, రైతుల మీద ఉన్న ప్రేమ ఇదేనా అని రేవంత్ అని ప్రశ్నించారు. తెలంగాణ రైతులను ఆదుకోవాలనీ, ఫసల్ బీమా యోజన అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాక్రోచ్ పిక్రోచ్ కలిసి దేశాన్ని ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించిన రామచందర్‌రావు త్వరలో జరుగబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేసే వరకు రాహుల్ గాంధీని తెలంగాణకు రానివ్వబోమనీ, అడ్డుకుంటామని హెచ్చరించారు.

గోవాలో కాదు, తెలంగాణలో డ్రగ్స్ మాఫియా పెరిగిపోతున్నదనీ, నషా ముక్త్ భారత్ అనేది తెలంగాణ నుంచే ప్రారంభం కావాలని సూచించారు. జ్ఞానేశ్ కుమార్‌తో బీజేపీకి ఏం సంబంధమని నిలదీస్తూ నిరసనకారులపై ఎలాంటి దాడులు జరగలేదని స్పష్టం చేశారు. త్వరలో జరుగబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ ఎక్కడ కూడా గెలవదనీ, వ్యాఖ్యానించారు.

తీవ్ర రూపం దాలుస్తున్న ఎల్‌నినో

(మొదటి పేజీ తరువాయి)

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్య



తెలంగాణ–హిరోషిమా మైత్రి

పెట్టుబడులే లక్ష్యంగా ప్రభుత్వ అడుగులు

హైదరాబాద్,అక్టోబర్ 12(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రానికి, జపాన్‌లోని హిరోషిమా ప్రభుత్వానికి మధ్య పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన రంగాల్లో ఇరు ప్రాంతాల మధ్య విస్తృత భాగస్వామ్యానికి అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్ర సచివాలయంలో హిరోషిమా ప్రభుత్వ ప్రతినిధులతో ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి ప్రారంభోపన్యాసం చేయగా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలంగాణ అభివృద్ధి ప్రణాళికలు, భవిష్యత్ ఆర్థిక లక్ష్యాలను జపాన్ ప్రతినిధి బృందానికి వివరించారు. రాష్ట్రాన్ని అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సీఎస్ సంజయ్ జాజు సవివరంగా తెలిపారు. హైదరాబాద్ ప్రధాన పట్టణ ప్రాంతంలో సమగ్ర పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ కోసం క్యూర్ ప్రాజెక్టును, నగర పరిసర ప్రాంతాల్లో ప్రణాళికాబద్ధమైన పారిశ్రామిక, ఆర్థిక కార్యకలాపాల ప్రోత్సాహం కోసం ప్యూర్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు సీఎస్ పేర్కొన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాలు, వ్యవసాయ ఆధారిత రంగాలు, విలువ ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి రేరా రంగానికి పెద్దపీట వేస్తున్నామని, ఔటర్ రింగ్ రోడ్ పరిసరాల్లో రవాణా అనుసంధానం, పారిశ్రామిక, వాణిజ్య విస్తరణకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని వారు తెలిపారు.

భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం..

ఆధునిక నగర నిర్మాణం, సాంకేతికత ఆధారిత అభివృద్ధికి భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని, డిజిటల్ మౌలిక వసతుల కోసం డేటా సెంటర్‌లను ప్రోత్సహిస్తున్నామని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు వారు జపాన్ ప్రతినిధులకు వివరించారు.తెలంగాణ విజన్ 2047లో భాగంగా, వచ్చే రెండు దశాబ్దాల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలనే స్పష్టమైన లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎస్ పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనలో అంతర్జాతీయ పెట్టుబడులు, ఆధునిక సాంకేతికత, పారిశ్రామిక విస్తరణ కీలక పాత్ర పోషిస్తాయని ఆయన వెల్లడించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే జపాన్ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి స్థాయి సహకారం లభిస్తుందని సీఎస్ భరోసా ఇచ్చారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సదస్సులో భాగంగా జరిగే 'ఇన్వెస్ట్ తెలంగాణ' కార్య క్రమంలో హిరోషిమా ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు భారీగా పాల్గొనాలని ప్రధాన కార్యదర్శి ఆహ్వానించారు. ఈ వేదిక ద్వారా జపాన్ సంస్థలతో దీర్ఘకాలిక భాగస్వామ్యాలను ఏర్పరచుకోవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ-హిరోషిమా మధ్య ఏర్పడుతున్న ఈ సన్నిహిత సంబంధాలు రెండు ప్రాంతాల ఆర్థిక పురోగతికి, యువతకు నూతన ఉపాధి అవకాశాల కల్పనకు దోహదపడతాయని సీఎస్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, టిజీఐఐసీ ఎండీ శాంక తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలు..

వేడుకలో పాల్గొన్న స్పీకర్, మండలి చైర్మన్

ఆడపడుచులతో కలిసి బతుకమ్మ ఆడిన డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్



హైదరాబాద్,అక్టోబర్12(మనం న్యూస్): తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రకృతిని ఆరాధించే గొప్ప సంస్కృతికి బతుకమ్మ ప్రతీకగా నిలుస్తోందని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కొనియాడారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా, అంబరాన్ని తాకేలా జరిగాయి. ఈ వేడుకల్లో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ తదితరులు పాల్గొని అసెంబ్లీ ఆడపడుచులతో కలిసి బతుకమ్మ ఆడారు.బంతి, చామంతి, గునుగు, తంగేడు పూలతో ఎంతో కళాత్మకంగా పేర్చిన బతుకమ్మలను ప్రాంగణం మధ్యలో ఉంచి, మహిళా ఉద్యోగులు, సిబ్బంది అందరూ చుట్టూ చేరి 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ భక్తిశ్రద్ధలతో గొంతెత్తి పాటలు పడటంతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక, సాంస్కృతిక శోభను సంతరించుకుంది.

బతుకమ్మల చుట్టూ తిరుగుతూ మహిళలు చప్పట్లు కొడుతూ చేసిన నృత్యాలు, పంచుకున్న ఆత్మీయతలు వేడుకకు మరింత వన్నె తెచ్చాయి. తెలంగాణ ఆడబిడ్డల ఉత్సాహం మధ్య సాగిన ఈ వేడుకలతో అసెంబ్లీ ప్రాంగణం రంగురంగుల పూల సువాసనలు, ఆనంద కోలాహలంతో కళకళలాడింది. ఈ వేడుకల్లో శాసనమండలి సెక్రెటరీ డాక్టర్ నరసింహాచార్యులు, శాసనసభ సెక్రెటరీ ఆర్. తిరుపతితో పాటు ఉభయసభల ఉన్నతాధికారులు, మహిళా ఉద్యోగులు, ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై పండుగను ఘనంగా జరుపుకున్నారు.

ప్రజల దాహం కంటే బీర్లే ముఖ్యమా?

రేవంత్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

సింగూరు నీటిని బీర్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నరు?



హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో కోట్లాది మంది ప్రజల తాగునీటి అవసరాలను పక్కనవెట్టి, బీర్ ఫ్యాక్టరీలకు ప్రాధాన్యత ఇస్తున్నారని రేవంత్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ ఆయన కమిషన్లు పంచుకొనుడు, పెంచుకొనుడు తప్ప ప్రజలకు చేసిందేమి లేదని ఆయన ఆరోపించారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వం నీటి, విద్యుత్ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. సింగూరు ప్రాజెక్టు అంశాన్ని హరీశ్ రావు ప్రత్యేకంగా ప్రస్తావించారు. మరమ్మతుల పేరుతో ప్రాజెక్టు నుంచి 29 టీఎంసీల నీటిని ఖాళీ చేసి, పనులను అసంపూర్తిగా వదిలేశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 3 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నా, దానిని బీర్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ చర్య వల్ల హైదరాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రజల తాగునీటి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యాల వల్లే రాష్ట్రంలో కరెంట్ కోతలు పెరిగాయని, ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని హరీశ్ రావు అన్నారు. ఎల్ నినో ప్రభావంపై ముందుగానే హెచ్చరికలు ఉన్నప్పటికీ, దేవాదుల, కల్వకుర్తి వద్ద నీటిని లిఫ్ట్ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, ఇది కృత్రిమ కరవుకు దారితీసిందని దుయ్యబట్టారు. మద్యం కంపెనీలకు నీటి కొరత రాకూడదని ఎక్సైజ్ మంత్రి జూపల్లి వ్యాఖ్యానించడాన్ని హరీశ్‌రావు ఈ సందర్భంగా తప్పుపట్టారు.

వికసిత్ భారత్ నిర్మాణంలో ఇంజినీర్లదే కీలక పాత్ర

జాతి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

ఎస్కీ డైరెక్టర్ కల్నల్ హర్‌పాల్ సింగ్ గ్రేవాల్



హైదరాబాద్, అక్టోబర్ 12(మనం న్యూస్): భారతదేశాన్ని సర్వతోముఖాభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు, సాంకేతిక రంగంలో నూతన ఒరవడిని సృష్టించేందుకు యువ ఇంజినీర్లు పునరంకితం కావాలని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ) డైరెక్టర్ కల్నల్ హర్పాల్ సింగ్ గ్రేవాల్ పిలుపునిచ్చారు. దేశ విద్యుత్, మౌలిక వసతుల రంగాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులను అందిపుచ్చుకోవాలని ఆయన ఆకాంక్షించారు.హైదరాబాద్‌లోని ఎస్కీ ప్రాంగణంలో పవర్ అండ్ ఎనర్జీ, వాటర్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ డివిజన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ప్రత్యేక శిక్షణా కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 122 మంది ప్రతినిధులు ఈ శిక్షణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్ కల్నల్ గ్రేవాల్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.

డిజిటల్ విప్లవం..

దేశంలో రాబోయే అయిదారు సంవత్సరాల కాలంలో దాదాపు 25 కోట్ల విద్యుత్ మీటర్లను స్మార్ట్ మీటర్లుగా మార్చే బృహత్తర అవకాశం ఉందని కల్నల్ గ్రేవాల్ స్పష్టం చేశారు. విద్యుత్ రంగంలో డిజిటల్ విప్లవానికి ఇది అత్యంత కీలకమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. దేశంలోనే తొలిసారిగా ఎస్కీలో అత్యాధునిక స్మార్ట్ మీటర్ ప్రయోగశాలను ఏర్పాటు చేశామని, ఈ సాంకేతికతపై నిపుణులకు శిక్షణనివ్వడంలో ఈ ల్యాబ్ ప్రధాన భూమిక పోషిస్తుందని కల్నల్ వెల్లడించారు. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నామినేట్ చేసిన అభ్యర్థులు స్మార్ట్ మీటర్ల ప్రయోజనాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే, మధ్యప్రదేశ్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధులకు కాంపాక్ట్ సబ్‌స్టేషన్‌లు, భూగర్భ హైటెన్షన్ కేబుల్ వ్యవస్థలు, ఆధునిక లైటింగ్ పద్ధతులపై శిక్షణ ఇస్తున్నట్లు డైరెక్టర్ వెల్లడించారు. భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నామినేట్ చేసిన అభ్యర్థులకు ఇంజినీరింగ్ ప్రాజెక్టుల అంచనాల తయారీ, సమగ్ర ప్రాజెక్టు నివేదికల (డీపీఆర్) రూపకల్పనపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు కల్నల్ గ్రేవాల్ వివరించారు. ఆనకట్టలు, కాలువలు వంటి నీటిపారుదల ప్రాజెక్టులతో పాటు జాతీయ రహదారులు, తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల,డ్రైనేజీ వ్యవస్థల రూపకల్పనలో డీపీఆర్ ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు. శిక్షణ పొందిన ఇంజినీర్లు కేవలం సాధారణ సాంకేతిక పరిజ్ఞానంతో సరిపెట్టుకోకుండా, తమ వృత్తి రంగాల్లో వినూత్న ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని కల్నల్ పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువ ఇంజినీర్ల పాత్ర అమూల్యమైనదని, జాతి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన యువ ఇంజినీర్లకు సుచించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఎస్కీ వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఆందోళనలు కాదు.. ఆధారాలుంటే ఈసీకివ్వండి

ఢిల్లీలో ఇండీ కూటమి నిరసనలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఫైర్

మీ ఆందోళనలతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నయని వ్యాఖ్య



హైదరాబాద్, మనం ప్రతినిధి: ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనపై బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. ఈ ఆందోళనల వల్ల రాజధాని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రతిపక్ష నేతలు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలో ఆటల మీడియాతో మాట్లాడుతూ... ప్రతిపక్షాల తీరుపై తనదైన శైలీలో తీవ్రంగా మండిపడ్డారు. నిరసనల పేరుతో డ్రామాలు చేయొద్దని కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేసేవారు.. అందుకు సంబంధించిన ఆధారాలతో ఎన్నికల సంఘాన్ని సంప్రదించాలని ఈటల సూచించారు. 'ఎన్నికల సంఘం నుంచి అపాయింట్‌మెంట్ తీసుకుని, మీ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించాలని సూచించారు. అంతేగానీ, ఇలా రోడ్లెక్కి ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదు?' అని ఆయన ఘాటుగా మందటించారు. గతంలో బీహార్‌లో 'ఓట్ల దొంగతనం' జరిగిందని ఇలాగే ఆరోపించారని, కానీ, దాని ఫలితం ఏమైందో గుర్తుచేసుకోవాలని అన్నారు. బీహార్ ఎన్నికల నుంచి ఇండియా కూటమి గుణపాఠం నేర్చుకోవాలని ఈటల హితవు పలికారు. నిరసనలు, ఉద్యమాలు, పోరాటాలు చేసే ముందు ప్రజలకు ఇబ్బంది కలుగకుండి ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పోరాడటం నేర్చుకోవాలని ఆయన హితవు పలికారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'చలో ఢిల్లీ - మార్చ్ ఫర్ డెమోక్రసీ' పేరుతో ఇండియా కూటమి సుప్రీంకోర్టుకు పాదయాత్ర తలపెట్టిన విషయం తెలిసిందే. ఈ నిరసనల కారణంగా ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో పాటు, కొన్ని మెట్రో స్టేషన్లను మూసివేశారు. ఇది ప్రతిపక్షాలు సైతం గమనించాలని ఆయన సుతిమెత్తగా మందలించారు.

'నో' అన్నా.. అయిపోయినట్టే

మీ బ్యాంక్ ఖాతా ఖాళీ

వాట్సాప్‌లో..సైబర్ నేరగాళ్ల సరికొత్త

ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్

ఓటీపీ, లింకులు లేకుండానే

జరుగుతున్న మోసం

మోసపోతే 1930కి కాల్ చేయాలని విజ్ఞప్తి

హైదరాబాద్, మనం ప్రతినిధి : ఓటీపీ చెప్పాల్సిన పనిలేదు?.. అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయక్కర్లేదు.. కేవలం ఒక్క 'నో' అని రెండక్షరాల సమాధానం ఇస్తే చాలు.. మీ బ్యాంక్ ఖాతాలోని సొమ్ము క్షణాల్లో మాయం... సాంకేతికతను వాడుకుని సైబర్ నేరగాళ్లు పన్నిన ఈ సరికొత్త పన్నాగం ఇప్పుడు పెను సవాలుగా మారింది. 'ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్'గా పిలుస్తున్న ఈ ప్రమాదకరమైన మోసంపై ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. ఈ మోసం ఎలా పనిచేస్తుందో, దాని నుంచి ఎలా రక్షించుకోవాలో ఆయన సమగ్రంగా వివరించారు.

మోసం ఎలా జరుగుతుందంటే..

సైబర్ కేటుగాళ్లు పక్కా ప్రణాళికతో ఈ మోసానికి పాల్పడుతున్నారు. ముందుగా, గుర్తుతెలియని వాట్సాప్ నంబర్ నుంచి మీ ఫోన్‌కు ఓ సందేశం వస్తుంది. 'మీ బ్యాంక్ ఖాతా నుంచి ఇంత మొత్తం డెబిట్ అయ్యింది' అని ఆ మెసేజ్‌లో ఉంటుంది. అది చూసిన వెంటనే ఎవరైనా కంగారుపడటం సహజం.. ఆ కంగారును ఆసరాగా చేసుకుని, వెంటనే మరో సందేశం పంపుతారు. 'ఈ లావాదేవీ మీరు చేయకపోతే, వెంటనే 'నో'అని రిప్లై ఇవ్వండి' అని అందులో సూచిస్తారు. ఖాతాలో డబ్బులు పోయాయన్న ఆందోళనతో చాలామంది ఆలోచించకుండా 'నో' అని టైప్ చేసి పంపేస్తారు. అక్కడే అసలు మోసం దాగి ఉంది. మీరు 'నో' అని సమాధానం పంపిన మరుక్షణమే, ఆ సందేశంలో కంటికి కనిపించకుండా దాగి ఉన్న మాల్‌వేర్ స్క్రిప్ట్‌లు లేదా ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్స్ యాక్టివేట్ అవుతాయి. ఈ ఫైల్స్ హ్యాకర్లకు మీ మొబైల్ ఫోన్‌పై పూర్తి నియంత్రణను (రిమోట్ యాక్సెస్) అందిస్తాయి. దీంతో వారు మీ ఫోన్‌లోని బ్యాంకింగ్ యాప్‌లు, పాస్ వర్డ్, ఇతర సున్నితమైన సమాచారాన్ని సులభంగా దొంగిలించి, క్షణాల్లో మీ బ్యాంక్ ఖాతాను పూర్తిగా ఖాళీ చేస్తారు. ఇటీవల ఓ చార్టర్డ్ అకౌంటెంట్ సైతం ఈ మోసం బారిన పడి భారీగా నష్టపోయిన ఘటన ఈ దాడి తీవ్రతకు అద్దం పడుతోంది.

ప్రజలకు సీపీ సజ్జనార్ సూచనలు..

ఈ ప్రమాదకరమైన మోసం నుంచి ప్రజలు తమను తాము కాపాడుకోవడానికి వీసీ సజ్జనార్ పలు కీలక సూచనలు చేశారు. గుర్తుతెలియని నంబర్ల నుంచి బ్యాంక్ లావాదేవీల పేరుతో వచ్చే సందేశాలకు ఎట్టిపరిస్థితుల్లోనూ 'ఎస్' లేదా 'నో' అని ఎది రిప్లై ఇవ్వకూడదు. అలాంటి సందేశాలు రాగానే కంగారు పడకుండా, వెంటనే ఆ నంబర్‌ను బ్లాక్ చేసి, చాట్‌ను పూర్తిగా డిలీట్ చేయాలన్నారు. నిజంగా మీ ఖాతా నుంచి డబ్బు కట్ అయిందో లేదో తెలుసుకోవడానికి మీ బ్యాంక్ అధికారిక మొబైల్ యాప్ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెక్ చేసుకోవాలని సూచించారు. ఇలా వచ్చేవి ఏ వాట్సాప్ సందేశాలను అస్సలు నమ్మవద్దు. ఏ అధికారిక బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థ కూడా వాట్సాప్ ద్వారా ఇలాంటి లావాదేవీల ధ్రువీకరణ కోరదని గుర్తుంచుకోవాలి.

మోసపోతే ఏం చేయాలి?

ఒకవేళ పొరపాటున ఎవరైనా ఈ మోసానికి గురైతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా 'గోల్డెన్ అవర్'లో స్పందించాలని సజ్జనార్ సూచించారు. వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ '1930'కి కాల్ చేయాలి. లేదా సైబర్ క్రైమ్.గొవ్.ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలన్నారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే, దొంగిలించబడిన డబ్బును ఫ్రీజ్ చేసి తిరిగి రాబట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆయన వివరించారు. కంగారులో ఇచ్చే ఒక్క సమాధానం జీవితకాల సంపాదనను హరించివేయగలదని, కాబట్టి ప్రతి ఒక్కరూ అత్యంత జాగ్రత్తగా ఉండాలని సీపీ సజ్జనార్ ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నిందితుల జాబితా నుంచి నా పేరు తొలగించండి?

- ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కేటీఆర్‌ను చెర్చిన ఏసీబీ అధికారులు
- ఏసీబీ కోర్టులో డిశ్చార్జ్ పిటిషన్ వేసిన కేటీఆర్

హైదరాబాద్, మనం ప్రతినిధి : బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో రాష్ట్రంలో పేరు ప్రఖ్యాతల కోసమే చేశాను తప్పా? తన స్వతం స్వలాభం కోసం ఎది చేయలేదని కేటీఆర్ తెల్చి చెప్పిన విషయం తెలిసిందే.. అయితే, తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరనకు నాంపల్లి ఏసీబీ కోర్టులో సోమవారం నాడు ఆయన ఈ పిటిషన్ వేశారు. ఈ కేసుకు సంబంధించి ఏసీబీ వేసిన ఛార్జ్‌షీట్‌లో తన పేరును తొలగించాలని ఆయన కోరారు. నిందితుల జాబితా నుంచి తన పేరును తప్పించాలని పిటిషన్‌లో కేటీఆర్ పేర్కొన్నారు. అయితే, కేటీఆర్ వేసిన డిశ్చార్ పిటిషన్‌పై నాంపల్లి కోర్టు వచ్చే నెలలో(నవంబర్) విచారణ జరపనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో ఎ1 నిందితుడిగా కేటీఆర్ పేరును ఏసీబీ అధికారులు ఛార్జ్‌షీట్‌లో చేర్చిన విషయం తెలిసిందే. ఏసీబీ వేసిన ఛార్జ్‌షీట్‌ను న్యాయస్థానం పరిగణలోకి తీసుకుంది. ఈ కేసులో ఇప్పటికే కేటీఆర్ రెండు సార్లు కోర్టు విచారణకు హాజరయ్యారు. ఇప్పుడు తాజాగా ఏసీబీ ఛార్జ్‌షీట్‌లో తన పేరును తొలగించాలంటూ కేటీఆర్ వేసిన డిశ్చార్జ్ పిటిషన్ వేశారు. అయితే, ఈ కేసుపై ఏసీబీ కోర్ట్ త్వరలోనే విచారణ చేయనున్నట్లు సమాచారం.

కేసీఆర్ బాటలోనే మోడీ

జంతర్‌మంతర్‌పై ఆంక్షలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం: మంత్రి పొంగులేటి



హైదరాబాద్, అక్టోబర్ 12 (మనం బ్యూరో) : ఇందిరా పార్క్ వద్ద ధర్నా చౌక్ ఎత్తివేసిన కేసీఆర్‌కు పట్టిన గతే జంతర్‌మంతర్ వద్ద ఆంక్షలు విధించిన నరేంద్ర మోడీకి పడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజల గొంతు నొక్కిన పాలకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఈమేరకు సోమవారం ఒక ప్రకటనలో ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు ప్రజాస్వామ్యంలో సహజసిద్ధమైన హక్కు అని పేర్కొన్నారు. ఉమ్మడి ఏపీలో ప్రజలు, రాజకీయ పార్టీలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వేదికగా ఉండేదన్నారు. అయితే, కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల నిరసన హక్కును కాలరాస్తూ ధర్నా చౌక్‌ను ఎత్తివేసిందని విమర్శించారు. కేసీఆర్ హైదరాబాద్‌లో నిరసన తెలిపే హక్కు లేకుండా చేస్తే మోడీ ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద నిరసనలపై ఆంక్షలు విధించారని పేర్కొన్నారు. ఇద్దరి ఆలోచనా విధానం ఒక్కటే ప్రజల గొంతును అణచివేయడమే వారి విధానమని విమర్శించారు. ప్రజల నిరసన హక్కును కాలరాస్తే ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రజల గొంతును నొక్కిని ప్రతి పాలకుడికి చివరికి ప్రజల సమాధానమే తుది తీర్పని దానిని ప్రతీ పాలకుడు గమనించాలన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ప్రజలు, రాజకీయ పార్టీలు తమ సమస్యలపై నిరసన వ్యక్తం చేసేందుకు చారిత్రకంగా ఉపయోగించుకున్న జంతర్ మంతర్ వంటి నిరసన వేదికలపై ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి విమర్శించారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటిన నారాయణపేట జిల్లా..

- ఢిల్లీలో అవార్డు అందుకున్న కలెక్టర్ ప్రియాంక
- ప్రధానమంత్రి ధన్‌ధ్యాన్ కృషి యోజన అమలులో అద్భుత ప్రతిభ

హైదరాబాద్,అక్టోబర్12(మనం న్యూస్): నారాయణపేట జిల్లాలో 'ప్రధానమంత్రి ధన్‌ధ్యాన్ కృషి యోజన' పథకం అమలులో జిల్లా యంత్రాంగం అద్భుత ప్రతిభ కనబరిచింది. వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో విశిష్ట సేవలు అందించినందుకు నారాయణపేట జిల్లాకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రతిష్టాత్మక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక సోమవారం ఈ జాతీయ అవార్డును అందుకున్నారు.

ఈ సందర్భంగా పాలనాధికారిణీ ప్రియాంక మాట్లాడుతూ.. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వ్యవసాయాభివృద్ధి కోసం జిల్లా అధికారులు అందరూ అంకితభావంతో, సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ అరుదైన ఘనత సాధ్యమైందని ఆమే వెల్లడించారు. ఈ విజయానికి కృషి చేసిన జిల్లా అధికారులందరికీ, వారి బృందాలకు ఆమె ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి ఈ జాతీయ పురస్కారం ఒక



గొప్ప ప్రేరణగా నిలుస్తుందని కలెక్టర్ ఉద్ఘాటించారు. నారాయణపేటకు దక్కిన ఈ గౌరవం జిల్లా యంత్రాంగంపై బాధ్యతను మరింత పెంచిందని, రానున్న రోజుల్లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత ఉత్సాహంగా అమలు చేస్తామని పాలనాధికారిణీ ప్రియాంక పేర్కొన్నారు.

ప్రియమైన సాయీ!



ఒకసారి లేచిరా నా ప్రియ మిత్రమా!
కప్పులో పొగలు చిమ్ముతున్న నల్లటి చిక్మగూర్ కాఫీ
హాలులో బల్లపై ఉప్మా ప్లేటు నీకై ఎదురుచూస్తున్నాయి.
చెదిరిన నీ ముంగురులు సరిచేయమని
నీ గుండ్రపాటి దువ్వెన చెపుతున్నది
మరచిపోకు నన్ను అంటూ
షర్ట్ జేబును గుంజింది నీ పెన్ను
ఫిజియోథెరపీకి వెళ్లే టైం అయ్యిందని
నీ వీల్ చైర్ తొందరపెడుతోంది.
గుమ్మం ముందు స్వేచ్ఛాజీవిగా
తెల్లటి సిగరెట్ పొగలు వూద
ఒకసారి లేచి రా ప్రియ మిత్రమా!

నీ పొడవాటి చేతివేళ్ళ నుండి జాలువారే
అందమైన అక్షరాల సరాలు
బ్లాక్ బోర్డు మీద సవరించేది ఎపుడు అని
చాక్ పీస్ తహతహలాడుతున్నది
నువ్వు చెప్పే జీవన పాఠాలు
వినడానికి నీ విద్యార్థులు
కొత్త ఉత్తేజంతో వేచి ఉన్నారు
తరగతి గదిలో అడుగిడ
ఒకసారి లేచి రా ప్రియమైన మాస్టారూ!

నీకిష్టమైన చేపల పులుసు, రొయ్యల వేపుడు
రుచి చూడమని పోటీ పడుతున్నాయి
బజారు నుండి తెచ్చిన తెల్ల వంకాయలు
కడిగి బట్ట మీద అరబెట్టిన ఆవాలు, నువ్వులు
పొడుం చేసిన కారం, పుప్పు, నూనె అన్నీ సిద్ధం
వంకాయ అవకాయ పెడుదువు గానీ
ఒకసారి లేచి రా ప్రియ నేస్తమా!

బ్రెజిల్ నుండి నువు తెచ్చి నాటిన
ఏపుగా ఎదిగిన తేజ్ పత్తా మొక్క చిగురించకుండా
వాడిపోయిన వైనాన్ని చెప్పలేక
ఎంతగా వ్యాకుల పడ్డాను!
జైలు నుండి నువు వచ్చాక ఇంటి వెనుక తోటలో
మనిద్దరం కలసి నాటిన మొక్కలు
వాడి పోయినవి నీవు లేక
గులాబీలు, బంతి, చామంతులు,
నాటుదామన్నావు
కొత్త కుండీలు కొనడానికి వెళ్లాము
ఒకసారి లేని రా ప్రియమైన తోటమాలీ!

వెనుక రైలింగ్‌పై గుమిగూడిన
బూడిద రంగు పక్షుల కిచకిచల



జోరు గొడవల పంచాయితీ తీర్చ...
ఒకసారి లేచి రా ప్రకృతి ప్రియుడా!

నీ స్ఫూర్తిని, ఆదరణను అందుకున్న ఎందరో
నిన్ను కలిసి కళ్లనిండా నిలుపుకోవాలని
మనింటి ముంగిట వెల్లువై వచ్చారు
నీ చివరి సందేశం, కరచాలనం అందించ
ఒకసారి లేచి రా ప్రియమైన విశ్వమానవుడా!

అనంతమైన మన ప్రేమకు, ఆచరణకు
నిలువుటద్దంలా మన మంజీర
గుప్పిటనిండా చర్చించాల్సిన అంశాలతో
ఐసియు గుమ్మం ముందు తచ్చాడుతుంది
ముద్దుల కూతురితో భవిష్యత్ ప్రణాళికలు రచించ
ఒకసారి లేచి రా ప్రియమైన నాన్నా!

కొబ్బరాకుల దాటున తొంగిచూసే
కిరణాల సొగసులో
వేప పూల పరిమళాల ఆస్వాదనలో
అలవోకగా ముంగురులను సవరిస్తూ
నా స్నేహం, నా ప్రేమ లేకుండా
ఈ జీవితానికి అర్థం లేదన్నావు
మనిద్దరం ఒకరికొకరం
తోడు నీడ అన్నావు
చిన్ననాటి నీ అమనితో చేసిన బాసలు తీర్చ
ఒకసారి లేచి రా
నా ప్రియమైన ప్రాణ స్నేహితుడా!

పది సంవత్సరాల ఎడబాటును మరచి
నీ రాకతో సంతోషంలో
తలమునకలవుతున్న వేళ నీ
ఆకస్మిక నిష్క్రమణ మనసును మెలిపెడుతున్నది
అంతులేని వేదనతో బలహీనమైన
నా హృదయం! ఇంకిపోయిన కన్నీళ్లతో
నిండిపోయిన నా కళ్ళు
నీ ప్రేమ నిండిన పెదవుల
స్పర్శకి తపన పడుతున్నాయి.
ముందున్న జీవిత గమనానికి
సరిపోయేంత భరోసానిచ్చే
చివరాఖరి గాఢాలింగనంలో నన్ను బంధించ
ఒకసారి లేచి రా సాయీ నా ప్రియతమా!

స్మరణతో...
- వసంత

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు

ఢిల్లీలో అప్రకటిత ఎమర్జెన్సీ!



దేశ రాజధాని ఢిల్లీ సుల్తానుల ఏలుబడిలోనో, లేక బ్రిటిషు దొరల అణచివేత పాలనలోనో లేదు. అది రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన స్వతంత్ర భారత ప్రజాస్వామ్యంలో ఉందనే నిజాన్ని నేటి పాలకులు పూర్తిగా మరచిపోయినట్లున్నారు. సమకాలీన భారత రాజకీయ యవనికపై చోటుచేసుకుంటున్న పరిణామాలు, ప్రత్యేకించి దేశ రాజధాని ఢిల్లీ వీధుల్లో విరుచుకు పడుతున్న ఆంక్షల పర్వం స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే అత్యంత హేయమైన, చీకటి అధ్యాయాన్ని ఆవిష్కరిస్తున్నాయి.

గతంలో ఇందిరా గాంధీ స్వయంకృతాపరాధంతో దేశంపై రుద్దిన ఎమర్జెన్సీ కాలపు నల్లటి రోజులను, నేడు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పునరావృతం చేస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు. నాటి ఇందిరమ్మ నిరంకుశత్వానికి, నేటి మోదీ సర్కార్ అణచివేత ధోరణికి మధ్య ఎలాంటి తేడా లేకపోగా, మరింత ఆధునిక సాంకేతిక రూపాలతో పౌరహక్కుల గొంతును దారుణంగా నలిపివేస్తున్నారు.

శాంతియుతంగా నిరసన తెలిపే పౌరులను, హక్కుల ప్రచారకర్తలను, రాజ్యాంగాన్ని రక్షించాల్సిన న్యాయవాదులను వారినివాసాల నుంచే దొంగల్లా అదుపులోకి తీసుకోవడం ఏ రకమైన ప్రజాస్వామ్య సంప్రదాయం? 'శాంతిభద్రతల పరిరక్షణ' అనే బూటకపు సాకు చూపి, ప్రజలు తమ నిరసనను వ్యక్తం చేయకుండా ముందస్తు నిర్బంధాలు చేపట్టడం ప్రభుత్వ అధికారగర్వానికి, నిరంకుశత్వానికి పరాకాష్ట. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 పౌరులకు ప్రసాదించిన ప్రాథమిక భావప్రకటన స్వేచ్ఛను, శాంతియుతంగా సమావేశమయ్యే హక్కును కాగితాలకే పరిమితం చేస్తూ, పోలీసు యంత్రాంగాన్ని సొంత అజెండా కోసం వాడుకోవడం అత్యంత గర్హనీయం. జంతర్‌మంతర్ వంటి నిర్దేశిత నిరసన ప్రాంతాలకు కిలోమీటర్ల దూరంలో ఉన్న నివాసాల్లోకి చొరబడి అరెస్టులు చేయడం ప్రభుత్వ భయానికి స్పష్టమైన నిదర్శనం. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే గొంతుకలను భద్రతా కారణాల ముసుగులో తొక్కిపెట్టాలని చూడటం పాలకులు తమ బలహీనతను బయట పెట్టుకోవడమే తప్ప మరొకటి కాదు.

ఒకప్పుడు వార్తాపత్రికల ముద్రణను నిలిపివేసి, ప్రసార సాధనాలపై సెన్సార్‌షిప్ విధించి సమాచార రవాణాను ఆపేసిన నిర్బంధ ధోరణిని నేడు 'డిజిటల్ బంద్' రూపంలో కొత్తగా అమలు చేస్తున్నారు. జన్‌పథ్, కర్తవ్యపథ్ వంటి కీలక ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను అర్ధాంతరంగా నిలిపివేయడం, నగరంలోని దాదాపు 57 ప్రధాన మెట్రో స్టేషన్లను ఏకపక్షంగా మూసివేసి లక్షలాది మంది సామాన్య ప్రజల నిత్యజీవితాన్ని స్తంభింపజేయడం పాలకుల భయానికి నిదర్శనం. విమర్శలను ఎదుర్కొనే ధైర్యం లేక, ప్రభుత్వం చేతికి మట్టి అంటుతుందనే భయంతో నగరంలో డిజిటల్ కమ్యూనికేషన్ను స్తంభింపజేయడం కేవలం సమాచారాన్ని నిలిపివేయడం కాదు. పౌరుల జీవనోపాధిని, స్వేచ్ఛాయుత జీవనాన్ని బందీ చేయడమే. ఆధునిక యుగంలో ఇంటర్నెట్ ఆపివేయడం పౌరుల ప్రాథమిక సమాచార హక్కుపై పాలకుల సర్జికల్ స్ట్రైక్ లాంటిది.

ఈ రకమైన విచక్షణారహిత అణచివేతపై దేశ అత్యున్నత న్యాయస్థానం స్పందించిన తీరు ప్రాధాన్యత సంతరించుకుంది. జస్టిస్ బాగ్చి నేతృత్వంలోని ధర్మాసనం 'నిరసన



కారులపై జరిగిన ఘటనలను తేలికగా తీసుకోం' అని తేల్చిచెప్పడం రక్షక భటుల నిరంకుశత్వానికి లభించిన తొలి చెంపపెట్టు. ఏకంగా సుప్రీంకోర్టు పరిసరాల్లోనూ సెక్షన్ 144 (బీఎన్ఎస్ఎస్163) విధించి, విధులకు హాజరయ్యే న్యాయవాదులను సైతం భయభ్రాంతులకు గురిచేయడం యంత్రాంగాల నియంత్రణ లేని అధికార దాహానికి అద్దం పడుతోంది. కోర్టు తక్షణమే స్పందించి చట్టవిరుద్ధ నిర్బంధాలపై పూర్తి స్థాయి నివేదిక కోరడం, సేవలను పునరుద్ధరించాలని సూచించడం రాజ్యాంగ పరిరక్షణలో న్యాయవ్యవస్థ ప్రాధాన్యతను మరోసారి చాటిచెప్పింది.

'ఢిల్లీ పీఠం నుండి ఢిల్లీ వీధుల వరకు' సాగుతున్న ఈ ఘర్షణ కేవలం రెండు వర్గాల మధ్య పోరాటం కాదు. ఇది నిరంకుశత్వానికి, ప్రజాస్వామ్య స్ఫూర్తికి మధ్య జరుగుతున్న చారిత్రక యుద్ధం. అధికార పీఠంపై కూర్చున్న ప్రధాని మోదీ ప్రభుత్వం ఏ రకమైన అణచివేత వైఖరిని అవలంబిస్తోందో,అదే ఢిల్లీ వీధుల్లో సామాన్య పౌరుల తీవ్ర నిరసనల రూపంలో బట్టబయలవుతోంది. గతంలో 1974లో ఇందిరా గాంధీ తన అధికార దర్పంతో పౌర హక్కులను తొక్కిపట్టినప్పుడు, ఇదే ఢిల్లీ వీధుల నుంచి ఎగిసిపడిన ప్రజాస్వామ్య తిరుగుబాటు ఆమె సింహాసనాన్ని ఎలా కూకటివేళ్లతో కూల్చివేసిందో మోదీ సర్కార్ చరిత్ర పుటలు తిరగేసి చూసుకోవాలి. పౌరుల సహనానికి కూడా సరిహద్దులు ఉంటాయని పాలకులు గుర్తించాలి.

రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలు తాత్కాలికం, కానీ ప్రజలు మరియు వారికి రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కులు శాశ్వతం. ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సింది పోయి, రక్షణ వ్యవస్థలను ఆయుధాలుగా మార్చుకుని పౌరులను భయభ్రాంతులకు గురిచేసే ఏ ప్రభుత్వమూ చరిత్రలో శాశ్వతంగా నిలవలేదు. అధికార గర్వంతో విర్రవీగుతూ పౌర సమాజం గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తే, దేశప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. ఇప్పటికైనా అప్రకటిత ఎమర్జెన్సీ వైఖరిని వీడి, పౌరుల రాజ్యాంగ హక్కులను పునరుద్ధరించకపోతే.. చరిత్ర ఇందిరా గాంధీని ఎలా క్షమించలేదో, నేటి పాలకులను కూడా అదే బోనులో నిలబెడుతుంది!

- వెంక గారి భూమయ్య
9848559863

హిందూ మతాన్ని స్వీకరించిన తొలి విదేశీ సిస్టర్ నివేదిత

వివేకానందుడి బోధనలకు ప్రభావితమై హిందూ మతాన్ని స్వీకరించిన మొదటి విదేశీ మహిళగా సిస్టర్ నివేదిత చరిత్రను సృష్టించింది. మహిళలకు సరైన విద్యావకాశాలు కల్పించి విద్యావంతులను చేసినపుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఉద్ఘాటించిన సిస్టర్ నివేదిత మహిళా విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేసింది. ఐర్లాండ్‌లోని కౌంటీ టైరాన్‌లో 1867 అక్టోబర్ 28న మార్గరెట్‌గా జన్మించింది. లండన్‌లోనిచర్చి బోర్డింగ్ స్కూల్లో, హాలిఫాక్స్ కాలేజీలో ఆమె చదువు సాగింది. ఒకవైపు చదువు కొనసాగిస్తుండగానే, పదిహేడేళ్ల వయసులోనే చిన్నపిల్లలకు టీచర్‌గా పాఠాలు బోధించేది. తర్వాతి కాలంలో వింబుల్డన్‌లో స్వయంగా ఒక పాఠశాలను నెలకొల్పింది. కాలేజీ చదువు పూర్తయ్యాక వేల్స్‌కు చెందిన ఒక యువకుడితో నిశ్చితార్థం జరిగింది. నిశ్చితార్థం జరిగిన కొద్ది రోజులకే ఆయన ఆకస్మికంగా మరణించాడు. ఆ షాక్ నుండి త్వరగా తేరుకో లేకపోయింది. మనశ్శాంతి కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనేది. లండన్‌లోని ఒక సంపన్నుని ఇంట ఏర్పాటు చేసిన స్వామీ వివేకానంద వేదాంత ప్రసంగం కార్యక్రమానికి ఒక స్నేహితురాలి ద్వారా హాజరైంది. అక్కడక్కడ సంస్కృత శ్లోకాలను ఉటంకిస్తూ సాగిన వివేకానందుని వాక్ప్రవాహానికి ఆమె మంత్ర ముగ్ధురాలైంది. ఇక అప్పటి నుంచి లండన్‌లో వివేకానందుని కార్యక్రమాలన్నింటికీ క్రమం తప్పకుండా హాజరయ్యేది. సేవా దృక్పథమే ఆమెను లండన్ నుంచి కలకత్తాకు రప్పించింది. జీవితం అగమ్యంగా మారిన స్థితిలో తారసపడ్డ గురువు స్వామి వివేకానంద బోధనలే శాంతి మార్గమని నమ్మింది. అన్నీ వదులుకుని ఆయనతో కలసి భారత్‌కు వచ్చేసింది. అచిర కాలంలోనే సోదరి నివేదితగా భారతీ యులకు చిరపరిచితు రాలైంది.

వివేకానందుడి పిలుపుతో ఆమె సముద్ర మార్గంలో 1898 జనవరి 28న కలకత్తా చేరుకుంది. వివేకా నందుడి గురువైన రామకృష్ణ పరమహంస సాధనలతో గడిపిన దక్షిణేశ్వర ఆలయాన్ని సందర్శించుకుంది. కలకత్తాలో 1898 మార్చి 11న ఏర్పాటైన బహిరంగ కార్యక్రమంలో స్వామి వివేకానంద తొలిసారిగా మార్గరెట్‌ను ప్రజానీకానికి పరిచయం చేశారు. కొద్ది రోజులకే ఆమె రామకృష్ణ పరమహంస సతీమణి శారదా దేవిని కలుసుకుని ఆశీస్సులు తీసుకుంది. జీవితాంతం బ్రహ్మచర్య దీక్షను అవలంబిస్తానని ప్రతిన బూనడంతో స్వామి వివేకానంద ఆమె పేరును 'సోదరి నివేదిత'గా మార్చారు. నివేదిత అంటే భగవంతునికి సమర్పణ చేయబడినది అని అర్థం. నివేదితగా మారిన తర్వాత వివేకానందునితో కలసి ఆమె విస్తృతంగా భారత దేశమంతటా పర్యటించింది. నిధుల సేకరణ కోసం, ఆధ్యాత్మిక ప్రచారం కోసం అమెరికా కూడా వెళ్లింది. అల్మోరాలో ఉన్న సమయంలో ధ్యానం చేయడం లో శిక్షణ పొందింది. భారతదేశం గొప్ప మహిమాన్విత దేశమని పొగుడుతూ పాశ్చాత్య దేశాల్లోని తన మిత్రులకు ఉత్తరాలు రాసేది.

వివేకానంద బోధన గురించి, తనపై వాటి ప్రభావం గురించి తాను రాసిన 'ది మాస్టర్ యాజ్ ఐ సా హిమ్' పుస్తకంలో వివరించింది. ఇతరులపై దయా గుణంతో మెలిగే ఆమె, మంచి అభిరుచి గల కళాకారిణి. సంగీతంలోనూ, చిత్రకళలోనూ ఆమెకు ప్రవేశం ఉండేది. ఉపాధ్యాయురాలిగా పనిచేసిన అనుభవం ఉన్న నివేదిత భారత్‌లోనూ విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసింది. ముఖ్యంగా బాలికల విద్యకోసం ఆమె 1898 నవంబరులో కలకత్తాలోని బాగ్‌బజారులో పాఠశాలను ప్రారంభించింది. కనీస విద్యలేని బాలికలకు విద్యను అందించడం లక్ష్యంగా ఆమె పనిచేసింది. అన్నికులాల మహిళలకు చదువు తప్పనిసరిగా రావాలని ఆమె ఆకాంక్షించింది. బెంగాల్ మహిళలతో, మేధావులతో పరిచయాలను ఏర్పాటు చేసుకుని బాలికల విద్యకోసం ఎంతో శ్రమించింది. విశ్వకవి రవీంద్రనాథ టాగూరు, జగదీశ్ చంద్ర బోస్ తదితర ప్రముఖులతో స్నేహసంబంధాలను కొనసాగించింది. 1899 సంవత్సరం మార్చిలో కలకత్తావాసులకు ప్లేగ్ వ్యాధి సోకినప్పుడు తన శిష్యులతో కలిసి వైద్యసేవలు అందించింది. భారత మహిళల ఔన్నత్యం గురించి, ఆచార వ్యవహారాల గురించి న్యూయార్క్ , షికాగో మొదలైన నగరాల్లో ఆమె ప్రసంగించింది.



వివేకానందుని బోధలను యువతరానికి చేర వేసేందుకు అహరహం కృషి చేసింది. భారత స్వాతంత్ర్యోద్యమాలకు ఇతోధికంగా తోడ్పాటు నందించింది. స్వాతంత్ర్య సమర యోధుడు, ఆధ్యాత్మికవేత్త అరబిందో ఆధ్వర్యంలో వెలువడే 'కర్మయోగి' పత్రికకు సంపాదకురాలిగా సేవలం దించింది. మేధా సంపత్తిలో భారతదేశం అద్వితీయమైనదని ప్రపంచానికి చాటింది.భారతీయతను పూర్తిగా ఆకలింపు చేసుకున్న ఆమె మహిళావిద్య కోసం ఎంతగానో పాటు పడింది. భారత దేశంతో, భారత ప్రజలతో మమేకమై జీవించిన ఆమె స్ఫూర్తి నేటికీ కొనసాగుతూనే ఉంది. 1906లో బెంగాల్‌కు వరదలు వచ్చినప్పుడు బాధిత ప్రజలకు ఆమె చేసిన సేవ, అందించిన మానసిక ధైర్యం ఎంతో విలువైనవి. భారతీయత ను పుణికిపుచ్చుకున్న స్వామి వివేకానందతో అనేక దేశాలు పర్యటించి ప్రసంగించిన ఆమె డార్జిలింగ్‌లో ఉండగా, అనారోగ్యానికి గురైన నివేదిత 1911 అక్టోబర్ 13న తన 43వ ఏట తుదిశ్వాస విడిచింది. ఆమె పేరిట ఏర్పాటైన పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు నేటికీ ఆమె సేవానిరతికి నిదర్శనాలు.

అక్టోబర్ 13... సిస్టర్ నివేదిత వర్ధంతి
- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

బ్రహ్మాండ నాయకునికి బ్రహ్మోత్సవం

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అనగానే భక్తజన ప్రవాహం, తన్మయత్వంతో మిన్నంటేలా వారు చేసే గోవింద నామ స్మరణ, మాడ వీధుల్లో దేవేరులతో స్వామి ఊరేగింపులూ, సాటిలేని వైభవంతో సాగే వాహన సేవలు కళ్ళ ముందు కదులుతాయి. బ్రహ్మోత్సవాల్లో స్వామి వారిని వివిధ రూపాల్లో, అవతారాల్లో దర్శనం చేసుకున్న వారికి అనుకున్న కార్యాలు దిగ్విజయంగా పూర్తి కావడంతో పాటు.. పుణ్యఫలాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. తిరుమల చరిత్రలో, వందల ఏళ్ళనుంచీ వివిధ ఉత్సవాల నిర్వహణ జరుగుతున్నది. ఎందరో రాజులు, ఆర్కాటు నవాబులు, ఈస్టిండియా కంపెనీ ప్రతినిధులు, బ్రిటిష్ అధికారులు, తర్వాత హథీరాం మహంతుల హయాంలో ఉత్సవాలు కొనసాగాయి.



పురాణాలు, శాసనాల ఆధారంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు 6వ శతాబ్దంలో ప్రారంభమైనట్లు తెలుస్తోంది. చక్రవర్తులు, మహారాజులు తమ విజయ పరంపరలకు గుర్తుగా తిరుమలేశుని బ్రహ్మోత్సవాల పేరుతో వైభవంగా ఉత్సవాలను నిర్వహించేవారు. నెలకొకటి చొప్పున ప్రతి ఏటా పన్నెండు బ్రహ్మోత్సవాలు కూడా జరిగేవని చరిత్ర చెబుతోంది. క్రీ.శ.614లో పల్లవరాణి సమువాయ్ (పేరిందేవి) మనవాళ పెరుమాళ్ అనే వెండి భోగ శ్రీనివాసమూర్తి విగ్రహాన్ని తిరుమల ఆలయానికి బహుకరించింది.పెరటాసి నెలలో (కన్యామాసం) జరిగే బ్రహ్మోత్సవాలకు ముందు ఈ వెండి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించేవారు. ఆ తరువాత క్రీ.శ.1254 చైత్ర మాసంలో తెలుగు పల్లవరాజు విజయగండ గోపాలదేవుడు, క్రీ.శ.1328 ఆషాఢ మాసంలో ఆడి తిరునాళ్ల పేరుతో త్రిభువన చక్రవర్తి తిరు వేంకట యాదవ రాయలు, క్రీ.శ.1429 ఆశ్వయుజ మాసంలో వీరప్రతాప దేవ రాయలు, క్రీ.శ.1446లో మాసి తిరునాళ్ల పేరుత హరిహరిరాయలు, క్రీ.శ.1530లోఅచ్యుతరాయలు బ్రహ్మోత్సవంగా ఉత్సవాలు నిర్వహించేవారని చరిత్ర చెబుతోంది. క్రీ.శ.10వ శతాబ్దంలో తిరుమలలో 11రోజులపాటు బ్రహ్మోత్సవాలు జరిగేవి. క్రీ.శ.1339 నుంచి మలయప్ప కోనలో లభించిన మలయప్పస్వామిని ఉత్సవ విగ్రహాలుగా తయారు చేసి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతోంది.

కలియుగ వైకుంఠంలా అలరారుతోన్న తిరుమలలో ఏడాది వార్షిక (సాల కట్ల) బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజుల పాటు సాంప్రదాయ రీతిలో కన్నుల పండువగా కొనసాగ నున్నాయి. భాద్ర పదంలో నిర్వహించే ఉత్సవాలను సాల కట్ల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 11న అంకురార్పణతో ప్రారంభం అయి 20 వరకు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలను ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా, లక్షలాది మంది భక్తుల మధ్య నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది.

బ్రహ్మోత్సవాలను ప్రారంభించే ముందు ఎటువంటి ఆటంకాలు కలగకుండా, విజయవంతంగా జరగాలని కోరుకుంటూ వైఖాసన ఆగమనంలోని క్రతువులలో 11న అంకురార్పణంతో ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు. శ్రీవారి సేనాధిపతి అయిన విశ్వక్సేనుల వారి ఆలయానికి నైరుతిమూలలో ఉన్న వసంత మండపానికి ఊరేగింపుగా వెళ్ళి, అక్కడ భూమాతకు ప్రత్యేక పూజలు చేసి, ఆ మట్టిలో నవధాన్యాలను నాటడాన్ని అంకురార్పణం అంటారు.

ప్రతిరోజు ఉదయం 8 నుండి 10 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు స్వామి వారి వాహన సేవలుజరుగుతాయి. గరుడ వాహనం రాత్రి 7 నుండి తెల్లవారు జామున 2 గంటల వరకు నిర్వహిస్తారు. ధ్వజారోహణం ఘట్టంతో తొమ్మిది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

అక్టోబర్ 12నుండి అక్టోబర్ 20 వరకు తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

పూల పండుగ 'బతుకమ్మ'

తెలంగాణ అంటే బతుకమ్మ. బతుకమ్మ అంటే తెలంగాణ. స్త్రీత్వానికి పోషక దేవతగా గౌరీ దేవిని ఆరాధిస్తారు. మహిళాలోకానికి ఇష్ట దైవమైన'గౌరి(పార్వతి)అమ్మ' వారిని ఆటపాటలతో కొలుచుకునే పూల పండుగ బతుకమ్మ. ఊరు, వాడ ఆడపడుచులు అందరూ ఎక్క చోట చేరి పూల బతుకమ్మలను మధ్యలో అమర్చి వాటి చుట్టు చేరి సాంప్రదాయ పద్ధతుల్లో పాటలు పాడుకుంటూ, నాట్యాలు చేస్తూ, బతుకమ్మ పండుగను వైభవోపేతంగా జరుపుకుంటారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు ప్రతీక. ప్రకృతి అందాలను ఆరాధిస్తూ, పుడమి చల్లి విశిష్టతను కీర్తిస్తూ, ఆనందాల తోరణాలను కట్టి, పడుచులంతా ఒక్క చోట చేరి జరుపుకునే 9 రోజులు జరుపుకునే పండుగగా బతుకమ్మకు గుర్తింపు ఉన్నది. ప్రకృతి సిద్ధంగా తెలంగాణ ప్రాంతాల్లో లభించే అందమైన, రంగు రంగుల పూలను సేకరించి బతుకమ్మలను పేర్చుతారు. చెలకలు, చేనుల్లో మొలిచే సహజ పువ్వులైన తంగేడు, గునుగు, గుమ్మడి, కట్ల పూలు, సీత జడ పూలు లాంటివి సేకరించి బతుకమ్మలను పేర్చి మధ్యలో గుమ్మడి పూవ్వును, గౌరమ్మను అమర్చి కొలుచుకుంటారు. తంగేడు పువ్వు శక్తికి, గుమ్మడి పువ్వు మంగళకరమైన సౌందర్యానికి ప్రతీకలుగా తీసుకుంటారు.

ప్రతి ఏట మహాలయా అమావాస్య (పెత్తా మాస లేదా పితృ అమావాస్య) రోజున 10 అక్టోబర్ 2026 'ఎంగిలి పూల బతుకమ్మ'తో మొదలై తొమ్మిదవ రోజు 18 అక్టోబర్ 2026న 'సద్దుల బతుకమ్మ'తో ముగుస్తుంది. బతుకమ్మపై అమర్చిన పసుపుతో చేసిన గౌరమ్మను మహిళలు తమ మంగళ సూత్రాలకు పెట్టుకొని దీర్ఘ సుమంగళిగా ఉండాలని అమ్మ వారిని కోరుకుంటారు. తీరొక్క పూలతో చేసిన పెద్ద పెద్ద బతుకమ్మలను సమీప చెరువు వద్దకు చేర్చి, వలయాకారంలో నిలబడి, నెమ్మదిగా లయబద్ధంగా కదులుతూ, పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ, కోలాటాలు ఆడుతూ, ఆటపాటలతో సంబరాలు చేసుకుంటారు. చివరకు సమీప చెరువుల్లో బతుకమ్మను నిమజ్జనం చేసి ప్రసాదాలు పంచి పెడతారు. ప్రతి రోజు ఒక నైవేద్యాన్ని



తయారు చేసి దేవతకు సమర్పిస్తారు. 10 అక్టోబర్ 2026 రోజున 'ఎంగిలి పూల బతుకమ్మ'తో ప్రారంభమైన తొమ్మిది రోజుల పాటు 'అటుకుల బతుకమ్మ', 'ముద్దపప్పు బతుకమ్మ', 'నానే బియ్యం బతుకమ్మ', 'అట్ల బతుకమ్మ', 'అలిగిన బతుకమ్మ', 'వేపకాయల బతుకమ్మ', 'వెన్న ముద్దల బతుకమ్మ', 18 అక్టోబర్ రోజున 'సద్దుల లేదా పెద్దబతుకమ్మ' పండుగలను నిర్వహించు కుంటారు.

బతుకమ్మ పండుగ ప్రారంభ నేపథ్యం అతి పురాతనమైనది. ధర్మాంగుడు అనే రాజుకు వంద సంతానం కలిగిన పుట్టిన తర్వాత చని పోతుంటారు. దుఃఖంలో మునిగిన రాజు దంపతులకు లక్ష్మీ దేవి రూపంలో వందవ సంతానంగా ఆడ బిడ్డ జన్మిస్తుంది. ఆ చిన్నారి పలు అనారోగ్యాలను జయిస్తూ, మునుల నుంచి 'నవ్వు కలకాలం బతుకమ్మ' అంటూ దీవించబడుతుంది. నాటి నుంచి నేటి వరకు తెలంగాణ ప్రాంతానికే ప్రత్యేకమైన పర్వదినాలుగా 'బతుకమ్మ' పండుగను జరుపు కుంటున్నారు. పూల రంగుల మేళవింపుతో ప్రతి ప్రాంతం బతుకమ్మ పూదోటగా గుబాళిస్తుంది. బతుకమ్మ పాటల్లో పల్లె అందాలు, ప్రకృతి పట్ల మమకారాలు, పంట చేల పట్ల ఆరాదణలు స్పష్టంగా కనిపిస్తాయి.

బతుకమ్మ పాటల్లో పల్లెతనం, అమాయకత్వం, ఒక ప్రకృతి ఆరాధన, ఒక కథ, ఒక సంస్కృతి, ఒక ఆశ, ఒక స్ఫూర్తి దాగి ఉంటాయి. బతుకమ్మ పండుగకు ముందు ఏడు రోజుల పాటు బొడ్డెమ్మ పండుగ జరుపుకుంటాం.

పువ్వులు విరివిగా వికసించే కాలం, చెరువులు నిండు గర్భిణీలుగా కనిపించే కాలంలో వచ్చే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన గీతికగా, సంస్కృతిక ప్రతీకగా నిలుస్తున్నది. తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్గా పూల బతుకమ్మ సదా నిలుస్తున్నది.అందరి ఆనంద ఆరోగ్యాలకు కారణం అవుతున్నది నేలతో నీటితో మానవులకు ఉన్న అనుబంధాన్ని బతుకమ్మ చాటుతున్నది.

- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

ఎల్ నినో వంటి విపత్కర పరిస్థితులను ముందస్తుగా ఎదుర్కోవాలి



కరీంనగర్ అక్టోబర్ 13 మనం బ్యూరో): ఎల్ నినో వంటి విపత్కర పరిస్థితులలో రాష్ట్ర ప్రజలను కాపాడేందుకు ముందస్తు ప్రణాళికలతో ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఎల్ నినో ప్రభావం, ఉత్పన్నమయ్యే పరిస్థితులపై వాస్తవ పరిస్థితులను రాష్ట్ర రైతాంగానికి వెల్లడించేందుకు ఉద్దేశించి సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైతు వేదికలలో లక్షలాది మంది రైతులకు తెలియజేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఢిల్లీ నుండి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి రాష్ట్ర రైతాంగంతో మాట్లాడుతూ ప్రపంచ వాతావరణ సంస్థ నివేదిక ప్రకారం ఈ సంవత్సరం ఏర్పడ్డ ఎల్ నినో డిసెంబర్లో పూర్తి గరిష్ట స్థాయికి చేరనుందని, 2027 వరకు ఇలాంటి పరిస్థితులు నెలకొంటాయన్న అంచనా ఉన్నట్లు తెలిపారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ఇదివరకే దక్షిణాఫ్రికా దేశాలలో తక్కువ వర్షపాతం నమోదయి అధిక ఉష్ణోగ్రతల వల్ల ప్రజలు,రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.వ్యవసాయ అనుబంధ రంగాల్లో, తాగునీటికి ఇబ్బందులు ఏర్పడే పరిస్థితులు ఉన్నాయన్నారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని విపత్తులో ప్రజలను, రైతులను కాపాడుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గడిచిన నాలుగు నెలల నుండి వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, జిల్లా యంత్రాంగాల ద్వారా అప్రమత్తం చేస్తున్నదని,ఎల్ నినో అనేది ఒక విపత్తు అని ,ఈ ప్రమాదకర విపత్తులో ప్రజలను, రైతులను అప్రమత్తం చేస్తూ వారిని కాపాడుకునేందుకు అందరూ సహకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ముఖ్యంగా అన్ని రాజకీయ పార్టీలు రాజకీయాలకతీతంగా రైతులను కాపాడుకునేలా ప్రవర్తించాలని కోరారు. ఎల్ నినో పరిస్థితులలో తాగునీరు అత్యంత ముఖ్యమైనదని, దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలోని ప్రజలు, రైతులు జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం సాగు చేసిన పంటలు, నీటి వనరులు కాపాడుకోవాలని, పంటల సాగులో నష్టాలను తగ్గించి రైతుల ప్రయోజనాలను కాపాడాలని, శాస్త్రవేత్తల సూచనల ప్రకారం వారి ఆలోచన ప్రకారం ముందుకెళ్లాలని, నీరు అందుబాటులో లేని ప్రాంతాల్లో సాగు చేయడం వల్ల నష్టం ఏర్పడుతుందని, జలాశయాల్లో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు వినియోగించాలని, వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు ప్రకారం తక్కువ కాలంలో పండే పంటలు వేసుకోవాలని, నీరు లేని చోట అసలు వ్యవసాయం సాగు చేయవద్దని, కొత్తగా నాటిన ఉద్యాన పంటలు కాపాడుకోవాలని, విత్తనాల లభ్యత, ఉద్యాన పంటల సాగు, తక్కువ కాలంలో చేతికొచ్చే పంటలపై శాస్త్రవేత్తలను, వ్యవసాయ అధికారులను సంప్రదించాలని,ఎల్ నినో పై వదంతులను నమ్మవద్దని, రానున్న జూన్, జూలై వరకు కూడా వర్షం పడే అవకాశం లేదని అన్నారు. రిజర్వాయర్లు, ప్రాజెక్టులు, చెరువులలో అందుబాటులో ఉన్న నీటిని వ్యవసాయానికి కాకుండా తాగునీటికి వినియోగించాలని, లేకుంటే మనుషులు ,పశువులకు తాగునీరు దొరికే పరిస్థితి లేదని, అవసరమైతే రెండు సంవత్సరాల వరకు నీరు నిలువ ఉంచుకొని జాగ్రత్తగా కాపాడుకునేలా ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్ నినో పరిస్థితులను రైతు సోదరులు విపత్తుగా భావించి సహకరించాలని, సమాజంలోని ప్రతి ఒక్కరూ శాంతియుతంగా ప్రభుత్వానికి సహకరిస్తే సమాజాన్ని కాపాడగలుగుతామని అన్నారు.

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎల్ నినో విపత్తు పొంచి ఉందని, ఈ విషయమై రైతులను ముందుగానే అప్రమత్తం చేశామని, దీనివల్ల రాష్ట్రంలో సుమారు 15 లక్షల ఎకరాల వరి విస్తీర్ణం తగ్గిందని, రాబోయే రోజుల్లో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉండే అవకాశం ఉందని, పసిఫిక్ మహాసముద్రంలో వడగాలుల వల్ల వర్షాలు తగ్గి, ఉష్ణోగ్రతలు పెరిగాయని, రైతులు పరిస్థితులు అర్థం చేసుకొని మెలగాలని ,వచ్చే సీజన్ వరకు కూడా వర్షాలు రాకపోవచ్చని అన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితులు ఉన్నప్పటికీ రాష్ట్రంలో 10 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేశామని, ఉన్న వనరులతో పంటలు పండించుకునేందుకు ప్రణాళిక రూపొందించామని, జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, రైతులు ఎల్ నినోను ప్రపంచ విపత్తుగా భావించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. రిజర్వాయర్లు, ప్రాజెక్టులలో ఉన్న నీటిని ఏ విధంగా వాడుకోవాలో జిల్లా కలెక్టర్లు ప్రణాళిక రూపొందించాలని, ఎట్టి పరిస్థితులలో సాగునీటికి నీరు వాడడానికి అవకాశం లేదని, విద్యుత్ పరిస్థితులు కూడా సరిగా లేవని, రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ హైడల్ విద్యుత్ ఉత్పత్తికి అవకాశం లేదని, థర్మల్ పవర్ కి కూడా సమస్యలు ఉన్నాయని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని రైతులు నూనేగింజలు, పప్పు ధాన్యాలు మాత్రమే పండించాలని,సాగులో ఉన్న పంటలను కాపాడుకోవాలని, అతి తక్కువ కాలంలో చేతికొచ్చే పంటలే రబీలో వేయాలని, విద్యుత్ శాఖ రైతులకు ఎన్ని గంటలు విద్యుత్ సరఫరా చేస్తారో తెలియజేయాలని, గరిష్టంగా థర్మల్ విద్యుత్తును ఉత్పత్తి చేయాలని ,అన్ని థర్మల్ స్టేషన్స్ నడిచేలా చర్యలు తీసుకోవాలని, సోలార్ ద్వారా అన్ని పథకాలు ఉపయోగించుకోవాలని, భూగర్భ జలాలు, విద్యుత్ సరఫరా పై వాస్తవ పరిస్థితులను రైతులకు తెలియజేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఎల్ నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఆయా రంగాల వారీగా తీసుకుంటున్న చర్యలను రైతులకు వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, విద్యుత్ శాఖ చీఫ్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ఈఎన్ సి కృపాకర్ రెడ్డి, వాతావరణ శాఖ డైరెక్టర్, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జానయ్య, ఉద్యాన విశ్వవిద్యాలయం విసీ ప్రొఫెసర్ రాజిరెడ్డి, పశు సంవర్ధక శాఖ డైరెక్టర్, తదితరులు వారి శాఖల ద్వారా ఎల్ నినో పరిస్థితులలో చేపట్టనున్న కార్యాచరణ పై వివరించారు.

కొత్తపల్లి రైతు వేదిక నుండి హాజరైన జిల్లా కలెక్టర్

ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా కొత్తపల్లి (హెచ్) రైతు వేదిక నుండి హాజరయ్యారు. అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డిఆర్డిఓ గీత, ఎలక్ట్రిసిటీ డి.ఈ రాజం, జిల్లా మార్కెటింగ్ అధికారి షాబుద్దీన్, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు పాల్గొన్నారు.

మంథని డిపో మేనేజర్‌గా జ్ఞానేశ్వర్ బాధ్యతల స్వీకరణ



మంథని,అక్టోబర్12(మనంన్యూస్): మంథని ఆర్టీసీ డిపో నూతన మేనేజర్ గా జ్ఞానేశ్వర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం డిపో ఆవరణలో ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి గంధం రమేష్ ఆధ్వర్యంలో ఎస్.టీఐ,ఆఫీస్ సిబ్బంది,గ్యారేజ్ సిబ్బంది,ఏఎంఎఫ్ లు కలిసి జ్ఞానేశ్వర్ ను పూలమాలలు,శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నూతన డిపో మేనేజర్ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ డిపో అభివృద్ధికి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి అందరి సహకారంతో కృషి చేస్తానని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డిపో సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ



- బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం

జగిత్యాల అక్టోబర్ 12(మనం న్యూస్): ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 14 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.

సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని సమష్టిగా ఎదుర్కోవాలి

- తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



జగిత్యాల, అక్టోబర్-12: (మనం ప్రతినిధి): సూపర్ ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందని, అనేక ప్రాంతాల్లో తాగునీరు, సాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తే పరిస్థితులు ఉన్నాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులతో మాట్లాడి యాసంగి 2026-27 పంటల సాగు ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు. జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ పాల్గొన్నారు. జిల్లాలోని రైతు వేదికల నుంచి రైతులు కూడా పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోవడం, సాగునీటి లభ్యత పరిమితంగా ఉండటంతో రైతులు యాసంగి 2026-27 పంటల సాగుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. నీటి లభ్యత లేని ప్రాంతాల్లో సాగుకు దూరంగా ఉండాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, ప్రజలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం తెలంగాణ రాష్ట్రానికే పరిమితం కాదని, ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతోందని తెలిపారు. అనేక ప్రాంతాల్లో తాగునీరు, సాగునీరు, విద్యుత్ లభ్యతకు సంబంధించిన సమస్యలు ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న వనరులను పొదుపుగా వినియోగించుకోవడం, ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవడం అత్యంత ముఖ్యమని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వాస్తవాలను అర్థం చేసుకుని, అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల పరిస్థితిని బట్టి పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సాగునీరు అందుబాటులో ఉంటుందనే అంచనాతో అధిక నీటి అవసరం ఉన్న పంటలను సాగు చేసి నష్టపోకుండా జాగ్రత్త వహించాలని కోరారు. తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తూ, రానున్న జూన్ వరకు తాగునీటి అవసరాలను తీర్చేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తాగునీటి పథకాల్లో సమస్యలు తలెత్తితే వెంటనే మరమ్మతులు చేపట్టి, అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సాగునీటి లభ్యత తక్కువగా ఉండటంతో పాటు భూగర్భ జలాలు కూడా గణనీయంగా తగ్గిన నేపథ్యంలో రైతులు సాగు విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అందించే సూచనలను పాటిస్తూ నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉన్న నీటి వనరులు, వాతావరణ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు గర్జనకు కదిలిన కాపు దళం



మధిర, అక్టోబర్ 12(మనం న్యూస్): మున్నూరు కాపుల ఐక్యతే లక్ష్యంగా.ఖమ్మం జిల్లా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకార మహాసభకు మధిర నియోజకవర్గం నుండి ఆళ్ళ కృష్ణ నేతృత్వంలో భారీ తరలి వెళ్లారు. మధిర నియోజకవర్గ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ఆళ్ళ కృష్ణ ఆధ్వర్యంలో ఎర్రుపాలెం, మధిర, బోనకల్లు, ముదిగొండ, చింతకాని మండలాల నుండి వందలాది వాహనాల్లో మున్నూరు కాపు సోదర సోదరీమణులు, యువకులు, మహిళలు 30 కార్లు, 6 ఆటోలతో, ట్రావెల్స్ బస్సులో, పెద్ద సంఖ్యలో ఖమ్మం బయలుదేరారు. 'చలో ఖమ్మం - మున్నూరు కాపు నాయకత్వం వర్ధిల్లాలి' నినాదాలతో మధిర పట్టణం మార్మోగింది.

ఖమ్మం కాపు హాస్టల్ ప్రాంగణంలో భారీ ఏర్పాట్లు:

ఖమ్మం నగరంలోని మున్నూరు కాపు బాలుర వసతి గృహ, హాస్టల్ ప్రాంగణంలో ఈ బహిరంగ సమ్మేళనానికి భారీ ఏర్పాట్లు చేశారు. జిల్లా నలుమూలల నుండి వేలాదిగా కాపు బంధువులు తరలిరానున్నారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి రాజ్యసభ సభ్యులు, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముఖ్య సారథిగా విచ్చేయనున్నారు.

వారి చేతుల మీదుగా నూతన జిల్లా కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేయనుంది. అంతేకాకుండా జిల్లా మహిళా విభాగం, యూత్ విభాగం, కార్మిక అనుబంధ విభాగాల నూతన కమిటీలను కూడా ఈ వేదికపై ప్రకటించనున్నారు. సంఘం బలోపేతం, యువతకు, మహిళలకు పెద్దపీట వేస్తూ భవిష్యత్ కార్యాచరణపై ఈ సభలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ చారిత్రాత్మక సభను ప్రతి మున్నూరు కాపు బంధువు పాల్గొని దిగ్విజయం చేయాలని ఆళ్ళ కృష్ణ పిలుపునిచ్చారు.

మున్నూరు కాపు కార్పొరేషన్‌కు రూ.5 వేల కోట్లు కేటాయించాలి

- మంత్రివర్గంలో మున్నూరు కాపులకు చోటు కల్పించాలి
- ఖమ్మం మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర
- వైభవంగా జిల్లా నూతన కమిటీ, కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ఖమ్మం, అక్టోబర్ 12(మనం బ్యూరో): తెలంగాణ మున్నూరు కాపు కార్పొరేషన్ కు బడ్జెట్లో 5 వేల కోట్లు కేటాయించాలని రాజ్యసభ ఎంపీ, మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వద్దిరాజు రవిచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బడ్జెట్లో ఈ నిధులు కేటాయిస్తే మున్నూరు కాపు యువత, మహిళ, నిరుపేద రైతులకు ఎంతో లాభం చేకూరుతుందని అన్నారు. సోమవారం ఖమ్మం మున్నూరు కాపు హాస్టల్ భవనంలో జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. జిల్లా సంఘం గౌరవ అధ్యక్షులు కొత్త సీతారాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీ రవిచంద్ర ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మున్నూరు కాపు సంఘంలో తాను మొదటి నుండి ఎన్నికలకు దూరమని.. అన్ని పార్టీలలో ఉండాలని కానీ సరైన సమయంలో ఐక్యత చూపాలని అన్నారు. ఇప్పటివరకు తాను మనం కులానికి చాలా తక్కువగా చేశామని ఇంకా ఎంతో చేయాల్సింది ఉందని అన్నారు. మొదట ఇంట గెలిచి రచ్చ గెలవాలని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో మనం ఎదిగే క్రమంలో స్థానికంగా ఉన్న కులంలో మంచి పేరు సంపాదించి సేవ చేయాలన్నారు. 56% ఉన్న బీసీలను కలుపుకొని వెళ్ళినప్పుడు రాజ్యాధికారం దక్కుతుందన్నారు. స్వాతంత్రం వచ్చి ఇన్ని సంవత్సరాలైనా రాష్ట్ర మంత్రివర్గంలో మొదటిసారి మున్నూరు కాపులకు స్థానం దక్కకపోవడం బాధాకరమన్నారు. ఖమ్మంలో మున్నూరు కాపు ఫంక్షన్ హాల్ అభివృద్ధికి, సంఘం మాజీ అధ్యక్షులు మేకల సంగయ్య విగ్రహ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. హైదరాబాదులో వివిధ గ్రూప్ లు, సంఘాలుగా ఉన్న సంఘాన్ని మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్రంగా ఆవిర్భవించడంతో ప్రభుత్వం కోట్లది రూపాయల ఐదు ఎకరాల భూమి ఇచ్చిందని అన్నారు. ఇప్పుడు రూ. 150 కోట్ల నిధులతో భవన నిర్మాణానికి పునాదులు పడ్డాయి అన్నారు. ముఖ్యంగా జనాభాలో సగం బాగా ఉన్న మహిళలు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని రాజకీయాలలో రాణించాలన్నారు. యువత వ్యాపారంలో రాణిస్తూ ఐక్యంగా ఉంటూ కుల సేవ చేయాలన్నారు యువత తలుచుకుంటే సాధించలేనిది లేదన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి తాము ఎంచుకున్న రంగాల వైపు ముందుకు పోవాలన్నారు. అనంతరం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సమావేశంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, జిల్లా మాజీ అధ్యక్షులు పారా నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం, ప్రధాన కార్యదర్శి పసుపులేటి దేవేంద్రం, నాయకులు మడూరి పూర్ణ, మెంతుల శ్రీశైలం, తోట రామారావు, తోట రమేష్, పగడాల మంజుల, తోట సుజలా రాణి, హరిక నాయుడు, పారా ఉదయ్ కుమార్, మేకల శ్రీనివాసరావు, మేకల నాగేందర్, మిర్యాల రామకృష్ణ, లక్కినేని రఘు, మారిశెట్టి వెంకటేశ్వరరావు, ఆళ్ల కృష్ణ, కనకం జనార్ధన్, మేకల భిక్షమయ్య, పసుపులేటి నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వాతావరణ పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి

- సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్
- మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న



మంథని, అక్టోబర్12(మనంన్యూస్): ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వాతావరణ పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న అన్నారు.మంథని మండలం సూరయ్యపల్లి రైతు వేదికలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో ఎల్నినో ప్రభావం,వ్యవసాయ రంగంపై దాని ప్రభావం,రైతులకు ఎదురయ్యే సమస్యలు, తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ,సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు,చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు,వ్యవసాయ, సహకార శాఖ కమిషనర్లు, శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకుఅవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో వర్షపాతంలో మార్పులు చోటుచేసుకున్నందున రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని సూచించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆరు తడి పంటల సాగుపై ప్రణాళికలు రూపొందించుకోవాలని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తీసుకునే చర్యలకు సహకార రంగం ద్వారా తోడ్పాటు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు,ఐటి, పరిశ్రమలు,శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వానకాలం పంటలను కాపాడేందుకు పలు ప్రత్యేక ముందస్తు చర్యలు చేపడుతున్నారని,అంతే గాకుండా రాబోయే డిసెంబర్ నాటికి ఎల్ నినో ప్రభావం తీవ్ర రూపం దాల్చనుందని,రబీ సీజన్ లో తక్కువ నీటి వినియోగం గల పప్పు దినుసులు,మొక్కజొన్న లాంటి పంటలు వేసుకోవాలని సూచిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు లక్కాకుల. సత్యనారాయణ, మేడ రాజయ్య,ఏవో నవ్య, ఏఈవోలు ప్రత్యూష,శివకుమార్,మురళి మధు, మధుకర్, హరిక,సౌమ్య, ఏపీఎం,మహిళలు, రైతులు,తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల, అక్టోబర్ 12 (మనం ప్రతినిధి): ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 49 ఫిర్యాదులు, వినతులు అందాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు.ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె. వై ప్రసాద్, ఆర్డీవో లు మధు సూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహ రావు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

ఇంచార్జ్‌గా ఆదర్శ్ రెడ్డి తనదైన ముద్ర!

కీలక సమయంలో బీఆర్ఎస్ బాధ్యతలు

పార్టీకి ఎమ్మెల్యే దూరమైతే..ఆదర్శ్ రెడ్డి బలమయ్యారు

సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక నుంచి గెలుపు వరకు సమన్వయ కృషి

కేసీఆర్ ఆశీస్సులు.. కేటీఆర్, హరీశ్‌రావు సూచనలతో పార్టీ బలోపేతానికి చర్యలు

రాజకీయ వారసత్వంతో పాటు తనదైన పనితీరుతో ప్రత్యేక గుర్తింపు





పటాన్‌చెరు, అక్టోబర్ 12 (మనం న్యూస్): రాజకీయాల్లో కీలక సమయంలో బాధ్యతలు చేపట్టడం ఒక ఎత్తయితే.. ఆ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ శ్రేణుల్లో విశ్వాసాన్ని నింపడం మరో ఎత్తు. ఈ రెండింటిలోనూ తనదైన శైలిలో ముందుకు సాగుతూ పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. పార్టీకి ప్రతికూల పరిస్థితులు ఎదురైన వేళ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పార్టీ కార్యక్రమాలు కొనసాగించడంలో చొరవ చూపారు. ఇంచార్జ్ బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తున్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తూ సమర్థవంతమైన నాయకుడిగా పేరు సంపాదిస్తున్నారు.

కీలక సమయంలో బాధ్యతలు.. క్యాడర్కు భరోసా

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బీఆర్ఎస్ను వీడిన నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 15న పార్టీ అధినేత కేసీఆర్ ఆదర్శ్ రెడ్డికి నియోజకవర్గ ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించారు. పార్టీకి కీలకమైన సమయంలో లభించిన ఈ బాధ్యతలను ఆయన సవాలుగా స్వీకరించారు. ఎమ్మెల్యే పార్టీకి దూరమైన పరిస్థితుల్లోనూ పార్టీ శ్రేణుల్లో సమన్వయం దెబ్బతినకుండా ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. పార్టీ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగేందుకు కృషి చేస్తూ క్యాడర్కు అండగా నిలిచారు. నాయకులు, కార్యకర్తలతో సంప్రదింపులు కొనసాగిస్తూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లారు. కీలక సమయంలో బాధ్యతలు స్వీకరించి క్యాడర్కు అండగా నిలవడం ద్వారా ఇంచార్జ్ తనదైన ముద్ర వేసుకున్నారు.

ఎన్నికల్లో సమన్వయంతో ముందడుగు..

సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల సమయంలో ఆదర్శ్ రెడ్డి పార్టీ నాయకులతో కలిసి సమన్వయానికి ప్రాధాన్యమిచ్చారు. అభ్యర్థుల ఎంపికపై చర్చలు, స్థానిక నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, అభ్యర్థుల గెలుపు కోసం చేపట్టిన ప్రయత్నాల్లో తన వంతు పాత్ర పోషించారు.

నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీల్లో పార్టీ కార్యకలాపాలు, ఎన్నికల ప్రక్రియలో నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యాన్ని పెంచేందుకు కృషి చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు మార్గదర్శకత్వంలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగారు. ఎన్నికల సమయంలో క్షేత్రస్థాయి నాయకులతో సంప్రదింపులు జరుపుతూ, పార్టీ అభ్యర్థులకు సహకారం అందించే దిశగా వ్యవహరించడం ఆయన పాత్రలో ప్రధానాంశంగా నిలిచింది. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణలో సమన్వయకర్తగా ఆదర్శ్ రెడ్డి వ్యవహరించిన తీరుపై పార్టీ, రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

హరీశ్‌రావు సూచనలతో పార్టీ బలోపేతం

కేసీఆర్ ఆశీస్సులు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మార్గదర్శకత్వం, మాజీ మంత్రి హరీశ్‌రావు సూచనలతో ఆదర్శ్ రెడ్డి నియోజకవర్గంలో పార్టీ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా అడుగులు వేశారు. మండలాలు, కార్పొరేషన్ డివిజన్లకు పార్టీ ఇంచార్జ నియామకంలో సమన్వయ పాత్ర పోషించారు. పార్టీ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో చురుకుగా సాగేందుకు నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పని చేశారు. ఇంచార్జ పార్టీకి అవసరమైన సహకారం అందించడంతో పాటు, తన పరిధిలో ఆర్థికంగానూ తోడ్పాటు అందిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తిరిగి బీఆర్ఎస్లోకి వచ్చిన నేపథ్యంలోనూ ఆదర్శ్ రెడ్డి ఇంచార్జ్ బాధ్యతలు కొనసాగుతుండటం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

రాజకీయ వారసత్వం.. తనదైన పనితీరు

ఆదర్శ్ రెడ్డికి రాజకీయ నేపథ్యం కూడా ఉంది. ఆయన తండ్రి రాజేశ్వర్ రెడ్డి గతంలో రామచంద్రాపురం సర్పంచ్గా పని చేశారు. ఆయన పెదనాన్న, మాజీ ఎమ్మెల్సీ, మాజీ ప్రొటెం చైర్మన్ భూపాల్ రెడ్డి రాజకీయ అనుభవం ఆదర్శ్ రెడ్డికి మార్గదర్శకంగా నిలిచింది. ఆదర్శ్ రెడ్డి సతీమణి సింధు ఆదర్శ్ రెడ్డి ఆయన సంపూర్ణ సహకారంతో రెండు సార్లు భారతి నగర్ కార్పొరేటర్ గా పని చేసి ప్రజల మన్ననలు పొందారు. పెద్దల రాజకీయ ప్రస్థానాన్ని దగ్గరగా గమనిస్తూ, వారితో కలిసి పనిచేసిన అనుభవాన్ని తన రాజకీయ ప్రయాణంలో ఉపయోగించుకుంటున్నారు. కుటుంబ రాజకీయ నేపథ్యంతో పాటు, పార్టీ అప్పగించిన బాధ్యతలను నిర్వహిస్తూ నియోజకవర్గ స్థాయిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్నారు.

సమన్వయకర్తగా ప్రత్యేక గుర్తింపు..

కీలక సమయంలో ఇంచార్జ్ బాధ్యతలు స్వీకరించి, పార్టీకి ఎదురైన సవాళ్లను అధిగమించే దిశగా పనిచేస్తూ ఆదర్శ్ రెడ్డి తనదైన ముద్ర వేస్తున్నారు. నాయకత్వం సూచనలను పాటిస్తూ.. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం ఆయన పనితీరుల ప్రధానాంశంగా నిలుస్తోంది. పార్టీకి అండగా నిలవడంతో పాటు బాధ్యతాయుతమైన ఇంచార్జ తన సామర్థ్యాన్ని చాటుకుంటున్నారనే చర్చ బీఆర్ఎస్ వర్గాల్లో వినిపిస్తోంది. రాజకీయంగా మారుతున్న పరిస్థితుల్లోనూ సమన్వయానికి ప్రాధాన్యమిస్తూ పార్టీ బలోపేతానికి ఆదర్శ రెడ్డి కృషి చేస్తున్నారు.

సమర్థవంతమైన సమన్వయకర్తగా, బాధ్యతలను సమర్థంగా నిర్వహించే బీఆర్ఎస్ నేతగా పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్లో ఆదర్శ్ రెడ్డి పేరు ప్రత్యేకంగా వినిపిస్తోంది.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలి



- ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి

రామచంద్రపురం, అక్టోబర్ 12 (మనం న్యూస్) : పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ముందుకు సాగాలని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. నూతనంగా నియమితులైన సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గానికి చెందిన బీజేపీ డివిజన్ ప్రెసిడెంట్లు, నూతన కార్యవర్గ సభ్యులు రామచంద్రపురంలోని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్సీ ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికులా పని చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను గడపగడపకూ తీసుకెళ్లి ప్రజల్లో పార్టీ పట్టును మరింత బలోపేతం చేయాలని కోరారు. స్థానిక సమస్యలపై ఎల్లప్పుడూ ప్రజాక్షేత్రంలో పోరాటాలు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గోదావరి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, బీజేపీ నాయకులు కొండా లక్ష్మణ్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాలంకారములో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ మహంకాళీ మాత

- భారీగా తరలివచ్చిన భక్తులు



గజ్వేల్, అక్టోబర్ 12 మనం న్యూస్: గజ్వేల్ పట్టణంలోని శ్రీ మహంకాళీ మాత ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం నాడు భక్తులకు ధాన్యాలంకారంలో భక్తులకు శ్రీ మహంకాళి మాత దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాలు గజ్వేల్ పట్టణంలోని ఆలయాలలో అమ్మవార్లను అందంగా అలంకరించడం తోపాటు భక్తి పారవశ్యంతో భక్తులు కొలిచే విధంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సంతోషిమాత ఆలయంలో, శ్రీ వాసవి మాత ఆలయం, అలాగే పట్టణంలో వివిధ ప్రాంతాలలో కూడా మండపాలు ఏర్పాటు చేసి అమ్మవారిని కొలువుతీరేలా చేశారు. ఈ మండపాల వద్ద భక్తులు భారీ సంఖ్యలో రావడంతో పాటు త్తమ భక్తిని చాటుకుంటున్నారు. 18 గంటల బియ్యంతో అమ్మవారికి అలంకరణ కార్యక్రమాన్ని ఆలయనిర్వాహకులు చాలా నంద బాల శర్మ నిర్వహించడం జరిగింది. అంతకుముందు ఉదయం ఆరు గంటల నుండి హోమం కార్యక్రమాన్ని నిర్వహించగా గోపూజ కలశ పూజలతో పాటు తదితర పూజా కార్యక్రమాలను భక్తులచే నిర్వహించారు.

దేశంలో ఓటు చోరీ జరుగుతుంది బీజేపీ హక్కులను కాలరాస్తుంది



- రాహుల్ గాంధీకి మద్దతుగా సంగారెడ్డిలో జగ్గారెడ్డి, నిర్మల ర్యాలీ
- ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు రాహుల్ గాంధీ పోరాటం ఆపబోమని ప్రకటన

సంగారెడ్డి, అక్టోబర్ 12 మనంప్రతినిధి: కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఢిల్లీలో చేస్తున్న పోరాటానికి మద్దతుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సోమవారం నాడు సంగారెడ్డి పట్టణ కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక హైబి గెస్ట్ హౌస్ నుండి ఓల్ బస్టాండ్ వరకు సాగిన ర్యాలీలో నిర్మల జగ్గారెడ్డి తో పాటు వేలాదిమంది కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. గణేష్ కుమార్ రాజీనామా చేయాలని మోడీ డౌన్ డౌన్ రాహుల్ గాంధీ జిందాబాద్ అంటూ ర్యాలీ పొడవున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ బీజేపీ దొంగ ఓట్లతో అధికారంలోకి వస్తుందని ఆరోపించారు ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ వీధుల్లోకి వచ్చి పోరాడుతున్నారని ఆయనకు మద్దతుగా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలు నిరసనలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ ఢిల్లీలో రోడ్లపై పోరాడుతుంటే మనం ఇళ్లల్లో విశ్రాంతి తీసుకోవడం సరైనకు మద్దతుగా మనమందరం వీధుల్లో కిరావాల్సిందేనని అన్నారు తాను ఢిల్లీ వెళ్లే గలిగినప్పటికీ రాహుల్ గాంధీ పోరాటానికి స్థానికంగా సంఘీభావం తెలియజేయాలని ఉద్దేశంతో సంగారెడ్డి లోనే ఉండి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోర్ట్ చివరి జరుగుతుంది బిజెపి ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తుందని జగ్గారెడ్డి ఆరోపించారు ఈ అంశాలను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కనీసం పదిమందికి వివరించి ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు మ్యారేజ్ కుమార్ రాజీనామా చేసి వరకు పోరాటం ఆపబోమని రాహుల్ గాంధీ ప్రకటించారని జగ్గారెడ్డి పేర్కొన్నారు ఆ డిమాండ్ నెరవేరే వరకు సంగారెడ్డిలో నిరసనలు కొనసాగుతూనే ఉంటాయని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ రోడ్డుపై పడుకుని నిరసన తెలిపే మనం కూడా అదే విధంగా ఆయనకు మద్దతుగా నిలవాలని ప్రతి కార్యకర్తకు జగ్గారెడ్డి పిలుపునిచ్చారు.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు నిరసనలు ఆగవు

కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్

తెలంగాణ భవన్ లో సీఎం, పీసీసీ, రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో జరిగిన సమావేశంలో పాల్గొన్న నీలం

ఢిల్లీలోని బారకాంబ జంక్షన్ నుండి సుప్రీమ్ కోర్ట్ వరకు జరిగిన నిరసన మార్చ్ కార్యక్రమంలో హాజరు



పటాన్ చెరు, అక్టోబర్ 12 (మనం న్యూస్) : కేంద్ర ఎన్నికల సంఘం తీరును ఆక్షేపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి దిగిపోవాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధాని ఢిల్లీలోని బారకాంబ జంక్షన్ నుండి సుప్రీమ్ కోర్ట్ వరకు కాంగ్రెస్ అగ్రనేతల ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన మార్చ్ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో కలిసి ఆయన ఈ నిరసన ప్రదర్శనలో భాగస్వాములయ్యారు. ఈ మార్చ్లో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి, సిఈసీ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ..ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సమీక్ష పేరుతో లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం, అధికార పార్టీకి కొమ్ము కాస్తూ రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను విస్మరిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుడికి అతిపెద్ద ఆయుధమైన ఓటు హక్కును కాలరాసేందుకు జరుగుతున్న కుట్రలపై రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న ఈ పోరాటానికి తెలంగాణ కాంగ్రెస్ శ్రేణుల పూర్తి సన్నద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ను పదవి నుండి తొలగించి, ప్రజాస్వామ్య బద్ధంగా ఓటర్ల జాబితాలను పునరుద్ధరించే వరకు ఢిల్లీ వీధుల నుంచి గ్రామ స్థాయి వరకు ఈ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

దళితుల అభ్యున్నతి కాంగ్రెస్ తోనే సాధ్యం

- ములుగులో చలో ఢిల్లీ సంఘీభావ సభ
- సంఘీభావ సభలో నర్సారెడ్డిపై ఎస్సీ డిపార్ట్మెంట్ నేతల అసంతృప్తి స్వరం



ములుగు, అక్టోబర్ 12(మనంన్యూస్): దళితుల పార్టీ కాంగ్రెస్ అని, అణగారిన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ తోనే సాధ్యం ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమ్ము విజయ్ కుమార్,జిల్లా ఎస్సీడిపార్ట్మెంట్ అధ్యక్షుడు తప్పెట శంకర్ అన్నారు. అయితే గజ్వేల్ ఇన్చార్జ్ నర్సారెడ్డి దళితులను కాంగ్రెస్ పార్టీకి దూరం చేస్తున్నారని ,కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం వద్ద చావు డప్పుల కార్యక్రమంలో సైతం దళిత నేతలను నర్సారెడ్డి మావాళ్ళు కారంటూ ఇబ్బందులకు గురి చేశారని ఎస్సీ డిపార్ట్మెంట్ నేతల అసంతృప్తి స్వరం వినిపించారు. సోమవారం మండల కేంద్రమైన ములుగులో సర్ పై కాంగ్రెస్ పార్టీ చలో ఢిల్లీ కార్యక్రమానికి మండల కేంద్రమైన ములుగులో ఎస్సీ డిపార్ట్మెంట్ మండల అధ్యక్షుడు తూర్పింటి రాజు ఆధ్వర్యంలో సంఘీభావ సభ నిర్వహించారు. ముందుగా రాజీవ్ రహదారి నుండి పాదయాత్ర బయలుదేరి అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమలలువేసి నివాళర్పించారు. ఈ సమావేశానికి ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమ్ము విజయ్,ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తప్పెట శంకర్, పీసీసీ మెంబర్ గంగిశెట్టి శ్రీనివాస్ గుప్త,నేతలు మహిపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి,మండల దళితులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమ్ము విజయ్ మాట్లాడుతూ నేతల్లో వ్యతిరేకతను పక్కన పెట్టి పార్టీ కోసం శ్రమిద్దాం అంటూ క్యాడర్ కు సూచించారు.దళితుల,బలహీన వర్గాల పార్టీ కాంగ్రెస్ అని దళితులను కాంగ్రెస్ పార్టీకి దూరం చేసేందుకు గజ్వేల్ ఇన్చార్జ్ నర్సారెడ్డి కుట్ర చేస్తున్నారని చెప్పారు.

ఈరోజు ఇక్కడ జరుగుతున్న చలో ఢిల్లీ సంఘీభావ సమావేశానికి సైతం నర్సారెడ్డి వర్గీయులు ఇబ్బందులకు గురి చేశారని,నర్సారెడ్డి ఆయన వర్గీయులు అసలైన కాంగ్రెస్ నేతలను ఒత్తిళ్లకు గురి చేయడం బాధాకరం అంటూ విజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ డిపార్ట్మెంట్ సిద్దిపేట జిల్లా తప్పెట శంకర్ మాట్లాడుతూ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడి విషయంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలను కాదని తనకు తానుగా అధ్యక్షుడిని నియమించుకున్నాడన్నారు. కేసీఆర్ చావు డప్పుల కార్యక్రమంలో జైలు పాలైన జిల్లా అధ్యక్షుడు తప్పెట శంకర్ మావాడు కాదని పోలీసులకు నర్సారెడ్డి హుకుం జారీ చేసారంటూ వాపోయారు.ఎస్సీ డిపార్ట్మెంట్ నర్సిరెడ్డిది కాదని శంకర్ అన్నారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు,గజ్వేల్ ఇన్చార్జ్ ల పై అధిష్టానానికి పిర్యాదులు చేశాం అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే రైతులు, పేదల సంక్షేమం కోసం శ్రమించే నాయకులు ఉన్న పార్టీ అని గజ్వేల్ రైతు విషయంలో తహసిల్దార్ ను సస్పెండ్ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ప్రభుత్వానికి శంకర్ ,నేతలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడు సుతారి మహంకాళి, బల్నర్సింహా, నాయకులు కొండు నర్సింలు,ప్రకాష్, నర్సి మల్లేష్,ఐలయ్య,అర్జున్,నల్ల శ్రీనివాస్,డాకం రవి,బారం గణేష్ యాదవ్,కనకరాజు, పచ్చిమడ్ల శ్రీనివాస్,పచ్చిమడ్ల శ్రీనివాస్, ఆంజనేయులుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

- ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి
- నీటి లభ్యత ఆధారంగా ఆరుతడి పంటల సాగుకు రైతులు మొగ్గు చూపాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి, అక్టోబర్ 12 మనం న్యూస్ ప్రతినిధి: ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైన నేపథ్యంలో జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. యాసంగి 2026-27 సీజన్లో అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల లభ్యత, విద్యుత్ సరఫరా పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని రైతులు తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

ఎల్ నినో ప్రభావం, యాసంగి పంటల ప్రణాళిక, ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, నీటి వినియోగం, విద్యుత్ సరఫరా, పశుగ్రాసం, తాగునీటి సంరక్షణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత శాఖల అధికారులు, రైతులతో కలిసి సంగారెడ్డి రైతు వేదిక నుంచి పాల్గొన్నారు.

హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వ్యవసాయ అనుబంధ శాఖల కార్యదర్శులు, శాస్త్రవేత్తలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొని ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ రంగంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ యాసంగి సీజన్లో నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పప్పుధాన్యాలైన పెసలు, మినుములు, శనగతో పాటు కుసుమ వంటి పంటల సాగును ప్రోత్సహించాలన్నారు. బిందు సేద్యాన్ని వినియోగించుకొని ఆయిల్పామ్ తోటలు, కూరగాయలు తదితర పంటలను సాగు చేయడం ద్వారా నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు.

జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోరు బావుల రీఛార్జ్ వంటి పనులను చేపట్టి వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించాలని సూచించారు. రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా విషయంలో సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. భూగర్భ జలాల పరిస్థితిపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ, రైతులు నీటి లభ్యత ఆధారంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. ఎల్ నినో ప్రభావాన్ని సమష్టి కృషితో సమర్థవంతంగా ఎదుర్కోవాలని, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, పంటల ఎంపిక, సాగు పద్ధతులపై అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని ఆదేశించారు.

జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలని, నీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదల, నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఉద్యాన శాఖ అధికారి సోమేశ్వర్, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వసంతకుమారి, జిల్లా సహకార అధికారి కిరణ్ కుమార్, డీఆర్డీఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాధరిలో వైభవంగా కొనసాగుతున్న శరన్నవరాత్రులు

- గాయత్రి దేవిగా దర్శనం ఇచ్చిన అమ్మవారు

వర్ధల్ అక్టోబర్ 12(మనం న్యూస్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వర్ధల్ శ్రీ విద్యా సరస్వతి అమ్మవారి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు తొమ్మిది రోజులపాటు భక్తులకు వివిధ అలంకారంతో దర్శనం ఇవ్వనున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవిద్యా సరస్వతి అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖర్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో గణపతి పూజ విశేష పంచామృత అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి గాయత్రి దేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకుని పునీతులైనారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదాలను అందజేశారు.

ఖమ్మం ప్రాంతానికి ఆధ్యాత్మిక శోభ

కులమతాలకు అతీతంగా ధర్మమార్గంలో పయనించాలి

ప్రజలందరికీ శ్రీ వేంకటేశ్వర స్వామి అనుగ్రహం కలగాలి

ఆలయ నిర్మాణానికి భక్తులందరూ తమ వంతు సహకారం అందించాలి

శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భూమి పూజ, శంకుస్థాపన

ఆలయ నిర్మాణానికి మంత్రి తుమ్మల కృషి ప్రధాన కారణం

శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి.. టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు







ఖమ్మం, అక్టోబర్ 12(మనం బ్యూరో): ఖమ్మం ప్రాంతానికి ఆధ్యాత్మిక శోభను తీసుకువచ్చేలా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టడం శుభసూచకమని శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి అన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని కొత్తగూడెం అల్లీపురంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి, టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్ లతో కలిసి భూమి పూజ, శంకుస్థాపన నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య హోమం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో శ్రీవారి భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., కొత్తగూడెం, సత్తుపల్లి ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివ రావు, మట్టా రాగమయి దయానంద్, టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ. శరత్, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి మాట్లాడుతూ రెండు రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న ఖమ్మం నగరంలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టడం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో శుభప్రదమని అన్నారు. దేశంలో ఏ శుభకార్యాన్ని ప్రారంభించినా రైతులు, కుమ్మరులు సహా అన్ని వర్గాల ప్రజలు ముందుగా భగవంతుడిని స్మరించుకుని తమ పనులను ప్రారంభిస్తారని తెలిపారు. భగవంతుడిని స్మరించుకోవడం మన సంస్కృతిలో అంతర్భాగమని అన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రస్తుత టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు టెలివిజన్ మాధ్యమం ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి ఖమ్మం నగరానికి విచ్చేసేందుకు నేడు తొలి అడుగు పడిందని అన్నారు. ఆశ్వయుజ మాసం సోమవారం నాడు ఖమ్మంలో శ్రీవారి ఆలయానికి శంకుస్థాపన జరగడం దైవ సంకల్పమని పేర్కొన్నారు. స్వామివారు ఖమ్మం నగరాన్ని పవిత్రం చేసేందుకు స్వయంగా ఇక్కడకు వస్తున్నారని, ప్రజలందరికీ ఆశీస్సులు అందించనున్నారని తెలిపారు.

శ్రీవారి అలంకార విశేషాల్లో అంతర్లీనమైన ఆధ్యాత్మిక సందేశం

శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి మాట్లాడుతూ, శ్రీ వేంకటేశ్వర స్వామివారి అలంకార సంప్రదాయానికి సంబంధించిన విశేషాలను వివరించారు. సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం రామానుజాచార్యుల వారి కాలంలో ఏర్పాటైన సంప్రదాయం ప్రకారం, వారంలోని వివిధ రోజుల్లో స్వామి వారికి ప్రత్యేక అలంకారాలు నిర్వహించే విధానం కొనసాగుతోందని తెలిపారు. ఈ సంప్రదాయాల వెనుక భగవంతుని ఆరాధన, ఆధ్యాత్మిక భావన, భక్తుల విశ్వాసం ఉన్నాయని తెలిపారు.ఆశ్వయుజ మాసం సోమవారం నాడే శ్రీనివాసుడు భూమిపై అడుగుపెట్టారని, అదే ఆశ్వయుజ మాసం సోమవారం నాడు ఖమ్మంలో శ్రీవారి ఆలయానికి శంకుస్థాపన జరగడం దైవ సంకల్పమని , స్వామివారి అనుగ్రహానికి నిదర్శనమని పేర్కొన్నారు.

వసుధైక కుటుంబ భావన మన ధర్మానికి మూలం:

మన దేశం, మన ధర్మం ప్రపంచానికి ఆదర్శమని శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి అన్నారు. ప్రపంచంలోని ప్రతి ఒక్కరిపై ఎలాంటి భేదభావాలు లేకుండా భగవంతుని అనుగ్రహం ఉండాలని కోరుకోవడం భారతీయ సంస్కృతిలోని గొప్ప లక్షణమని పేర్కొన్నారు. అందరూ బాగుండాలని కోరుకునే వసుధైక కుటుంబ భావన మన ఆశయమని తెలిపారు. శ్రీరాముడు బోయవాడిని, శబరిని, పక్షి రూపంలో ఉన్న జటాయువును, విభీషణుడిని కరుణించిన విషయాలను ప్రస్తావిస్తూ, భగవంతుని దృష్టిలో భక్తి, మంచి మనసు, ధర్మబద్ధమైన జీవనానికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. పదిమందికి మేలు జరగాలని కోరుకునే వారందరూ మనవారేనని, ఇతరులకు హాని కలగాలని కోరుకునే వారు శత్రువులుగా మారుతారని అన్నారు. కృష్ణుడిని ఆరాధించేవారు మనకు మిత్రులు, ద్వేషించేవారు శత్రువులు అనే భావనను బోధాదేవి చెప్పినట్లు ప్రస్తావిస్తూ, మన మంతా ఇదే ధర్మసూత్రాన్ని అనుసరించాలని సూచించారు. వేదాలు బోధించిన సన్మార్గాన్ని ప్రోత్సహించే ప్రతి ఒక్కరూ కులాలకు అతీతంగా మనకు మిత్రులేనని తెలిపారు. కులాల ఆధారంగా విడిపోకుండా, మనమందరం ఒకే భగవంతుని సంతానమని, ఒకే భూమాతకు చెందినవారమని గుర్తించాలని అన్నారు. మనందరికీ ఉమ్మడి గుర్తింపుగా శ్రీ వేంకటేశ్వర స్వామి ఉండాలని ఆకాంక్షించారు.

ధర్మ పరిరక్షణకు ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలు:

ప్రజలందరూ ధర్మమార్గాన్ని అనుసరించేలా శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ప్రేరణ నిస్తుందని శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి తెలిపారు. ఆలయాలు కేవలం పూజా కార్యక్రమాలకే పరిమితం కాకుండా, ధర్మం, మానవత్వం, పరస్పర సహకారం, సమాజ శ్రేయస్సు వంటి విలువలను ప్రజల్లో పెంపొందించే కేంద్రాలుగా నిలవాలని అన్నారు. శ్రీరాముడు, శ్రీ వేంకటేశ్వర స్వామి మధ్య విడదీయలేని ఆధ్యాత్మిక అనుబంధం ఉందని పేర్కొన్నారు. భగవంతుని అనుగ్రహంతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, సమాజంలో సద్భావన, ఐక్యత పెంపొందాలని ఆకాంక్షించారు.

ప్రతి భక్తుడు ఆలయ నిర్మాణంలో భాగస్వామి కావాలి:

ఖమ్మంలో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భక్తులందరూ తమ వంతు సహకారం అందించాలని శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి పిలుపు నిచ్చారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా విరాళాలు అందించాలని, ప్రతి భక్తుడు ఒక ఇటుక అందించినా ఆలయ నిర్మాణంలో భాగస్వామి అయినట్లేనని అన్నారు. టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నేతృత్వంలో త్వరలోనే సుందరమైన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఆలయం ఖమ్మం ప్రాంత ప్రజలకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచి, భక్తులకు స్వామివారి సేవలో పాల్గొనే అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఖమ్మం నగరానికి విచ్చేసి ప్రజలందరినీ ఆశీర్వదిస్తున్నారని, ఈ పవిత్ర కార్యక్రమంలో భక్తులందరూ భాగస్వాములు కావాలని శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి కోరారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మంలో టీటీడీ ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. ఈ పవిత్ర కార్యక్రమానికి విచ్చేసిన శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామికి, ఆలయ నిర్మాణానికి అనుమతి మంజూరు చేసిన టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడుకు, టీటీడీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరాముడి ఆశీస్సులతో భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, ప్రస్తుతం పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. నేడు శ్రీ వేంకటేశ్వర స్వామి అనుగ్రహంతో ఖమ్మంలో టీటీడీ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన జరగడం ఆనందంగా ఉందన్నారు. త్వరలోనే ఆలయ నిర్మాణం పూర్తయి ఈ ప్రాంతం ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఖమ్మం ఆలయ నిర్మాణానికి మంత్రి తుమ్మల కృషి కీలకం:

టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు మాట్లాడుతూ ఖమ్మంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం ప్రారంభం కావడానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన కృషి ప్రధాన కారణమని అన్నారు. చిన్నతనంలో విక్రమార్కుడి గురించి చదువుకున్నామని, ప్రస్తుతం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రూపంలో అలాంటి వ్యక్తిత్వాన్ని చూస్తున్నామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా టీటీడీ ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణం చేపడుతున్నామని, రాబోయే ఏడాది కాలంలో ఐదు వేల ఆలయాలను నిర్మించాలనే ప్రణాళిక ఉందని తెలిపారు. అలిపిరి వద్ద రూ. 2,700 కోట్లతో సమగ్ర టౌన్‌షిప్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారని, రద్దీ సమయాల్లో సుమారు 20 వేల మందికి వసతి కల్పించేలా ఈ టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, తదితర రాష్ట్రాల్లో టీటీడీ ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. తెలంగాణలో ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కొడంగల్ తర్వాత ఖమ్మంలో శ్రీవారి ఆలయానికి అనుమతి లభించిందని, కరీంనగర్‌లోనూ త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమవు తాయని చెప్పారు. టీటీడీ నిబంధనల ప్రకారం స్థానిక ఆలయ నిర్మాణానికి 25 శాతం నిధులను స్థానిక భక్తులు సమకూర్చాల్సి ఉంటుందని తెలిపారు. ఖమ్మంలో సుమారు రూ.100 కోట్ల విలువైన భూమిని టీటీడీకి కేటాయించినందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఆలయ నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు.

భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణం పూర్తి చేస్తాం:

టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ. శరత్ మాట్లాడుతూ 'వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించనఫీ వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యత్ఫి అనే శ్లోకం శ్రీ వేంకటేశ్వర స్వామి మహిమను తెలియజేస్తుందని అన్నారు. టీటీడీ నమూనాలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఖమ్మంలో నిర్మితం కావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని, శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా భూమి పూజ జరగడం మరింత విశేషమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర రాజధానులతో పాటు ముఖ్యమైన పట్టణాల్లోనూ శ్రీవారి ఆలయాల నిర్మాణానికి టీటీడీ చర్యలు తీసుకుంటోందని అన్నారు. భక్తుల సహకారంతో ఖమ్మం ఆలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆలయ నిర్మాణానికి విరాళాలు ప్రకటించిన దాతల వివరాలను మంత్రి వెల్లడించారు.

ఎంపీ బండి పార్థసారథి రెడ్డి రూ.60 లక్షలు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రూ.50 లక్షలు, ఎమ్మెల్సీ తాతా మధు రూ.25 లక్షలు విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో భోజన ఏర్పాట్లు చేసిన వ్యక్తి కూడా ఆలయ నిర్మాణానికి అదనంగా రూ.11 లక్షలు విరాళంగా అందించారు. విరాళాలు ప్రకటించిన దాతలకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ వేంకటేశ్వర స్వామిపై భక్తి, విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణానికి తమ వంతు విరాళాలు అందించి ఈ పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, ప్రజా ప్రతినిధులు రాయల నాగేశ్వర రావు, విద్యుత్, ఆర్ అండ్ బి, రెవెన్యూ, దేవాదాయ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలి

దమ్మపేట మండల ప్రజావాణిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

ఎల్నినో ప్రభావం నేపథ్యంలో నీటి వనరులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలి

మండలంలోని 230 చెరువుల నీటి నిల్వలపై ఆరా

ప్రజావాణిపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలి



దమ్మపేట, అక్టోబర్ 12(మనం న్యూస్): ప్రజావాణిలో అందిన దరఖాస్తులను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్అ,ధికారులను ఆదేశించారు. సోమవారం దమ్మపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ప్రజావాణికి హాజరైన వివిధ శాఖల అధికారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించాలని సూచించారు.అనంతరం మండలంలో ఎల్నినో ప్రభావం నేపథ్యంలో నెలకొన్న పరిస్థితులపై అధికారులతో సమీక్షించారు. ఎల్నినో ప్రభావంతో తాగునీటి సరఫరా, చెరువుల నీటి నిల్వలు, వ్యవసాయ పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మిషన్ భగీరథ అధికారులను తాగునీటి సరఫరా వివరాలను అడిగి తెలుసుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇరిగేషన్ అధికారుల ద్వారా మండలంలోని 230 చెరువుల నీటి నిల్వల వివరాలను తెలుసుకున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే నీటి నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకో వాలని, నీటి నిల్వల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులను రైతు వేదికల్లో నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాలకు హాజరవుతున్న రైతుల సంఖ్య, వారికి అందిస్తున్న సలహాలపై ఆరా తీశారు. ఎల్నినో ప్రభావంతో వ్యవసాయ రంగంలో ఎదురయ్యే పరిస్థితులకు అనుగుణంగా రైతులకు అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు. అటవీశాఖ అధికారులను ఫారెస్ట్-రెవెన్యూ సంయుక్త సర్వేలు, భూ రీసర్వే పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సంయుక్త సర్వేలను నిర్దేశిత విధానాల ప్రకారం చేపట్టాలని, సర్వేలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.మండల ప్రజావాణికి ప్రజలు తక్కువ సంఖ్యలో హాజరవుతున్న అంశంపై కలెక్టర్ ఆరా తీశారు. ప్రతి వారం ఎంతమంది దరఖాస్తుదారులు వస్తున్నారు, మండల స్థాయిలో పరిష్కరించగల సమస్యల కోసం ప్రజలు జిల్లా కేంద్రంలోని ప్రజావాణికి ఎందుకు వస్తున్నారు అనే వివరాలను ఎంపీడీవోను అడిగి తెలుసుకున్నారు. మండల ప్రజావాణి కార్యక్రమంపై గ్రామాల్లో టామ్టామ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని, యువత సహకారంతో సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అవగాహనరు. ప్రజలు తమ సమస్యలను మండల స్థాయిలోనే అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని, ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు .ఈ కార్యక్రమంలో దమ్మపేట తాహశిల్దార్ మురళి, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి

- కలెక్టర్ దివాకర టిఎస్
- ప్రారంభ దశలో గుర్తిస్తే అంగవైకల్యాన్ని నివారించవచ్చు
- ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో కుష్ఠువ్యాధికి ఉచిత చికిత్స
- 22 నుండి నవంబర్ 4 వరకు కుష్ఠ వ్యాధి గుర్తింపు కార్యక్రమం



ఖమ్మం, అక్టోబర్ 12(మనం న్యూస్): కుష్ఠువ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించి, సకాలంలో చికిత్స తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీ ఎస్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో కుష్ఠ వ్యాధి నిర్మూలనపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా ప్రజలకు కుష్ఠ వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు, వ్యాధి లక్షణాలు ఉన్నవారిని ముందస్తుగా గుర్తించి, చికిత్స అందించేందుకు ఈ నెల 22 నుండి నవంబర్ 4 వరకు కుష్ఠ వ్యాధి గుర్తింపు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి, ప్రజలకు కుష్ఠ వ్యాధిపై అవగాహన కల్పిస్తారని, అనుమానిత లక్షణాలు ఉన్నవారిని గుర్తించి, అవసరమైన వైద్య పరీక్షల నిమిత్తం సంబంధిత వైద్యాధికారులకు సూచిస్తారని అన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల ద్వారా ఉచితంగా చికిత్స అందించబడుతుందని తెలిపారు. కుష్ఠువ్యాధి మైకోబ్యాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల వస్తుందని, ఇది ప్రధానంగా చర్మం, నరాలపై ప్రభావం చూపుతుందని తెలిపారు. వ్యాధి లక్షణాలు బయటపడటానికి సగటున మూడు సంవత్సరాల వరకు సమయం పట్టవచ్చని పేర్కొన్నారు. చర్మంపై సహజ చర్మరంగు కంటే తక్కువ రంగులో లేదా ఎరుపు, రాగి రంగులో మచ్చలు కనిపించడం, ఆయా మచ్చల వద్ద స్పర్శజ్ఞానం తగ్గడం లేదా లేకపోవడం కుష్ఠువ్యాధి ముఖ్య లక్షణాలని తెలిపారు. శరీరంలోని ఏ భాగంలోనైనా ఇటువంటి మచ్చలు కనిపించవచ్చని, వాటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కుష్ఠువ్యాధి ఎవరికైనా రావచ్చని, దీనికి వయస్సు, లింగభేదం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఇది వంశపారంపర్య వ్యాధి కాదని, శాపం లేదా పాపం వల్ల వచ్చే వ్యాధి కాదని స్పష్టం చేశారు. కుష్ఠువ్యాధి పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలని, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా వారిని గౌరవంగా చూడాలని కోరారు.

కుష్ఠువ్యాధికి ఎండీటీ (బహుళ ఔషధ చికిత్స) ద్వారా సాధారణంగా 6 నుంచి 12 నెలల్లో పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి, వైద్యుల సూచనల మేరకు పూర్తి స్థాయి చికిత్స తీసుకుంటే అంగవైకల్యాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. అవసరమైన సందర్భాల్లో వైద్యుల సలహా మేరకు శస్త్ర చికిత్స ద్వారా అంగవైకల్య సంబంధిత సమస్యలను సరిచేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. కుష్ఠువ్యాధికి సంబంధించిన చికిత్స అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. చర్మంపై స్పర్శజ్ఞానం తగ్గిన మచ్చలు కనిపించినప్పుడు సమీప ఆరోగ్య కార్యకర్తను లేదా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోని వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. కుష్ఠువ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో చికిత్స అందేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. కుష్ఠువ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు డా.పి.శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రామారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం, అక్టోబర్ 12(మనం బ్యూరో): ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదు దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ముదిగొండ మండలం మల్లన్నపాలెం గ్రామానికి చెందిన ఎస్.కే. జాన్ బీ తన సదరం సర్టిఫికెట్లో తప్పుడు వివరాల కారణంగా దివ్యాంగుల పింఛన్ నిలిచిపోయిందని, తిరిగి పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ విషయాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని డీఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు. పీడీఎస్యూ అధ్యక్షుడు బి. లక్ష్మణ్ పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పేరుతో ముందస్తు ఇంటర్మీడియట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్న వేదాంత లెర్నింగ్ సెంట్ల చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దీనిపై పరిశీలించి నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఏదులాపురం పట్టణానికి చెందిన ఎస్.కే. ఆఫ్సానా తాను ఎంబీఏ పూర్తి చేశానని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, విద్యార్హతలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలపై పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉపాధి అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలి

- జిల్లా జాయింట్ కలెక్టర్ డి.వేణుగోపాల్
- ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి
- ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వొద్దు



ప్రజావాణి దరఖాస్తులలో ముఖ్యమైనవి..

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 12 (మనంప్రతినిధి): వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుంచి స్వీకరించే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డి వేణుగోపాల్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ పద్మావతి, ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్, హౌసింగ్ పిడి సవేరాంతో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు.

భూ సంబంధిత సమస్యలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, ఉపాధి, పింఛన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ముఖ్యమైన వేదికగా నిలుస్తోందన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు.


అశ్వాపురం మండలం నెల్లిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి నిధులు దుర్వినియోగం చేసినందుకు అతనిని తొలగించి చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవడం కోసం, గుండాల మండలం కొడవ దంచ గ్రామంలోని పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను నివారించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేసేందుకు, మణుగూరు మండలం అజయ్ నగర్ గ్రామానికి చెందిన చిట్టిమల్ల శిరీష అంగన్వాడి టీచర్ ఉద్యోగానికి రెసిడెన్షియల్ సర్టిఫికెట్ సమర్ప

పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎస్సై మహేందర్



దుగ్గొండి, అక్టోబర్ 12 మనం ప్రతినిధి: నూతనంగా బదిలీపై వచ్చిన ఎస్సై మహేందర్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. దుగ్గొండి లో పనిచేసిన ఎస్సై రావుల రణధీర్ బదిలీపై పరకాలకు వెళ్లారు. వరంగల్ లో విఆర్ లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై ఎం. మహేందర్ బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతి పరిరక్షణకై చట్టం పరిధిలో పనిచేయడం జరుగుతుందన్నారు. యువత డ్రగ్స్ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటిపై ప్రత్యేక నిఘా మోపడం జరుగుతుందన్నారు.

నూతన కమిటీకీ ఘన సన్మానం



- దొంతుల శ్రీనివాస్ జిల్లా కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ మాతృశ్రీ ఫౌండేషన్ చైర్మన్

టేకుమట్ల అక్టోబర్ 12 మనం న్యూస్: టేకుమట్ల మండల కేంద్రంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీ్ఫిఐ)ఏ-143 నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మారపెల్లి రాజకొమురయ్య ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ కోశాధికారి కన్నూరు రమేష్ భూపాలపల్లి డివిజన్ ఉప కార్యదర్శి దాసారపు ప్రశాంత్ ను సన్మానించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో సర్పంచులు అంబాల కిరణ్ కుమార్ నేరెళ్ల రామకృష్ణ మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు రాజేందర్ బొల్లు సరోత్తంరెడ్డి అంబాల రమేష్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు లద్దునూరి ఐలయ్య మరియు మండల పత్రిక విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో విద్యుత్ సరఫరా



- సమస్య పరిష్కారానికి మంత్రి సీతక్క చొరవ

మంగపేట, అక్టోబర్ 11,మనం ప్రతినిధిః మండలంలో రైతులకు సకాలంలో విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ అధికారులు హామీ ఇచ్చారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనల మేరకు మాజీ మండల అధ్యక్షుడు మైలా జయరాంరెడ్డి విద్యుత్ సమస్యను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి విద్యుత్ శాఖ డీఈ పురుషోత్తం, ఎస్ఈ భిక్షపతితో ఫోన్లో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు పంటలకు నీరు అందక ఇబ్బందులు పడుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని మంత్రి అధికారులను కోరినట్లు జయరాంరెడ్డి తెలిపారు. దీనిపై స్పందించిన అధికారులు సింగిల్ ఫేజ్తోపాటు త్రీ ఫేజ్ విద్యుత్ను సకాలంలో సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ రాజుతోపాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సుబేదారిలో నాయక్ కార్ వాష్ ప్రోపరేటర్ ప్రేమ్ సింగ్ ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం



హనుమకొండ, అక్టోబర్ 12(మనం న్యూస్)ః హన్మకొండ సుబేదారి లో నాయక్ కార్ వాష్ అండ్ యాక్సెసరీస్, మెకానిక్ సర్వీసెస్, సుబేదారి వరంగల్ ఆఫీసర్స్ క్లబ్ వద్ద గల ప్రైవేట్ ప్రాంగణంలో ప్రోపరేటర్ ప్రేమ్ సింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన నాయక్ కార్ వాష్ బ్రాంచ్ను ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గౌరవ ఇన్స్పెక్టర్ బానోత్ కాశీరాం నాయక్, డాక్టర్ అజ్మీరా ప్రహ్లాద్ , డాక్టర్ రాజనాయక్ తదితరులు హాజరై నూతన బ్రాంచ్ను ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యమైన సే టైటిల్ మరియువలు అందిస్తూ వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బంజారా జాతి నాయకులు, సన్నిహితులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

సమాచారాన్ని నిర్ణీత వ్యవధిలో అర్జీదారులకు అందించాలి

- డిఆర్ఓ ఏ.మలోల

అనంతపురం, కలెక్టరేట్ అక్టోబర్ 12 : మనం న్యూస్ సమాచార హక్కు చట్టం కింద సమాచారాన్ని నిర్ణీత వ్యవధిలో అర్జీదారులకు అందించాలని డిఆర్ఓ ఏ.మలోల సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో ఆర్టీఐ వారోత్సవాల్లో భాగంగా సమాచార హక్కు చట్టంకు సంబంధించి ఆయా శాఖల హెచ్ఓడిలకు, పిఐఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కింద ఆయా శాఖల పిఐఓలు, ఏపిఐఓల వివరాలు ప్రదర్శించే నోటీస్ బోర్డులను ఆయా కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలన్నారు. 41బి వివరాలు తప్పనిసరిగా అప్డేట్ చేసుకోవాలన్నారు. సమాచార



హక్కు చట్టం కింద అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, కలెక్టరేట్ పిఐఓ అలెగ్జాండర్, సూపరింటెండెంట్లు వసంతలత, రియాజుద్దీన్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాస ఏర్పాట్లపై సమన్వయ సమావేశం

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం

తెప్పోత్సవం, గిరిప్రదక్షిణకు ప్రత్యేక ఏర్పాట్లు

అన్నవరం, అక్టోబర్ 12, మనం న్యూస్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. నవంబర్ 10 నుంచి డిసెంబర్ 8 వరకు జరిగే కార్తీక మాసంలో ముఖ్య పర్వదినాల సందర్భంగా స్వామివారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో, అందుకు అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేపట్టనున్నారు.

ఈ నేపథ్యంలో ఈనెల13 న మంగళవారం ఉదయం 11 గంటలకు అన్నవరంలోని ప్రకాష్ సదన్ మీటింగ్ హాల్లో సమన్వయ సమావేశం నిర్వహించనున్నారు. ప్రత్తిపాడు, తుని శాసనసభ్యుల అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి రెవెన్యూ డివిజనల్ అధికారి, పెద్దాపురం డీఎస్పీ, కాకినాడ జిల్లా వివిధ శాఖల అధికారులు, దేవస్థానం అధికారులు హాజరుకానున్నారు.

కార్తీక మాసంలోని ముఖ్య పర్వదినాలతో పాటు తెప్పోత్సవం, గిరిప్రదక్షిణ వంటి వైదిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై సమావేశంలో చర్చించనున్నారు. భక్తుల రద్దీని నియంత్రించడం, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడటం, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా, భద్రత, అగ్నిమాపక సేవలు, అత్యవసర వైద్య సహాయం వంటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ రూపొందించనున్నారు.

పోలీసు, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్, ఇరిగేషన్, మత్స్యశాఖ, అగ్నిమాపక శాఖ, 108 అత్యవసర సేవలు, ఆర్టీసీ, గ్రామపంచాయతీ తదితర శాఖల అధికారులతో పాటు దేవస్థానం అధికారులు ఈ సమావేశంలో పాల్గొని తమ శాఖల పరిధిలో చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించనున్నారు. కార్తీక మాసంలో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడటం, వైదిక కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం, అన్ని శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశంగా నిలవనుంది.

ప్రజా అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు!

- ప్రతి వినతినీ బాధ్యతగా పరిశీలించాలి..
- గడువులోగా పరిష్కారం చూపాలి
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 296 అర్జీలు
- అధికారులకు జాయింట్ కలెక్టర్ ఆదేశాలు



పుట్టపర్తి, అక్టోబర్ 12, మనం న్యూస్: ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించే ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా, వారికి సకాలంలో న్యాయం జరిగేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు.

పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత మేరకు పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించాలని, తీసుకున్న చర్యలతో ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ వేదికకు మొత్తం 296 అర్జీలు అందగా, వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవడంతో పాటు పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్ పంపించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, ఎస్డీసీ విజయకుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు తక్షణ ఊరట!

వినతులపై వెంటనే స్పందన.. సహాయ ఉపకరణాలు అందించిన జేసీ

మానవత్వం చాటిన మౌర్య భరద్వాజ్.. ఆరుగురికి ఉపకరణాల పంపిణీ

పుట్టపర్తి, అక్టోబర్ 12, మనం న్యూస్: ప్రజా సమస్యల పరిష్కారంలో తక్షణ స్పందన బాధితులకు కొండంత భరోసానిస్తుంది. తమ అవసరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన దివ్యాంగులకు శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ వెంటనే అండగా నిలిచారు. పుట్టపర్తిలోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో దివ్యాంగులు తమకు అవసరమైన సహాయ ఉపకరణాల కోసం వినతులు సమర్పించారు. ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు కావాలని కోరడంతో స్పందించిన జాయింట్ కలెక్టర్ అక్కడికక్కడే వారికి ఉపకరణాలు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.



ఈ కార్యక్రమంలో నలుగురికి వినికిడి యంత్రాలు, ఇద్దరికి ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. వినికిడి యంత్రాలు పొందిన వారిలో గజ్జెల కుంటపల్లికి చెందిన నాగరాజు, కొత్తచెరువు మండలం కమ్మలపల్లెకు చెందిన పాములపర్తి నరసింహులు, కదిరికి చెందిన శంకర లక్ష్మి నరసమ్మ, కే. చంద్రశేఖర్ ఉన్నారు. ట్రైసైకిళ్లు పొందిన వారిలో కదిరికి చెందిన ఎస్. షకీల్, కొత్తచెరువుకు చెందిన పి. నరసింహులు ఉన్నారు. అవసరమైన సహాయ ఉపకరణాలు అందడంతో లబ్ధిదారులకు ఊరట లభించింది.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కేవలం వినతులు స్వీకరించడమే కాకుండా, అర్హులైన వారికి తక్షణ సాయం అందించడం ద్వారా అధికారులు ప్రజలకు మరింత చేరువ కావచ్చని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ప్రోగ్రామింగ్ అధికారి షఫియుల్లా, కార్యాలయ సహాయకులు గంగాద్రి తదితరులు పాల్గొన్నారు

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి

ఏలేశ్వరం,అక్టోబర్,12(మనం న్యూస్) : కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ప్రత్తిపాడులో ధర్నా నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అంబేద్కర్ కళామందిర్, అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు ర్యాలీగా చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఉమ్మిడి వెంకట్రావు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ బీజేపీకి అనుకూలంగా పక్షపాత ధోరణితో పనిచేస్తోందని ఆరోపించారు. 13 కోట్ల ఓట్ల తొలగింపునకు బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. శాంతియుతంగా ఆందోళన చేసేందుకు సిద్ధమైన యువతపై కేంద్ర ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేయడం పిరికిపంద చర్య అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు ధరణాల కోట శ్రీను, జిల్లా ఉపాధ్యక్షులు ఊటా శ్రీను, జిల్లా కార్యనిర్వాహక సభ్యులు కొప్పన కోటేశ్వరరావు, కాకినాడ జిల్లా క్రీడా విభాగం అధ్యక్షులు రామకుర్తి సూర్యనారాయణ, ప్రత్తిపాడు మండల కాంగ్రెస్ అధ్యక్షులు దొడ్డిపట్ల సుబ్బరాజు, ఏలేశ్వరం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గున్నపు శ్రీనివాస్, ప్రత్తిపాడు సమన్వయ కమిటీ సభ్యులు ధోని వెంకటేశ్వర్లు, సీపీఎం కన్వీనర్ రొంగల ఈశ్వరరావు, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మానికొండ లచ్చబాబు, సీపీఐ ఎంఎల్ వినోద్ మిశ్రా నాయకులు గండేటి నాగమణి, కందుల ప్రసాద్, సీఐటీయూ నాయకులు పోసపల్లి రమణ, అల్లాడి లక్ష్మి, పైల సూరిబాబు, కె. వరలక్ష్మి, అనంతలక్ష్మి, మరియా తదితరులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రైతులు పంట నష్టపరిహార జాబితాలో పేర్లను నమోదు చేసుకోవాలి

ఖరీఫ్ 2026 పంట నమోదు వివరాలను రైతులు పరిశీలించాలి

గడివేముల,అక్టోబర్ 12 (మనం న్యూస్): ఖరీఫ్ 2026లో ఈ-పంట నమోదు ప్రక్రియ పూర్తయిందని మండల వ్యవసాయ అధికారి పవన్కుమార్ తెలిపారు. రైతులందరూ మంగళవారం తమ రైతు సేవా కేంద్రాలను సందర్శించి పంట వివరాలు సరిగ్గా నమోదయ్యాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. రైతులు తమ ఆధార్ కార్డు, పంట పాస్బుక్ జిరాక్స్ ప్రతులను రైతు సేవా కేంద్రాల్లో అందజేయాలని తెలిపారు. ఖరీఫ్ 2026 పంట నమోదులో వివరాలు సరిగ్గా ఉన్న రైతులు ఈ-కేవైసీ ద్వారా ధ్రువీకరించుకోవాలని సూచించారు. పంట నమోదు కాకపోయినా, వివరాల్లో ఏమైనా అభ్యంతరాలు ఉన్నా రైతులు అర్జీ సమర్పించాలని వ్యవసాయ అధికారి తెలిపారు.



చనుగొండ్ల గ్రామంలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

- రౌడీషీటర్లు, అనుమానితుల ఇళ్లలో తనిఖీలు..
- అనధికార వాహనాలు స్వాధీనం



గూడూరు, అక్టోబర్ 12 (మనం న్యూస్): ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా చనుగొండ్ల గ్రామంలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ (ఇఅఖి) నిర్వహించారు. గూడూరు పోలీస్టేషన్ ఎస్ఐ, సి. బెలగల్ ఎస్ఐతో పాటు కోడుమూరు సర్కిల్ పోలీసు సిబ్బంది సంయుక్తంగా ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గ్రామంలోని రౌడీషీటర్లు, అనుమానిత షీటర్ల ఇళ్లను తనిఖీ చేసి, అనధికార వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టారు.

అనంతరం గ్రామ ప్రజలతో పోలీసులు సమావేశం నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలు శాంతియుత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులకు సహకరించాలని కోరారు.

ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని అధికారులు తెలిపారు.

సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే కార్యక్రమం

కాట్రేనికోన అక్టోబర్ 12 మనం ప్రతినిధి : ప్రతి విద్యార్థి విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని సిద్ధార్థ డిగ్రీ కళాశాల సెక్రటరి అండ్ కరెస్పాండెంట్ ఎం నాగరాజు విద్యార్థులకు సూచించారు. సోమవారం కళాశాల నందు నూతన విద్యార్థుల పరిచయం (ఫ్రెషర్స్ డే) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉన్నత విద్యను అందించేందుకు ఏర్పాటుచేసిన డిగ్రీ కళాశాల ద్వారా చాలా తక్కువ ఫీజులతో ఎంతో మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యాబోధన అందిస్తూ ఉత్తమ ఫలితాలను సాధిస్తూ విద్యార్థులను ఉన్నత విద్యావంతులను చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కళాశాల అధ్యాపకుల సేవలను ఉపయోగించుకొని ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ కే రవి , వైస్ ప్రిన్సిపాల్ ఏ శ్రీనివాస్, అధ్యాపకులు ఎం సతీష్, డి హెచ్ వి సత్యనారాయణ, జే అశోక్, సి హెచ్ సంతోషి కుమారి, కే ఏ స్వామి, ఎన్ రాజు, కష్ణ, స్వర్ణ లత, సలోమి, శ్రీనుబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.



అక్టోబర్ 15న చించినాడ బ్రిడ్జిపై రాకపోకలు పూర్తిగా నిలిపివేత

జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్

అమలాపురం అక్టోబర్ 12 మనం ప్రతినిధి : చించినాడ బ్రిడ్జిపై రహదారి పూర్తి వెడల్పున బిటుమినస్ కాంక్రీట్ (బీసీ) వేరింగ్ కోర్స్ (తుది తారు పొర) నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో అక్టోబర్ 15వ తేదీ ఉదయం 6 గంటల నుంచి అక్టోబర్ 16వ తేదీ ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు అన్ని రకాల వాహనాల రాకపోకలను పూర్తిస్థాయిలో నిలిపివేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చించినాడ బ్రిడ్జిపై రహదారి నాణ్యత, మన్నికను పెంపొందించడంతో పాటు వాహనదారులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు రహదారి పూర్తి వెడల్పున బిటుమినస్ కాంక్రీట్ (బీసీ) తుది తారు పొర నిర్మాణ పనులు చేపడుతున్నట్లు వివరించారు.



ఈ పనులను నాణ్యతా ప్రమాణాలతో, సకాలంలో పూర్తి చేసేందుకు బ్రిడ్జిపై ఒక రోజు పాటు వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమయంలో భారీ వాహనాలు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు సహా ఎటువంటి వాహనాలను బ్రిడ్జిపై అనుమతించబోమని స్పష్టం చేశారు. ప్రయాణికులు అసౌకర్యానికి గురికాకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు కొనసాగించాలని కోరారు.

స్వచ్ఛతకై ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



కాట్రేనికోన అక్టోబర్ 12 మనం ప్రతినిధి : కాట్రేనికోన గ్రామ పంచాయతీ మార్కెట్ పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛ రథం ద్వారా పొడిచెత్త సేకరించి బదులుగా నిత్యావసర సరుకులు అందించే కార్యక్రమాన్ని ఎంపీడీఓ బి రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పలువురు ఉత్సాహంగా పాల్గొని పొడిచెత్త అమ్మకం ద్వారా తమకి అవసరమయ్యే సబ్బులు, పేస్ట్, టీ-పొడి, శాంపులు కొనుగోలు చేశారు. విద్యార్థులు తమకి కావాల్సిన పెన్నులు కొనుక్కున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ స్వచ్ఛ రథం విధిగా ప్రతీ గ్రామాన్ని సందర్శిస్తుందని, ప్రజానీకం పొడిచెత్త వృధాగా పరిసరాల్లో పడేయకుండా స్వచ్ఛ రథానికి అందించాలని,ఫలితంగా నిత్యావసరాలు పొందాలని తెలిపారు. స్వచ్ఛతకై ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పి జి ఆర్ ఎస్ కు 2 పిర్యాదులు

కాట్రేనికోన అక్టోబర్ 12 మనం ప్రతినిధి : కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమాన్ని ఎంపీడీఓ బి రాజేశ్వర్ రావు, తహసీల్దార్ వి రవికిరణ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి పి జి ఆర్ ఎస్ ను ప్రజానీకం ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు .సోమవారం నిర్వహించిన పీజీ ఆర్ ఎస్ కు 2 అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ, తహసీల్దార్ పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు సమయపాలన పాటిస్తూ విధిగా పి జి ఆర్ ఎస్ కు హాజరు కావాలని, తమ శాఖలకు సంబందించిన అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చూపాలని హితవు పలికారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బి మృదుల,హౌసింగ్ సహాయ ఇంజనీర్ డి వేణు, ఎంఈవో కృష్ణమోహన్, డిప్యూటీ ఎంపీడీఓలు ఎన్ శంకర్ నారాయణ,సూర్య నారాయణ రాజు, ఏపీఎం శ్రీనివాస్,పరిపాలన అధికారి సంఘమిత్ర, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



కలెక్టర్ వారి ఆదేశాలు ప్రకారం బోర్ సీజ్ చేసిన తహసీల్దార్



కాట్రేనికోన అక్టోబర్ 12 మనం ప్రతినిధి : కాట్రేనికోన మండలం, దొంతుకుర్రు గ్రామంలో తహసీల్దార్ అధ్యక్షతన రెవెన్యూ, భూగర్భ జలవనరుల శాఖ, మత్స్యశాఖ మరియు పోలీసు శాఖల అధికారుల సమక్షంలో సర్వే నంబర్లు 153/1 మరియు 154/2లోని కొత్తపల్లి నరసింహమూర్తికి చెందిన భూమిని పరిశీలించి సదరు భూమిలో ఉప్పునీటి రొయ్యల చెరువుల సాగు నిర్వహిస్తున్న నేపథ్యంలో, దీనిపై కొప్పిశెట్టి సత్యనారాయణ మరియు ఇతరులు గ్రీవెన్స్ ద్వారా చేసిన ఫిర్యాదు మేరకు, జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల ప్రకారం సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి , సదరు భూమిలో ఉన్న భూగర్భ జలాల బోరును సోమవారం సీజ్ చేయడం జరిగిందని తహసీల్దార్ రవి కిరణ్ తెలిపారు. కార్యక్రమం లో ఎఫ్ డి ఓ చల పతి, అదనపు ఎస్ ఐ వి సత్యనారాయణ, వి ఆర్ ఓ నరసింహ మూర్తి తదితరులు ఉన్నారు.

పినరయిపై రెండు ఎఫ్ఐఆర్‌లు



తిరువనంతపురం, అక్టోబర్ 12 : కేరళం మాజీ ముఖ్యమంత్రి, ఆ రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత పినరయి విజయన్కు బిగ్ షాక్ తగిలింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ ముడుపుల కేసులో ఆయనతో పాటు ఆయన కుటుంబ సభ్యులపై విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో రెండు ఎఫ్ఐఆర్లు నమోదు చేసింది. సోమవారం ఈ కేసులు నమోదు చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో పినరయి విజయన్ను మొదటి నిందితుడిగా, ఆయన కుమార్తె వీణా టీని రెండో నిందితురాలిగా పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కేరళ హైకోర్టు కేసు నమోదు చేయాలని ఆదేశించడంతో విజిలెన్స్ అధికారులు దర్యాప్తు బాధ్యతలు చేపట్టారు.

అల్లుడిపైనా మరో కేసు..

విజయన్ అల్లుడిపైనా విజిలెన్స్ మరో కేసు నమోదు చేసింది. అవినీతి ద్వారా అక్రమంగా ఆస్తులు కూడబెట్టడంతో పాటు, వాటిని అక్రమ మార్గాల్లో యూఏఈకి తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులోనూ వీణాను రెండో నిందితురాలిగా చేర్చినట్లు సమాచారం. రెండు కేసుల దర్యాప్తు కోసం విజిలెన్స్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయనుంది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కేసులు నమోదు చేసిన అధికారులు, ఆరోపణలకు సంబంధించిన అంశాలపై విచారణ చేపట్టనున్నారు. ఈ ఆరోపణలు ఇంకా దర్యాప్తు దశలోనే ఉన్నాయి.

సుప్రీం కోర్టు ముట్టడికి ప్రతిపక్షాల యత్నం.. ఢిల్లీలో భారీ బందోబస్తు

ఢిల్లీ, అక్టోబర్ 12 : దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ వేడి రాజుకుంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీనామా చేయాలని, ఈవీఎంలను రద్దు చేసి బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు



నిర్వహించాలనే డిమాండ్లతో ఇండియా కూటమి 'చలో ఢిల్లీ: ప్రజాస్వామ్యం కోసం మార్చ్' పేరిట భారీ ఆందోళనకు పిలుపునిచ్చింది. కన్నాట్ ప్లేస్ నుంచి సుప్రీం కోర్టు వరకు ర్యాలీగా వెళ్లి చీఫ్ జస్టిస్ సూర్యకాంత్కు వినతిపత్రం అందజేయాలని ప్రతిపక్ష నేతలు నిర్ణయించగా, భేటీకి సీజేఐ నిరాకరించారు.

వైమానిక దాడిలో 13 మంది మృతి

సూడాన్-ఈజిప్టు సరిహద్దు బంగారు గని వద్ద ఘటన

కైరో, అక్టోబర్ 12 : సూడాన్-ఈజిప్టు సరిహద్దు ప్రాంతంలో జరిగిన ఓ వైమానిక దాడిలో 13 మంది బంగారు గని కార్మికులు మృతి చెందారని ఓ వైద్య బృందం ప్రకటించింది. దాడి జరిగిన ప్రాంతంలో సంప్రదాయ పద్ధతుల్లో చిన్నతరహా బంగారం తవ్వకాలు విస్తృతంగా జరుగుతుంటాయి. సూడాన్-ఈజిప్టు-లిబియా మధ్య ప్రాంతంలో శనివారం జరిగిన ఈ వైమానిక దాడుల్లో మరో 28 మంది గాయపడ్డారని సూడాన్ వైద్యుల నెట్వర్క్ వివరించింది. ఈ దాడులు ఎవరి పని అనేది ఇప్పటి వరకూ తెలియరాలేదు.




తమ దేశానికి చెందిన ఆ ప్రాంతాన్ని విడిచి వెళ్లాలంటూ బంగారం తవ్వకాలకు పాల్పడుతున్న వారిని ఈజిప్టు అధికారులు పలుమార్లు హెచ్చరించారని నెట్వర్క్ తెలిపింది. సూడాన్లో యుద్ధానికి బంగారం కీలక ఆధారంగా ఉంది. ఈ క్రమంలో డార్ఫర్, కోర్డోఫాన్ ప్రాంతాల నుంచి వందల టన్నుల బంగారాన్ని తిరుగుబాటు పారామిలిటరీ దళమైన 'రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్' అక్రమంగా రవాణా చేసింది.



రష్యా-ఉక్రెయిన్ ఒప్పందం.. తనకు తెలియదన్న జెలెన్స్కీ

కీవ్, అక్టోబర్ 12 : రష్యా, ఉక్రెయిన్ మధ్య తక్షణమే ఇంధన వనరుల కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం ప్రకటించారు. విద్యుత్, చమురు, గ్యాస్ వంటి ఇంధన మౌలిక సదుపాయాలపై పరస్పర దాడుల నిలిపివేతకు ఇరుపక్షాలూ అంగీకరించాయన్నారు. ఈ ప్రకటనపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ స్పందించారు. ఈ విషయం తనకు ముందుగా తెలియదన్నారు. మీడియాలో వచ్చిన వార్తలు చూసే తాను తెలుసుకున్నట్లు చెప్పారు. అయితే ఇది మంచి పరిణామమేనని పేర్కొన్నారు. ఈ ఒప్పందానికి రష్యా కట్టుబడి ఉంటే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. తమ ఇంధన సదుపాయాలపై మాస్కో దాడులు ఆపిన వెంటనే.. తాము కూడా ఆ దేశ చమురు శుద్ధి కర్మాగారాలపై దాడులు నిలిపివేస్తామని జెలెన్స్కీ వెల్లడించారు. ఉద్రిక్తతలను తగ్గించే ఏ చర్యలైనా ఇరుపక్షాల నుంచి ఉన్నప్పుడే శాంతి స్థాపన సాధ్యమవుతుందన్నారు. కాగా.. ట్రంప్ ప్రకటనపై అటు రష్యా ఇప్పటి వరకూ స్పందించలేదు సరికదా.. ప్రకటన అనంతరం ఉక్రెయిన్లోని పలు ప్రాంతాలపై దాడులు చేపట్టడం గమనార్హం. దేశ రాజధాని కీవ్ సహా పలు ప్రాంతాల్లోని విద్యుత్ కేంద్రాలపై డ్రోన్ దాడులు జరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ వెల్లడించారు. ఖర్కీవ్లో ఒక దుకాణంపై జరిగిన దాడిలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా.. 20 మందికి పైగా గాయపడినట్లు తెలిపారు. ఇకనైనా దాడులు ఆపకపోతే రష్యా తీవ్ర పర్యవసానాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

సౌదీలోని దమ్మామ్ ఎయిర్పోర్టుపై హూతీల భీకరదాడి



రియాద్, అక్టోబర్ 12 : సౌదీ అరేబియాలోని దమ్మామ్లోని కింగ్ ఫహద్ అంతర్జాతీయ ఎయిర్పోర్టుపై ఆదివారం అర్ధరాత్రి హూతీ రెబల్స్ క్షిపణులతో విరుచుకుపడ్డారు. దమ్మామ్లో జరిగిన దాడిలో నష్టం వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. మరోవైపు రియాద్లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై కూడా రెండో విడత దాడి చేశారు. ఈ దాడిలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు.

దమ్మామ్ విమానాశ్రయం రియాద్కు 410 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది అరేబియన్ గల్ఫ్ తీరంలో కీలక పారిశ్రామిక నగరం. దీనికి తోడు ఇక్కడి ఎయిర్పోర్టు కీలక ఏవియేషన్ హబ్.

సౌదీ అరేబియాలో ఎయిర్పోర్టులకు వెళ్లొద్దు: హూతీలు

సౌదీ అరేబియా ఎయిర్పోర్టులకు ప్రయాణికులు, విమానాలు వెళ్లొద్దని హూతీలు హెచ్చరికలు జారీ చేశారు. తమపై సౌదీ దాడులు నిలిపివేసే వరకు తాము వెనక్కి తగ్గమన్నారు. సౌదీకి మరింత భయానక పరిస్థితి రానుందని పేర్కొన్నారు.

చర్చలతోనే పరిష్కారం: ఇరాన్


సౌదీ-హూతీలు చర్చలతోనే సమస్యలు పరిష్కరించుకోవాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. తమకు పొరుగుదేశాలతో యుద్ధాలు చేయాలన్న కోరికలేదని పేర్కొన్నారు. హూతీలు పూర్తిగా స్వతంత్ర వైఖరితోనే పనిచేస్తున్నారన్నారు. సౌదీపై దాడులకు ఇరాన్ ప్రోత్సహించిందన్న వాదనలు వస్తున్న నేపథ్యంలో అరాగ్చీ స్పందించారు.

రియాద్ ఎయిర్పోర్ట్పై దాడిని టర్కియే తీవ్రంగా ఖండించింది. ఇవి అంతర్జాతీయ చట్టాలకు పూర్తిగా వ్యతిరేకమని పేర్కొంది. వీటిని తక్షణమే నిలిపేయాలని డిమాండ్ చేసింది. సౌదీకి తాము పూర్తిగా అండగా నిలుస్తామని ప్రకటించింది.

సౌదీకి అత్యవసరమైతే తప్ప తమ దేశ ప్రజలు వెళ్లొద్దని యూకే ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసింది. ముఖ్యంగా జెడ్డా, దమ్మామ్, మదీనా ఎయిర్పోర్టులకు వెళ్లే విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది.

కండక్టర్గా జీవితమే బాగుండేది

సూపర్ స్టార్ రజనీకాంత్




చెన్నై, అక్టోబర్ 12 : బస్సు కండక్టర్గా జీవితాన్ని ప్రారంభించి, ఆ తరువాత నటుడిగా మారారు రజనీకాంత్. దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తూ సూపర్ స్టార్ గా ఎదిగారు. రజనీకాంత్లో అభిమానులకు నచ్చేది తన నటన మాత్రమే కాదు, ఎంత ఎత్తుకు ఎదిగినా వినయంతో ఒదిగి ఉండే ఆయన వ్యక్తిత్వం. ఎన్నో సందర్భాల్లో తన జీవిత ప్రయాణం గురించి మాట్లాడిన ఆయన, తాజాగా మరోసారి బెంగళూరులో బస్సు కండక్టర్గా చేసినప్పటి రోజులను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం నటుడిగా అగ్రస్థాయిలో ఉన్నప్పటికీ, కండక్టర్గా పనిచేసినప్పుడే ఎక్కువ సంతోషంగా ఉండేవాడినని తెలిపారు.

'జైలర్ 2' ప్రచార కార్యక్రమంలో చిత్ర దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ, రజనీకాంత్లోని వినయం గురించి ప్రస్తావించారు. దీనికి రజనీ స్పందిస్తూ తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. ''నేను స్టార్ను అయినప్పటికీ, నాకు నటనంటే ఇష్టం. అయితే అంతకంటే బస్సు కండక్టర్గా పనిచేయడమే ఇంకా ఇష్టం. నేను అయిదేళ్ల పాటు కండక్టర్గా పనిచేశాను. ఇప్పటికీ ఆ ఉద్యోగాన్ని మిస్ అవుతుంటాను. నేను తరచూ బెంగళూరు వెళ్లేది కూడా అందుకే. నన్ను నేను ఎప్పుడూ ఓ స్టార్గా భావించలేదు. ఇప్పటికీ బస్సు కండక్టర్గానే భావిస్తుంటాను. అలాంటప్పుడు, నాలాంటి ఓ బస్సు కండక్టర్ మీలాంటి పెద్ద వ్యక్తి ముందు ఎలా ప్రవర్తిస్తారు చెప్పండి?'' అని రజనీకాంత్ అన్నారు. ఈ వ్యాఖ్యలతో ఆయన వ్యక్తిత్వం ఎంత గొప్పదో మరోసారి అర్థమైందని అభిమానులు చర్చించుకుంటున్నారు.

పంజాబ్లో సర్ ఎఫెక్ట్ 13.60 లక్షల ఓటర్ల తొలగింపు

చండీగఢ్, అక్టోబర్ 12 : ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) తర్వాత పంజాబ్ లో ఓటర్ల తుది జాబితాను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) సోమవారం విడుదల చేసింది. సర్ ప్రక్రియలో 13.60 లక్షల ఓటర్ల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించారు. రాష్ట్రంలోని మొత్తం 117 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఓటరు తుది జాబితాను ప్రకటించారు. 7,97,263 ఓటర్లను కొత్తగా జాబితాలో చేర్చారు. అలాగే 13,60,316 మంది ఓటర్ల పేర్లను తొలగించారు. జూన్ లో పంజాబ్లో సర్ ప్రక్రియ ప్రారంభమైనపుడు మొత్తం ఓటర్ల సంఖ్య 2,14,61,043గా ఉంది. సోమవారం ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది జాబితాలో ఆ సంఖ్య 2,01,00,727గా మారింది. ఓటర్ల జాబితాలో పేరులేని ఓటర్లు ఈసీఐ యాప్ లేదా బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్ఓ) ద్వారా ఫాం6ను పూరించి రిజిస్టర్ చేసుకోవాలని ఎన్నికల అధికారులు తెలిపారు.

కాగా.. ఈ ఏడాది మే 14న ఎన్నికల సంఘం జారీచేసిన ఆదేశాల ప్రకారం.. పంజాబ్లో జూన్ 25న సర్ ప్రక్రియ చేపట్టారు. సర్ మూడో దశలో పంజాబ్ను చేర్చారు. 2026 జూన్ 9 నాటికి రాష్ట్రంలో మొత్తం 2,14,61,043 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 35,49,036 మందికి నోటీసులు జారీ చేశారు. వెరిఫికేషన్ తర్వాత



వారిలో 86,038 మందిని అనర్హులుగా ప్రకటించారు. ఇక మొత్తం ఓటర్లు 2,01,00,727 మందిలో 1,03,76,026 మంది పురుషులుకాగా.. 97,24,195 మంది మహిళలు ఉన్నారు. 506 మంది థర్డ్ జెండర్ వర్గం వారున్నారు. ఇక సర్ ప్రక్రియ సమయంలో ఓటర్ల సౌకర్యం కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పోలింగ్ స్టేషన్లను రేషనలైజ్ చేశారు. దాంతో పోలింగ్ స్టేషన్ల సంఖ్య 24,453 నుంచి 25,332కు పెరిగింది.



విజయవాడలో రోడ్డు ప్రమాదం.. నలుగురి సజీవ దహనం

విజయవాడ, అక్టోబర్ 12 : విజయవాడలో ఘోర ప్రమాదం జరిగింది. స్థానిక బైపాస్ రోడ్డులో కారు రెయిలింగ్ను ఢీకొట్టింది. దీంతో కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారులో ప్రయాణిస్తున్న నలుగురు సజీవ దహనమయ్యారు. స్థానికులు వెంటనే స్పందించి.. పోలీసులతోపాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలార్పారు.

ఈ ప్రమాదంలో మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని సమీపంలోని ఆసుపత్రికి పోలీసులు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతులు గుంటూరు జిల్లా నంబూరు, విజయవాడ సమీపంలోని నున్న వాసులని పోలీసులు వివరించారు. మృతులు రాందేవ్, అరుణ, విజయతోపాటు చిన్నారిగా గుర్తించామని అన్నారు. నంబూరులో ఓ ఫంక్షన్లో పాల్గొని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు.

తీవ్రంగా కలచివేసింది: మంత్రి లోకేశ్

ఈ ప్రమాద ఘటనపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పందించారు. 'విజయవాడ వెస్ట్ బైపాస్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు సజీవదహనం కావడం తీవ్రంగా కలచివేసింది. మృతులకు నివాళులు అర్పిస్తున్నాను. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని నారా లోకేశ్ అన్నారు.

కాక్రోచ్ ఎఫెక్ట్ ఢిల్లీ ధర్నాచౌక్ క్లోజ్

జంతర్ మంతర్ను డీనోటిఫై చేసిన ఢిల్లీ పోలీస్

ఢిల్లీ, అక్టోబర్ 12 : దేశ రాజధాని ఢిల్లీలోని ప్రఖ్యాత నిరసనల ప్రాంతం జంతర్ మంతర్ వద్ద ఇకనుంచి నిరసన ప్రదర్శనలు చేపట్టలేరు. ఇప్పటివరకూ ప్రభుత్వ విధానాలపై వ్యతిరేకత తెలిపేందుకు కేంద్రంగా ఉన్న ఆ ప్రాంతాన్ని నిరసన



ప్రదర్శనలు తెలిపే వేదిక నుంచి తొలగిస్తూ ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జంతర్ మంతర్ ను నిరసనలు తెలిపే ప్రదేశం నుంచి డీనోటిఫై చేస్తున్నామని ఆ ప్రకటనలో కమిషనర్ పేర్కొన్నారు. ఢిల్లీలో నిరసన ప్రదర్శనలు, ఆందోళనలు, బైఠాయింపులు వంటి కార్యక్రమాలు నిర్వహించడానికి మూడు ప్రదేశాలను ఆయన వెల్లడించారు. అవే.. రామ్ లీలా గ్రౌండ్, బురారీ గ్రౌండ్, ఈస్ట్ ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్ అని పేర్కొన్నారు. ఇక నుంచి ఆ మూడు ప్రాంతాలలోనే ఆందోళలు, ప్రదర్శనలు, బైఠాయింపులు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం త్వరలోనే వేర్వేరుగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ను విడుదల చేస్తామని తెలిపారు.

కాగా, ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియలో ఓటరు జాబితాల నుంచి ఓటర్ల పేర్లను తొలగించారన్న ఆరోపణలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ)లు జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జంతర్ మంతర్ ను నిరసనలు తెలిపే ప్రాంతం నుంచి తొలగించినట్లు తెలుస్తోంది. జంతర్ మంతర్ను నిరసనలు తెలిపే ప్రాంతం నుంచి తొలగిస్తూ ఢిల్లీ పోలీసు కమిషనర్ జారీ చేసిన ప్రకటన నేపథ్యంలో ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డాయి. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలిపే అవకాశం కూడా లేకుండా చేస్తున్నారని కేంద్రంపై తీవ్రంగా విమర్శలు గుప్పించాయి. ఢిల్లీ పోలీసులు కేంద్ర హోం మంత్రిత్వశాఖ పరిధిలోకి వస్తారు. మరోవైపు తాజా నిర్ణయం నేపథ్యంలో జంతర్ మంతర్ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగనున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన పలు కీలక ప్రభుత్వ విభాగాల భవనాలు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి.

సుప్రీం కోర్టును రాజకీయాల్లోకి లాగొద్దు

- ఇండియా కూటమి నేతలకు సూచించిన సీజేఐ

ఢిల్లీ, అక్టోబర్ 12 : ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఓట్ల చోరీ అంశాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్కు వినతి పత్రం సమర్పించేందుకు సోమవారం సమయం ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు సీజేఐను అభ్యర్థించారు. వారి విజ్ఞప్తిని జస్టిస్ సూర్యకాంత్ తిరస్కరించినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ అంశంపై సీజేఐ స్పందించారు. ఇండి కూటమి నుంచి తనకు వచ్చిన అభ్యర్థనపై ఆదివారం రాత్రి కాంగ్రెస్ కీలక నేతలు ఖర్గే, రాహుల్ గాంధీలకు మెయిల్ పంపినట్లు వెల్లడించారు.



కేంద్ర ప్రధాన ఎన్నికల సంఘం విషయంలో వారు లేవనెత్తాలనుకున్న సమస్యలపై ఇప్పటికే సుప్రీంకోర్టులో విచారణ పెండింగ్లో ఉందని గుర్తు చేశారు. విచారణలో ఉన్న అంశాలపై సమావేశం కావడం అధికారాల విభజన సూత్రానికి విరుద్ధమని సీజేఐ తెలిపారు. కోర్టులో పెండింగ్లో ఉన్న అంశాలపై రాజకీయ నేతలతో సమావేశం కావాల్సిన అవసరం లేదని భావించి, వారికి అపాయింట్మెంట్ నిరాకరించినట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వ పాలనకు సంబంధించిన విషయాల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకోబోవని.. కావాలంటే కాంగ్రెస్ నేతలు ఈ విషయంపై పిటిషన్ ద్వారానే తమను సంప్రదించవచ్చని సీజేఐ సూచించారు. సీఈసీ అంశాలకు సంబంధించిన విషయాలు నేడు విచారణకు రానున్నాయని కూడా ఆయన పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తలుపులు ఎల్లప్పుడూ అందరి కోసం తెరిచే ఉంటాయన్నారు. అంతే కానీ కోర్టులను రాజకీయాల్లోకి లాగాలని చూడొద్దని ప్రతిపక్షాలకు సూచించారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సందర్భంలో సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇదే సమావేశంలో 'నీరు-జీవన అమృతం' అనే అంశంపై సీజేఐ మాట్లాడుతూ.. కలుషిత జలాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దానివల్ల ప్రజల ఆరోగ్యాలకు భారీ ముప్పు పొంచి ఉందన్నారు.

పూంచ్లో భారీ పేలుడు

లష్కరే కమాండర్ సహా నలుగురు ఉగ్రవాదులు మృతి

జమ్ము, అక్టోబర్ 12 : జమ్ముకశ్మీర్లోని పూంచ్ జిల్లా క్రిష్ణా ఘాటీ సెక్టార్లో జరిగిన భారీ పేలుడులో లష్కర్-ఇ-తైబా ఉగ్రవాద సంస్థకు చెందిన టాప్ కమాండర్తో సహా నలుగురు చొరబాటుదారులు దుర్మరణం చెందారు. నియంత్రణ రేఖ వెంబడి నాంగీ టెక్రి ప్రాంతం గుండా భారత్లోకి



చొరబడేందుకు ఈ ఉగ్రమూక యత్నించింది. ఈ క్రమంలో భద్రతా బలగాలు ఏర్పాటు చేసిన పటిష్టమైన యాంటీ-ఇన్ఫిల్ట్రేషన్ గ్రిడ్లో భాగంగా అమర్చిన ల్యాండ్మైన్ ఒక్కసారిగా పేలింది. ఈ ఘటనలో నలుగురు ఉగ్రవాదులు అక్కడికక్కడే మృతి చెందారు. పేలుడు ఘటనలో మృతి చెందిన వారిలో లష్కర్-ఏ-తైబా టాప్ కమాండర్ మొహమ్మద్ ఫైజాన్తో పాటు వకాస్, ఇస్తియాక్, ఆసిమ్లుగా గుర్తించారు. సోమవారం ఉదయం క్రిష్ణా ఘాటీ సెక్టార్లోని సత్వాల్-నాకి ప్రాంతంలో ఈ పేలుడు సంభవించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనతో అప్రమత్తమైన సైన్యం సరిహద్దు వెంబడి భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. కాగా, మెంధార్ సెక్టార్లోనూ మరికొన్ని ల్యాండ్మైన్లను గుర్తించిన బలగాలు వాటిని నిర్వీర్యం చేశాయి. సరిహద్దులో ఉగ్రవాదుల చొరబాటుయత్నాలు నిరంతరం కొనసాగుతున్నప్పటికీ, మన బలగాల పటిష్ట నిఘా కారణంగా వారి కుట్రలు భగ్నమవుతున్నాయి.

మోస్ట్ వాంటెడ్ పర్సన్..

గూగుల్లో నెటిజెన్లు తెగ వెతికిన పేరు నేహా బోరా

హైదరాబాద్, అక్టోబర్ 12 : నేహా బోరా.. నేహా బోరా.. గూగుల్లో ట్రెండ్ అయిన పేరు ఇది. ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ ద్వారా ఓట్ చోరీకి పాల్పడ్డారన్న ఆరోపణలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలతో పాటు కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు కూడా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఆందోళనలో భాగంగా ఒక పోలీసు వ్యాన్ను అడ్డుకోవడానికి యత్నించిన ఓ యువతి ప్రస్తుతం సోషల్ మీడియాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమెనే నేహా బోరా. లెఫ్ట్ వింగ్కు చెందిన విద్యార్థి విభాగం ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ)కు ఆమె జాతీయ అధ్యక్షురాలిగా ఉన్నారు. జంతర్ మంతర్ వద్ద ప్రదర్శనకు వెళ్తుండగా.. ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయినా కూడా ఆమె తన ఇన్ స్టాగ్రామ్ ఖాతా ద్వారా తన మద్దతుదారులతో మాట్లాడారు. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్న తర్వాత గూగుల్లో నెటిజన్లు నేహా గురించి విస్తృతంగా వెతికారు. ఆమె చదువు, వయసు, ఊరు, తండ్రి పేరు ఎవరో తెలుసుకునేందుకు గూగుల్లో వెతికారు. కాగా.. నేహాది ఉత్తరాఖండ్లోని ఖతిమా నగరం. బెంగాల్లోని సిలిగురిలో పాఠశాల విద్య పూర్తి చేశారు. ఢిల్లీ యూనివర్సిటీలోని హిందూ కాలేజీలో సోషియాలజీ చదివారు. తర్వాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఢిల్లీలో పీజీ పూర్తిచేశారు. అలాగే జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీలోనూ ఆమెకు అనుబంధం ఉంది. ఆ వర్సిటీలో థియేటర్ అండ్ పర్ఫార్మెన్స్ స్టడీస్లో డాక్టోరల్ రీసెర్చ్ చేశారు. 2019, 2020లో పౌరసత్వ సవరణ చట్టానికి జరిగిన విద్యార్థి ఆందోళనలకు నేహా బోరా నేతృత్వం వహించారు. ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్(ఏఐఎస్ఏ) లో చేరిన తర్వాత క్రమంగా ఆ అసోసియేషన్కు జాతీయ అధ్యక్షురాలి స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం సీజేపీ ఆందోళనలు, నిరసన ప్రదర్శనల ద్వారా ఆమె పేరు విస్తృతంగా ట్రెండ్ అవుతోంది.



పోలీస్ అమరుల త్యాగాలు మరువలేనిది

- విద్యార్థులు ప్రజల్లో పోలీసు విధులు, త్యాగాలు, బాధ్యతలపై అవగాహన
- విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు
- షార్ట్ ఫిల్మ్ ఫొటోగ్రఫీ పోటీలు
- రక్తదాన శిబిరాలు అవగాహన ర్యాలీలు, ఓపెన్ హౌస్ నిర్వహణ
- జిల్లా ఎస్పి నరసింహ



సూర్యాపేట, అక్టోబర్ 12 (మనం ప్రతినిధి): దేశంలో శాంతిభద్రతల పరిరక్షణ, సమాజ రక్షణ, ప్రజల భద్రత కోసం విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని సూర్యాపేట జిల్లా ఎస్పీకె. నరసింహ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా అక్టోబర్ 21వ తేదీన జిల్లా పోలీస్ కార్యాలయంలోని పోలీసు అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు ఘనంగా నివాళులర్పించి, దేశం కోసం, ప్రజల రక్షణ కోసం వారు చేసిన త్యాగాలను స్మరించుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ ఐక్యతా దినోత్సవం వరకు పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోలీసు అమరవీరుల త్యాగాలపై ప్రజల్లో అవగాహన పోలీసు అమరవీరుల త్యాగాలు, వారి బలిదానాలు, ఆశయాలను ప్రజలకు తెలియజేసేందుకు జిల్లా వ్యాప్తంగా ఫ్లెక్సీలు, హోర్డింగులు, పోస్టర్లను ఏర్పాటు చేయడంతోపాటు పోలీస్ ఫ్లాగ్ డేకు సంబంధించిన వీడియోలను ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేయనున్నట్లు ఎస్పీ తెలిపారు. పోలీసు శాఖ నిర్వహిస్తున్న విధులు, ప్రజల భద్రత కోసం పోలీసులు చేస్తున్న సేవలు, పోలీసు అమరవీరుల త్యాగాల ప్రాముఖ్యతను విద్యార్థులు, యువత, సాధారణ ప్రజలకు వివరించేలా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గ్రామాలు, కాలనీల్లో ప్రజలతో మమేకం, పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది, గ్రామ పోలీసు అధికారులు తమ పరిధిలోని గ్రామాలు, కాలనీలను సందర్శించి ప్రజల సమస్యలు, అవసరాలను తెలుసుకోనున్నట్లు తెలియజేశారు. ఓపెన్ హౌస్ కార్యక్రమాలుꣳ విద్యార్థులు, పౌరులకు పోలీసు వ్యవస్థ పనితీరుపై అవగాహన కల్పించేందుకు ఓపెన్ హౌస్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా పోలీసుల విధులు, ఆయుధాల వినియోగం, పోలీసు కమ్యూనికేషన్ వ్యవస్థ, మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, రోడ్డు ప్రమాదాల నివారణ, పోలీస్ స్టేషన్ల నిర్వహణ, కేసుల దర్యాప్తు విధానం, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ప్రజలకు అందించే పోలీసు సేవల గురించి వివరించనున్నట్లు స్పష్టం చేశారు. దీంతోపాటు ప్రజావగాహన కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి పోలీసు వ్యవస్థపై అవగాహన పెంపొందించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఆన్లైన్ వ్యాసరచన పోటీలు పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సైబర్ భద్రత, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన పెంపొందించేందుకు ఆన్లైన్ వ్యాసరచన పోటీలను నిర్వహిస్తామన్నారు ఇంటర్మీడియట్ స్థాయి వరకు విద్యార్థులకు సైబర్ నేరాల నివారణలో పోలీసుల, పౌరుల పాత్ర.మాదకద్రవ్యాల నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్కు దూరంగా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలు.డిగ్రీ ఆపై స్థాయి విద్యార్థులకు సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో విద్యార్థుల పాత్ర పై ప్రత్యేక అవగాహన కల్పిస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల వ్యాసాలను పరిశీలించి భాషాప్రాతిపదికన ఉత్తమ మూడు వ్యాసాలను ఎంపిక చేసి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన వ్యాసాలను వార్తాపత్రికల్లో ప్రచురించడంతోపాటు జిల్లా పోలీస్ సోషల్ మీడియా ఖాతాల్లోనూ పోస్ట్ చేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా షార్ట్ ఫిల్మ్, ఫొటోగ్రఫీ పోటీలు పోలీసుల విధులు, త్యాగాలు, సేవలు, ప్రతిభను ప్రతిబింబించేలా షార్ట్ ఫిల్మ్, ఫొటోగ్రఫీ పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. పోలీసుల సేవలు, త్యాగాలు, ప్రజల రక్షణ కోసం వారు చేస్తున్న కృషిని తెలియజేసే ఫొటోగ్రాఫ్లతోపాటు గరిష్ఠంగా మూడు నిమిషాల నిడివి గల లఘు చిత్రాలను ఈ పోటీలకు పంపవచ్చని తెలిపారు. వచ్చిన ఎంట్రీల్లో ఉత్తమ మూడు షార్ట్ ఫిల్మ్ను, ఉత్తమ మూడు ఫొటోగ్రాఫ్లను ఎంపిక చేసి బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ షార్ట్ ఫిల్మ్ను, ఫొటోగ్రాఫ్లను జిల్లా పోలీస్ పీఆర్ఓకు అందజేయాలని కోరారు.పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు పోలీసు సిబ్బందిలో ప్రజాసేవ పట్ల నిబద్ధతనుపెంపొందించడంతోపాటు పోలీసు వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు వివిధ అంశాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ పోటీల్లో ప్రధానంగా కింది అంశాలను చేర్చనున్నట్లు వెల్లడించారు.

ప్రజా ప్రయోజనాలను కాంక్షించేదిగా ఫోర్త్ ఎస్టేట్ ఉండాలి



- మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి

నల్లగొండ, అక్టోబర్ 12 (మనం ప్రతినిధి): ప్రజా ప్రయోజనాలను కాంక్షించేదిగా ఫోర్త్ ఎస్టేట్ ఉండాలని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా, నాగార్జునసాగర్ పరిధిలోని జర్నలిస్టులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు సోషల్ మీడియా పై సోమవారం నాగార్జునసాగర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఒకరోజు వర్క్ షాప్ కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ మాట్లాడుతూ జర్నలిజం ప్రజల పక్షాన, ప్రజల మనోభావాలను, ప్రజల ప్రయోజనాలను కాంచించేదిగా ఉండాలన్నారు. ప్రజాప్రయోజనాలను పరిరక్షించే వ్యవస్థ పత్రిక వ్యవస్థని, జర్నలిస్టులు సమాజ సేవకు అంకితం కావాలని, ప్రజలకు సమాచారాన్ని తెలియజేయడం, చైతన్యం చేయడం మీడియా బాధ్యత అని అన్నారు. ప్రజల మనోభావాలను ప్రతిబింబించ లేనప్పుడు ప్రజలకు మీడియాపై నమ్మకం పోతుందన్నారు. సమాజంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థల తర్వాత స్థానం జర్నలిజానిదేనని, ఆ స్థానాన్ని జర్నలిస్టులు నిలబెట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన వర్కింగ్ జర్నలిస్టులు, జర్నలిస్టుల చట్టాలు, పత్రికలు, యాజమాన్యం సంబంధాలు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా ల వ్యత్యాసాలు, జర్నలిజం చట్టాలు, మార్గ దర్శక సూత్రాలు, తదితర వివరాలను జర్నలిస్టులకు కూలంకషంగా వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై ఫాక్ట్ చెక్కర్,ఏ ఐ ట్రైనర్ సత్యప్రియ శిక్షణ ఇవ్వగా, సామాజిక మాధ్యమాలపై ముద్దం నరసింహస్వామి శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు, నల్గొండ జిల్లా సమాచార శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు, జర్నలిస్టుల జిల్లా సంఘం అధ్యక్షులు కృష్ణారెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ ఓ ఎస్ డి .రహమాన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వర్, మీడియా అకాడమీ పిఆర్ఓ శైలేశ్వర్ రెడ్డి ,తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్ ,నందికొండ, దేవరకొండ, మిర్యాలగూడ తదితర ప్రాంతాలు జర్నలిస్టులు మీడియా అకాడమీ చైర్మన్ ను శాలువాలు, పూలబోకేలతో సన్మానించారు.

ఎల్నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ముందుకు వెళ్ళాలి



- ప్రతినీటి బొట్టును పొదుపుగా వినియోగించుకోవాలి
- తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే పంటలను సాగు చేయాలి
- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, అక్టోబర్ 12 (మనం ప్రతినిధి): ఎల్నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, రానున్న 300 రోజులు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. సోమవారం పగిడిమర్రి గ్రామంలో రైతు వేదిక సెంటర్లో తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎల్నినో ప్రభావం కారణంగా నీటి వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు.

నాగార్జున సాగర్లో సాగునీటి లభ్యత పరిమితంగా ఉండటంతో చెరువులు, కాలువలు, బోరుబావుల్లో అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని ,ప్రతి నీటి బొట్టును కాపాడుకుంటూ, ఎంత అవసరమో అంత మాత్రమే వినియోగించుకోవాలన్నారు. భూమి స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా పెసర్లు, మినుములు, కందులు, పొద్దుతిరుగుడు, నువ్వులు వంటి ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. రైతులు పరస్పరం చర్చించుకుని ప్రత్యామ్నాయ పంటలపై తమ అభిప్రాయాలను తెలియజేస్తే, వాటిని ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు. పండ్లు, కూరగాయల సాగు వంటి ప్రత్యామ్నాయాలపై రైతులు దృష్టి సారించాలన్నారు. జూన్, జూలై నెలల వరకు నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ అప్రమత్తంగా ఉండాలని, అందరూ సమష్టిగా పనిచేసి నీటి ఎద్దడిని అధిగమించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి హామీ పనులను వినియోగించుకుని కూలీలు జీవనోపాధి పొందవచ్చని తెలిపారు.రైతులకు అవసరమైన స్ప్రింక్లర్లు తదితర వ్యవసాయ పరికరాల వివరాలను తెలియజేస్తే, ప్రభుత్వ సహకారంతో వాటిని సమకూర్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. గ్రామంలో ఏర్పాటు చేస్తున్న 5 రైతు క్లస్టర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, జిల్లా హర్టికల్చర్ అధికారి శేఖర్, ట్రాన్స్కో ఎస్ఈ ,తహసిల్దార్ పద్మ ఎంపీడీవో వేద రక్షిత సర్పంచ్ నాగవెల్లి నాగమణి సైదులు, ఏఈఓ కీర్తన, జగల్ రెడ్డి, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఎరువు షాపును తనిఖీ చేసిన ఎడిఎ



తిరుమలగిరి అక్టోబర్12 (మనం న్యూస్): తిరుమలగిరి మండలకేంద్రంలో ఎరువులు షాపులను ఏడిఏ తుంగతుర్తి ఎడిఏ రమేష్ బాబు సోమవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్ లన,ఈపాస్ మిషన్ నీ తనిఖీ చేశారు. ఫెర్టిలైజర్ బుక్ చేసుకున్న రైతులకు మాత్రమే ఎరువులను అందించాలని ఆదేశించారు. అందరూ డీలర్లు ఫెర్టిలైజర్ యాక్ట్ సూచనలు పాటించాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ సిహెచ్ నాగేశ్వరరావు ఉన్నారు.

ప్రభుత్వ ధాన్యం... పక్కదారి..!

- ఎన్ ఆర్ ఆర్ గోడౌన్ నుండి కోదాడ రైస్ మిల్లుకు సీఎంఆర్ ధాన్యం
- హమాలీల లారీ పరార్ మిల్లర్ల అక్రమ దందా బట్టబయలు
- స్టాక్ లెక్కల్లో బయటపడుతున్న బాగోతం
- సంబంధిత శాఖ అధికారుల తీరుపై అనుమానం

అనంతగిరి, అక్టోబర్ 12 (మనం ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా సిఎంఆర్ ధాన్యం అక్రమ దందా వేల కోట్లలో లెక్కలు తారుమారు చేస్తూ.. ప్రభుత్వ ధాన్యాన్ని... రైస్ మిల్లర్లు పక్కదారి పట్టిస్తుండటం.. చూస్తూనే ఉన్నాం... సర్కార్ ఎన్ని కఠిన చట్టాలు అమలు చేసిన.. అక్రమార్కుల వ్యాపారం మాత్రం... మారడం లేదు... దీనికి నిదర్శనమే ప్రభుత్వ సీఎంఆర్ ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తూ రీ సైక్లింగ్ కు పాల్పడుతున్న మిల్లర్ల దందా బట్టబయలైంది... జిల్లాలోని అనంతగిరి మండల పరిధిలోనీ బొజ్జగూడెం తండా సమీపంలో గల ఎన్ ఆర్ ఆర్ గోడౌన్ నుండి కోదాడలోని ఓ ప్రముఖ రైస్ మిల్లుకు అక్రమంగా సీఎంఆర్ ధాన్యాన్ని తరలిస్తూ రీ సైక్లింగ్ చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం.ఈ క్రమంలో సమాచారం అందుకున్న.. స్థానిక ప్రజలు జర్నలిస్టులు అక్కడికి చేరుకోగానే హమాలీలు లారీతో హుటాహుటిన పరారయ్యారు.దీంతో మిల్లర్ల అక్రమ దందా బయటపడినట్లైందని స్థానికులు చెబుతున్నారు.

అధికారుల పాత్రపై అనుమానాలు...

ప్రభుత్వ నిబంధనల ప్రకారం గోడౌన్ నుండి ధాన్యం బయటకు వెళ్లాలంటే అధికారుల అనుమతి తప్పనిసరి.అలాంటిది అధికారులకు తెలియకుండా లారీల కొద్దీ ధాన్యం మిల్లుకు ఎలా వెళుతోంది? ఇందులో అధికారుల హస్తం కూడా



ఉందా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.


స్టాక్ తేడాతో బయటపడుతున్న బాగోతం

ఒకవైపు రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతుంటే,మరోవైపు మిల్లర్లు ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టించి సొమ్ము చేసుకోవడం దారుణమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గోడౌన్ లోని స్టాక్ రిజిస్టర్ ను,మిల్లులోని స్టాక్ ను పరిశీలిస్తే అక్రమాల బాగోతం మొత్తం బయటపడుతున్నట్లు సమాచారం...సంబంధిత జిల్లా పౌరసరఫరాల అధికారులు వెంటనే ఎన్ ఆర్ ఆర్ గోడౌన్ లోని స్టాక్ ను,కోదాడ రైస్ మిల్లులోని స్టాక్ ను పరిశీలించి,సీఎంఆర్ ధాన్యం పక్కదారి పట్టిస్తున్న మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని,అక్రమ రీ సైక్లింగ్ దందాను అరికట్టాలని మండల ప్రజలు,రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పీఎం ధన్-ధాన్య కృషి యోజన అమలులో నాగర్కర్నూల్కు జాతీయ గుర్తింపు

- కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్
- జాతీయ స్థాయి మైలురాయి వేడుకలకు హాజరైన జిల్లా ప్రతినిధుల బృందం

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 12 (మనం బ్యూరో)ꣳ వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల ఉత్పాదకత పెంపు, వ్యవసాయ అనుబంధ రంగాల బలోపేతమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన (పీఎండీడీకేవై) పథకం అమలులో నాగర్కర్నూల్ జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది.



ఈ పథకం అమలుకు సంబంధించి న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి మైలురాయి వేడుకల్లో నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అవార్డు అందుకున్నారు. సోమవారం న్యూఢిల్లీలోని ఎన్ఎస్సీ కాంప్లెక్స్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ పురస్కారాన్ని స్వీకరించారు. దేశంలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంపొందించడం, పంటల ఉత్పాదకతను మెరుగుపరచడం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజనను అమలు చేస్తోంది. వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సమస్యలను అధిగమిస్తూ రైతులకు మెరుగైన సాగు అవకాశాలు కల్పించేందుకు ఈ పథకం ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు.

వ్యవసాయ ఉత్పాదకత పెంపు, సాగునీటి వనరుల సమర్థ వినియోగం, పంటల దిగుబడుల మెరుగుదల, ఆధునిక వ్యవసాయ పద్ధతుల ప్రోత్సాహం, రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం వంటి అంశాలు వ్యవసాయాభివృద్ధిలో కీలకంగా నిలుస్తున్నాయి. ఈ లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వ శాఖలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన పథకం అమలులో ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా న్యూఢిల్లీలో జాతీయ స్థాయి మైలురాయి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగర్కర్నూల్ జిల్లా నుంచి నలుగురు సభ్యులతో కూడిన ప్రతినిధుల బృందం హాజరైంది. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్తో పాటు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యశ్వంత్ రావు, కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త ఓ శైలా, ప్రగతిశీల రైతు రాజేందర్ రెడ్డి ఈ బృందంలో పాల్గొన్నారు.

నీటి బొట్టు - వృధా వద్దు

- నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి
- జోగులాంబ జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్



ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 12 (మనం బ్యూరో): ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసినందున, ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు. ప్రతి నీటి బొట్టు ఒడిసిపట్టి అవసరాలకు ఉపయోగించుకోవాలన్నారు. నీటి చుక్క కూడా వృధా పోకుండా ఒడిసిపట్టే విధంగా ప్రతి ఒక్కరు జాగ్రత్త పడాలన్నారు. సోమవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాదు నుంచి పలువురు ఉన్నతాధికారులతో కలిసి రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల్లోని రైతు వేదికల్లో పాల్గొన్న సంబంధిత శాఖల అధికారులు, రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రబీ సీజన్లో ఎట్టి పరిస్థితుల్లో రైతులు వరి సాగు చేయవద్దన్నారు. బిందు సేద్యంతో పామ్ తోటలు, కూరగాయలు వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేయవచ్చన్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోర్వెల్స్ రీఛార్జ్, తదితర పనులను చేపట్టి జలవనరులను కాపాడుకోవాలన్నారు. రాష్ట్రంలో 315 మండలాల్లో వర్షపాతం తక్కువగా ఉందన్నారు. ప్రభుత్వం త్వరలోనే కరువు మండలాలను ప్రకటిస్తుందన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి తాగునీటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై సరైన ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. భూగర్భ జల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు గ్రౌండ్ లెవెల్ నివేదికలను అందజేయాలన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపడుతుందన్నారు. గద్వాల మండలం చెనుగోనుపల్లి గ్రామ రైతు వేదిక వద్ద అదనపు కలెక్టర్ మధుమోహన్ పలు శాఖల అధికారులు, గ్రామస్తులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ను తిలకించారు. వీసి అనంతరం అదనపు కలెక్టర్ గ్రామస్తులతో మాట్లాడుతూ... ప్రభుత్వ సూచనలను అనుసరించి రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని తెలిపారు. ఎల్ నినో వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయడం జరుగుతుందన్నారు. ఆరుతడి పంటల సాగుపై రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కలిగేందుకు విస్తృతంగా అన్ని మాధ్యమాల ద్వారా, కళాజాత బృందాలతో ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు. రైతులు నష్ట పోకుండా ముందస్తుగా అప్రమత్తం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు కృషి చేస్తారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మమ్మ, నీటిపారుదల శాఖ ఇన్ఛార్జి ఎస్ఈ శ్రీనివాసులు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రాజ్ కుమార్, రాజశేఖర్, వ్యవసాయ శాఖ ఏవోలు ప్రతాప్ కుమార్, సాజిద్, ఏఈఓ ప్రవళిక, పంచాయతీ కార్యదర్శి రామ నర్సింహులు, ఇతర అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ



టేకుమట్ల అక్టోబర్ 12 మనం న్యూస్ ꣳ వెలిశాల గ్రామ కరోబార్ రేవెల్లి సదయ్య ఇటీవల ప్రమాదశరస్తు బైక్ పై నుండి పడి గాయ తీవ్ర గాయాలతో హాస్పటల్లో చికిత్స పొంది తన నివాసానికి వచ్చిన సందర్భంగా ఈరోజు వారి నివాసానికి వెళ్లి వారిని పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్న టేకుమట్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి బుర్నపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు డ్యాగర మల్లేష్ తల్లి డ్యాగర కొమరమ్మ ఇటీవల మృతిచెందగా ఈరోజు వారి చిత్రమటానికి పుష్పాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన టేకుమట్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు కార్యక్రమంలో చిట్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ లింగంపెల్లి కిరణ్ రావు బుర్నపల్లి సర్పంచ్ నేరెళ్ల రామకృష్ణ, వెంకట్రావుపల్లి సర్పంచ్ పేరుమాండ్ల చంద్రకళ మొగిలి, బండి రవి బోర్నపల్లి ఉప సర్పంచ్ సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు పొన్నమనేని ప్రవీణ్ రావు వెంకట్రావుపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు చెక్క ఓదెలు, సమ్మెట ఐలయ్య, రేణిగుంట్ల సమ్మయ్య,గడ్డం నర్సయ్య, వార్డ్ మెంబర్ రేణిగుంట్ల మొగిలి. కొమ్మనవేని కొమురెల్లి బక్కయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దశాబ్ది ఉత్సవాలు

అధికారులకు స్వీట్లు పంపిణీ చేసిన బీఆర్ఎస్ నాయకులు



టేకుమట్ల, అక్టోబర్ 12 మనం న్యూస్ꣳ మండలం ఏర్పడి పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) టేకుమట్ల మండల పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో స్వీట్లు పంపిణీ చేసి దశాబ్ది వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.

ఈ సందర్భంగా టేకుమట్ల మండల తహసీల్దార్ సిబ్బంది, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిబ్బందికి టేకుమట్ల పోలీస్ స్టేషన్లో ఎస్ఐ కి, పోలీస్ సిబ్బందికి బీఆర్ఎస్ నాయకులు స్వీట్లు పంపిణీ చేసి మండల దశాబ్ది శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటైన టేకుమట్ల మండలం పదేళ్ల ప్రస్థానంలో ప్రజలకు పరిపాలనను చేరువ చేయడంలో కీలక పాత్ర పోషించిందని నాయకులు పేర్కొన్నారు. మండల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ టేకుమట్ల మండల పార్టీ అధ్యక్షులు సట్ల రవి గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, మండల ముఖ్య నాయకులు బందెల నరేష్, మారం లింగా రెడ్డి,అఫజల్, సారయ్య, మచ్చ రాజయ్య సర్పంచులు మాట్ల శ్రీనివాస్, రాం ఉమా దేవేందర్ పార్టీ టౌన్ అధ్యక్షులు నిమ్మల స్వామి,బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు అక్రమ్,నాయకులు నానవేణి కుమార్, చెలకాని రాకేష్, సోల్లెటి నరేష్ ,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి సీతక్క విజ్ఞప్తికి స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం

ములుగు నియోజకవర్గంలో విద్యుత్ లైన్ల మార్పునకు రూ.3 కోట్ల నిధులు మంజూరు

మంత్రి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. ఉత్తర్వులు జారీ చేసిన విద్యుత్ శాఖ



ములుగు, అక్టోబర్ 12,మనం ప్రతినిధి: ములుగు నియోజకవర్గ ప్రజల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని మంత్రి సీతక్క చేసిన విజ్ఞప్తికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. నివాస ప్రాంతాల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్లను మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ.3 కోట్ల బడ్జెట్ను కేటాయించింది. ఈ మేరకు విద్యుత్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నివాస ప్రాంతాల మీదుగా విద్యుత్ లైన్లు వెళ్లడం వల్ల స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, భద్రతాపరమైన సమస్యలను మంత్రి సీతక్క ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ప్రమాదాల ముప్పును తగ్గించేలా విద్యుత్ లైన్లను మార్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి సీతక్క విజ్ఞప్తిపై ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు.

ఈ నేపథ్యంలో ములుగు నియోజకవర్గంలో విద్యుత్ లైన్ల మార్పునకు రూ.3 కోట్ల నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజల సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న మంత్రి సీతక్క చొరవతో ములుగు నియోజకవర్గ ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది.

విద్యుత్ లైన్ల మార్పు పనులు పూర్తయితే నివాస ప్రాంతాల్లో ప్రజలకు భద్రత పెరగడంతో పాటు, విద్యుత్ లైన్ల కారణంగా ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోనున్నాయి. సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి కృషిచేసిన మంత్రి సీతక్కకు ఈ సందర్భంగా ములుగు నియోజకవర్గ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

బర్రెల ఫామ్ సమస్యపై ప్రజావాణిలో ఫిర్యాదు

- తప్పుడు సంజాయిషీపై అభ్యంతరం
- సమగ్ర విచారణకు విజ్ఞప్తి



నల్లబెల్లి, అక్టోబర్ 12(మనం ప్రతినిధి): నల్లబెల్లి మండలం కొండాయిలుపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న బర్రెల ఫామ్ నుంచి వెలువడుతున్న దుర్వాసన, వ్యర్థాల కారణంగా దోమలు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఫామ్ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఈ సమస్యపై గతంలో ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేయగా, అధికారులు స్పందించి ఫామ్ యజమాని మామిండ్ల సురేష్కు నోటీసు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఫామ్ యజమాని సమర్పించిన తప్పుడు సంజాయిషీ పత్రంపై ఫిర్యాదుదారుడు మామిండ్ల వీరారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫామ్ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాల అభిప్రాయాలను తీసుకోకుండా, సంజాయిషీ పత్రంలోని వివరాలను పూర్తిగా తెలియజేయకుండానే దూర ప్రాంతాల్లో నివసిస్తున్న కొందరు గ్రామస్తుల నుంచి సంతకాలు సేకరించి ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించారని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై సంతకాలు చేసిన గ్రామస్తులను వీరారెడ్డి ఆరా తీయగా, పత్రంలోని విషయాలు తమకు తెలియవని, తమ ఇంటి వద్ద దుర్వాసన వస్తుందా అని అడిగినప్పుడు వారు మీ ఇంటి దగ్గర ఫామ్ ఉంటే మాకెందుకు వస్తుంది రావడం లేదని చెప్పడంతో సంతకాలు చేయాలని కోరినట్లు వారు తెలిపారని పేర్కొన్నారు. దీంతో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా సంతకాలు సేకరించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తప్పుడు సంజాయిషీ పత్రంలోని అంశాలపై తన అభ్యంతరాలను వివరిస్తూ, వాస్తవ పరిస్థితులకు సంబంధించిన వివరాలను జతచేశారు.

బర్రెల ఫామ్ పరిసరాల్లో నివసిస్తున్న కుటుంబాలతో పాటు ఇతర గ్రామస్తుల సంతకాలను సేకరించి, సోమవారం ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు అందజేశారు. ఈ ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి, సంతకాల సేకరణకు సంబంధించిన వాస్తవాలను నిర్ధారించాలని మామిండ్ల వీరారెడ్డి అధికారులను కోరారు. బర్రెల ఫామ్ నుంచి వెలువడుతున్న వ్యర్థాలు, దుర్వాసన, దోమల సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నివాస ప్రాంతాలకు దూరంగా బర్రెల ఫామ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.

ఏటూరునాగారం సెంటర్కు 3 పతకాలు

- రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్లో సత్తా చాటిన క్రీడాకారిణులు



ఏటూరునాగారం, అక్టోబరు 12 (మనం న్యూస్): 12వ తెలంగాణ రాష్ట్ర సబ్జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్-2026లో ఏటూరునాగారం సెంటర్ క్రీడాకారిణులు అద్భుత ప్రతిభ కనబరిచి మూడు పతకాలను సాధించారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ములుగు జిల్లా ఏటూరునాగారం సెంటర్కు చెందిన క్రీడాకారిణులు ప్రతిభ చాటారు. ట్రయాథ్లాన్-అ విభాగంలో టి. అక్షర స్వర్ణ పతకం సాధించి సత్తా చాటగా, లాంగ్జంప్లో బి. హర్షిణి రజత పతకం కైవసం చేసుకుంది. ట్రయాథ్లాన్-ఆ విభాగంలో బి. హర్షిత కాంస్య పతకం సాధించింది. దీంతో ఏటూరునాగారం సెంటర్కు మొత్తం మూడు పతకాలు దక్కాయి. ఈ సందర్భంగా ఏటూరునాగారం ఏఎస్పీ శ్రీ మానన్ భట్ క్రీడాకారిణులను అభినందించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం అభినందనీయమని పేర్కొం టూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ములుగు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కోచ్లు పి. పర్వతాల కుమారస్వామి, ల. భావన ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారిణులు ఈ ఘనత సాధించడం పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

ఢిల్లీలో ఇండియా కూటమి మహాధర్నాకు సీతక్క

- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాకు డిమాండ్



ములుగు, అక్టోబర్ 11,మనం ప్రతినిధి: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్మంతర్ వద్ద ఇండియా కూటమి చేపట్టిన మహాధర్నాలో పాల్గొనేందుకు మంత్రి సీతక్క బయలుదేరారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణతోపాటు ఓటు చోరీ ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు. మంత్రి ధనసరి అనసూయ సీతక్కతోపాటు ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సార్, పలువురు కాంగ్రెస్ నాయకులు ఢిల్లీకి బయలుదేరారు.

నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి

- రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి
- అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి



ములుగు, అక్టోబర్ 11,మనం ప్రతినిధిః ఎల్నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కానందున రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి.తెలిపారు. సాగునీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంచుకొని, నీరు, విద్యుత్ను పొదుపుగా వినియోగించాలని తెలిపారు. సోమవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాదు నుంచి పలువురు ఉన్నతాధికారులతో కలిసి రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల్లోని రైతు వేదికల్లో పాల్గొన్న సంబంధిత శాఖల అధికారులు, రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా

ఎల్నినో ప్రభావం, వర్షపాతం లోటు, సాగునీటి లభ్యత, ఆరుతడి పంటల సాగుపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రబీ సీజన్లో ఎట్టి పరిస్థితుల్లో రైతులు వరి సాగు చేయవద్దన్నారు. బిందు సేద్యంతో పామ్ తోటలు, కూరగాయలు వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేయవచ్చన్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోర్వెల్స్ రీఛార్జ్, తదితర పనులను చేపట్టి జలవనరులను కాపాడుకోవాలన్నారు. రాష్ట్రంలో అధిక మండలాల్లో వర్షపాతం తక్కువగా ఉందని, ప్రభుత్వం త్వరలోనే కరువు మండలాలను ప్రకటిస్తుందన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి తాగునీటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై సరైన ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. భూగర్భ జల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు గ్రౌండ్ లెవెల్ నివేదికలను అందజేయాలన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ములుగు జిల్లాలోని 22 రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా పలు శాఖల అధికారులు, గ్రామస్తులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ను తిలకించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావుతో కలిసి హాజరయ్యారు. వీసి అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలను అనుసరించి రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని తెలిపారు. ఎల్ నినో వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయడం జరుగుతుందన్నారు. ఆరుతడి పంటల సాగుపై రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కలిగేందుకు విస్తృతంగా అన్ని మాధ్యమాల ద్వారా, కళాజాత బృందాలతో ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు. రైతులు నష్ట పోకుండా ముందస్తుగా అప్రమత్తం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు కృషి చేస్తారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వర్షాభావ పరిస్థితులు, నీటి వినియోగం, ఆరుతడి పంటల సాగుపై క్షేత్రస్థాయిలో రైతులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, డి ఆర్ డి ఓ రవీందర్, డి సి ఎస్ ఓ ఫైజల్ హుస్సేన్, డి ఎం డి సి ఎస్ ఓ క్రిష్ణ వేణి, డి ఎంహెచ్ ఓ గోపాలరావు, సి పి ఓ జవహర్, డిపి ఆర్ ఓ రఫిక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు



ములుగు, అక్టోబర్ 11,మనం ప్రతినిధిః ప్రజావాణిలో అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన దరఖాస్తులను స్వీకరించారు. భూ సమస్యలకు సంబంధించి 05, ఇందిరమ్మ ఇళ్లకు 01, పింఛన్లకు 01, ఉద్యోగాలకు 02, ఇతర శాఖలకు సంబంధించి 05, మొత్తం 14 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గర్ల్స్ క్యాడెట్స్ ఆర్మీ అటాచ్మెంట్ క్యాంపుకు ఎంపిక



వరంగల్, అక్టోబర్ 12(మనంన్యూస్): స్థానిక లాల్ బహదూర్ కళాశాల ఎన్సిసి పదవ తెలంగాణ బెటాలియన్ వరంగల్ గ్రూప్ నుండి ముగ్గురు గర్ల్స్ క్యాడెట్స్ ఆర్మీ అటాచ్మెంట్ క్యాంపుకు ఎంపిక వెళ్లినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డిహెచ్ రావు తెలిపారు. జూనియర్ అండర్ ఆఫీసర్ శివరాత్రి రశ్మిత, ఎం. సాయి మీనాక్షి, బి.అనూష ఉన్నారు వీరు హైదరాబాద్ మెహిదీపట్నంలో ఆర్మీ కంటోన్మెంట్ ఏరియాలో ఆయుధాలపై ప్రత్యేక శిక్షణ,ఆయుధాల ఉపయోగం వాటి ద్వారా శత్రు శిబిరాలనేలా ఛేదించాలి భవిష్యత్తు భారతార్మి వాటి ద్వారా సాధించిన సాధించబోయే యుద్ధ తంత్రాలపై క్యాడే ట్స్ కు శిక్షణ ఇస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ముండ్రాతి సదానందం,సీనియర్ కాడెట్స్ పాల్గొన్నారు. మంచి ప్రతిభ కనబరిచి బెటాలియన్ కు కళాశాలకు పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ తెలిపారు. క్యాంపు అక్టోబర్ 26.వరకు కొనసాగుతుంది హైదరాబాద్ ఆర్మీ పర్యవేక్షణలోఅని ప్రిన్సిపాల్ తెలిపారు.

మాలోత్ వెంకన్ననాయక్‌కు అర్థశాస్త్రంలో డాక్టరేట్



హనుమకొండ, అక్టోబర్ 12(మనం న్యూస్): కాకతీయ విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగ పరిశోధక విద్యార్థి మాలోత్ వెంకన్న నాయక్ కు కేయూ డాక్టరేట్ను ప్రకటించింది. 'పార్టిసిపేషన్ ఆఫ్ ట్రైబల్ విమెన్ ఇన్ అగ్రికల్చర్ ఎ స్టడీ ఇన్ తెలంగాణ స్టేట్ ' అనే అంశంపై సమర్పించిన సిద్ధాంత పరిశోధన గ్రంథానికిగాను ఆయనకు పీహెచ్డీని ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ తెలిపారు. అర్థ శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. స్వరూప రాణి (రిటైర్డ్) పర్యవేక్షణలో వెంకన్న నాయక్ పరిశోధన పూర్తి చేశారు. గిరిజన వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి, ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ ఉన్నత విద్యను అభ్యసించి, కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి అర్థశాస్త్రంలో పీహెచ్డీ (డాక్టరేట్) సాధించిన మాలోత్ వెంకన్న నాయక్ విద్యార్థులకు, ముఖ్యంగా గిరిజన యువతకు స్ఫూర్తిగా నిలిచారు.

సాధారణ వ్యవసాయ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన వెంకన్న నాయక్ విద్యను జీవిత లక్ష్యంగా ఎంచుకొని, కష్టపడి చదువుతూ పరిశోధన రంగంలో తనదైన గుర్తింపును సంపాదించారు. ఆర్థిక ఇబ్బందులు, సామాజిక సవాళ్లు ఎన్ని ఎదురైనా పట్టుదలతో ముందుకు సాగితే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని తన విజయంతో నిరూపించారు. మరియు అనేక జాతీయ, అంతర్జాతీయ పరిశోధన పత్రాలను సమర్పించారు. కాకతీయ యూనివర్సిటీ లో తెలంగాణ ట్రైబల్ స్టూడెంట్ ఫ్రంట్ అధ్యక్షులుగా ఎన్నికై అనేక గిరిజన విద్యార్థుల సమస్యలను పరిష్కరించారు. వరంగల్ జిల్లా, నెక్కొండ మండలం, నాగారం పంచాయతీ పరిధిలోని భవానిగడ్డ తండా గ్రామ వాసి అయిన మలోత్ హరిలాల్, హచమ్మ కుమారుడు వెంకన్న ని ఈ సందర్భంగా విబాగా అధిపతి ఆచార్య సురేష్ లాల్, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టడం నా నేపథ్యం.. గిరిజన బిడ్డగా ఎదగడం నా గర్వం.. విద్య ద్వారా డాక్టరేట్ సాధించడం నా జీవితంలో ఒక గొప్ప మైలురాయి. నా విజయం గిరిజన యువతకు, వ్యవసాయ కుటుంబాల పిల్లలకు స్ఫూర్తిగా నిలవాలని కోరుకుంటున్నాను అని మాలోత్ వెంకన్న నాయక్ పేర్కొన్నారు.

పెద్దకర్మకు 75 కేజీల బియ్యం అందజేత


మృతుడి కుటుంబానికి అండగా నిలిచిన కాంగ్రెస్ మండల నాయకులు



కన్నాయిగూడెం, అక్టోబరు 12 (మనం న్యూస్): మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మానవతా దృక్పథంతో మృతుడి కుటుంబానికి అండగా నిలిచారు. కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన నల్లేబోయిన మహేష్ (యేసు) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో సోమవారం నిర్వహించిన పెద్దకర్మ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ నాయకులు హాజరై, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ 75 కేజీల బియ్యాన్ని అందజేశారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, బుట్టాయిగూడెం సర్పంచ్ జాడి రాంబాబు ఆధ్వర్యంలో నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వాయి గ్రామ సర్పంచ్ కోరం నర్సయ్య (రాజు), కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు తాటి రాజబాబు, యూత్ నాయకుడు తాటి లచ్చలు, గ్రామ పెద్దలు, యువకులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

దసరా వేడుకలకు రూ.80 వేల విరాళం

రోడ్ల మరమ్మతు పనులను పరిశీలించిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్బాబు



మంగపేట, అక్టోబర్ 11, మనం ప్రతినిధిః దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్ల మరమ్మతు పనులు చేపడుతున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్బాబు తెలిపారు. ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచి కాకులమర్రి శ్రీలత ఆధ్వర్యంలో జరుగుతున్న రోడ్ల గుంతల పూడ్చివేత పనులను ఆయన పరిశీలించారు. విజయదశమి వేడుకలకు భక్తులు, ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. దసరా ఉత్సవాల నిర్వహణకు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తుమ్మ మల్లారెడ్డికి లక్ష్మణ్బాబు రూ.50 వేలు, ఆయన సోదరుడు కాకులమర్రి ప్రదీప్రావు రూ.30 వేలు విరాళంగా అందజేశారు. ఉత్సవాల నిర్వహణకు ఆర్థిక సాయం అందించిన వారిని కమిటీ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గడదాసు సునీల్కుమార్, కూనూరు అశోక్గౌడ్, తాడూరి రఘు, సప్పిడి రామ్నర్సయ్య, ఉపసర్పంచి పర్వతాల ఎల్లయ్య, రామాలయ కమిటీ చైర్మన్ దన్నపునేని కిరణ్, ఇతర నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముప్పనపల్లిలో వెలుగుల బతుకమ్మ

పండుగ వేడుకలకు ఘనంగా లైటింగ్ ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ



ముప్పనపల్లి, అక్టోబరు 12 (మనం న్యూస్): బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ముప్పనపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వేడుకల ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. రంగురంగుల లైట్లతో ప్రాంగణం మెరిసిపోతుండటంతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది. మహిళలు, గ్రామస్తులు బతుకమ్మ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించేందుకు అనువుగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్రామ ప్రజలకు పండుగ సమయంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా సర్పంచ్ తిప్పనపల్లి లక్ష్మయ్య, ఉప సర్పంచ్ చీదరి సుమన్, గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో లైటింగ్ ఏర్పాట్లు చేపట్టారు. బతుకమ్మ వేడుకలు ప్రశాంతంగా, ఆనందోత్సాహాలతో జరిగేలా గ్రామపంచాయతీ తరపున అవసరమైన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పండుగను పురస్కరించుకుని గ్రామపంచాయతీ చేపట్టిన ఏర్పాట్లపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ సర్పంచ్, ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు.

బీఆరెస్ ఆధ్వర్యంలో పది సంవత్సరాల పండుగ



భూపాలపల్లి అక్టోబర్ 12(మనం న్యూస్): జిల్లా ఏర్పాటు జరిగి పది సంవత్సరాలు అయిన సందర్భంగా బీఆరెస్ పార్టీ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెసిఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ని పలు కార్యాలయాలు సందర్శించి అధికారులు సిబ్బందికి పుష్పగుచ్చాలు అందించి, స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఏర్పాటై పది సంవత్సరాలు పూర్తిచేసుకుని 11వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా జిల్లా ఏర్పాటు చేసి, జిల్లా అభివృద్ధికి రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్ చేసిన కృషిని గుర్తుచేసుకుంటూ కృతజ్ఞతలు తెలిపారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంగా ఏర్పడటం ఈ ప్రాంత చరిత్రలో కీలక మైలురాయి అని పేర్కొన్నారు. ఒకప్పుడు మారుమూల ప్రాంతంగా ఉన్న భూపాలపల్లిని జిల్లా కేంద్రంగా మార్చడం ద్వారా పరిపాలనా సౌకర్యాలు ప్రజలకు చేరువయ్యాయని తెలిపారు. జిల్లా ఏర్పాటుతో ఒక్క కలెక్టర్,ఒక్క ఐపీఎస్, జిల్లా జడ్జి,అధికారులు స్థానికంగానే అందుబాటులో ఉండటంతో పాటు, సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయం నిర్మాణం వల్ల వివిధ ప్రభుత్వ కార్యాలయాల సేవలు ఒకే ప్రాంగణంలో అందుతున్నాయని వివరించారు. గతంలో ఇతర ప్రభుత్వ కార్యాలయాల కోసం సూదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం ప్రజలకు పరిపాలనా సేవలు మరింత సులభంగా అందుతున్నాయని పేర్కొన్నారు. భూపాలపల్లిలో మెడికల్ కాలేజీ ఏర్పాటు, ఆసుపత్రి నిర్మాణం, విద్యా సదుపాయాల అభివృద్ధి ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయన్నారు. జిల్లా కేంద్రం ఏర్పాటుతో స్థానికంగా న్యాయవాదులకు ఉపాధి అవకాశాలు పెరిగాయని, గతంలో కోర్టు పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులతో పోలిస్తే ప్రస్తుతం ప్రజలకు సౌకర్యాలు మెరుగుపడ్డాయని తెలిపారు. భూపాలపల్లి జిల్లా అభివృద్ధికి పునాది వేసిన కేసీఆర్కు కృతజ్ఞతలు తెలియజేయడం మన బాధ్యత అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని, కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా దశాబ్ది ఉత్సవాల సందర్భంగా భూపాలపల్లి ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా, ప్రస్తుత ప్రభుత్వం గత మూడేళ్లలో అభివృద్ధి విషయంలో ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని, ప్రచారానికి ప్రాధాన్యత ఇవ్వడం కంటే ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. మిగిలిన కాలంలోనైనా భూపాలపల్లి జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కోరారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియగా కొనసాగాలని, భూపాలపల్లి జిల్లా మరింత ప్రగతి సాధించేలా పాలకులు కృషి చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వారి వెంట జిల్లా బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

‘బాహుబలి కాదు.. నాకు బాగా తృప్తినిచ్చిన సినిమా అదే’: రాజమౌళి



తెలుగు చిత్రసీమలోనే కాకుండా అంతర్జాతీయంగా ఎంతో క్రేజ్ ఉన్న దిగ్గజ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్లో వస్తున్న ‘వారణాసి’ చిత్రం ప్రస్తుతం శరవేగంగా రూపుదిద్దుకుంటోంది. ఈ ఏడాది చివరికల్లా పూర్తిస్థాయి చిత్రీకరణను ముగించి, వచ్చే ఏడాది సమ్మర్ (వేసవి) కానుకగా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్రబృందం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో తాజాగా ఓ ప్రముఖ మీడియా ఛానల్ ప్రతినిధితో మాట్లాడిన రాజమౌళి, తన సినీ ప్రయాణానికి సంబంధించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ.. ‘ప్రపంచవ్యాప్తంగా అందరూ నన్ను బాహుబలికి ముందు, బాహుబలికి తర్వాత అని చూస్తుంటారు. కానీ ఒక దర్శకుడిగా నాలో అసలు సిసలైన ఆత్మవిశ్వాసాన్ని నింపిన చిత్రం బాహుబలి కాదు. దానికి ముందే నేను తెరకెక్కించిన ‘ఈగ’ సినిమా అని వెల్లడించారు.

నా జీవితంలో పెద్ద ప్రయోగం..

‘నా లైఫ్లో నేను చేసిన అతిపెద్ద ప్రయోగం ‘ఈగ’. ఆ సినిమా నాకు అందించిన సంతృప్తి వర్ణించలేనిది. నేను భవిష్యత్తులో ఎన్ని సినిమాలు తీసినప్పటికీ, ఈగ నాకు ఎప్పటికీ చాలా ప్రత్యేకమైనదిగానే ఉంటుంది. ఒక దర్శకుడిగా నన్ను నేను ఈగకు ముందు.. ఈగకు తర్వాత అని భావిస్తాను’ అని రాజమౌళి చెప్పుకొచ్చారు. దర్శకధీరుడి నుండి వచ్చిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలోనూ, సినీ వర్గాల్లోనూ వైరల్గా మారాయి.

ఎల్లుండే మ్యాచ్.. ఇప్పటి వరకు 25వేల టికెట్లు విక్రయం

భారత్-వెస్టిండీస్ మధ్య హైదరాబాద్ వేదికగా బుధవారం జరగనున్న టీ20 మ్యాచ్ కోసం ఇప్పటి వరకు 25 వేల టికెట్లు విక్రయించినట్లు హెచ్సీఏ వెల్లడించింది. ఉప్పల్ స్టేడియంలో గరిష్ఠంగా 55 వేల మంది మ్యాచ్ను వీక్షించే అవకాశముంది. ఈ మ్యాచ్ కోసం 2,200 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మల్కాజిగిరి సీపీ సుమతి వెల్లడించారు. స్టేడియం చుట్టూ 4 వాచ్ టీమ్లు ఉంటాయని చెప్పారు.

408 సీసీ కెమెరాలు, 2 డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. సోషల్ మీడియాలో ఫేక్ టికెట్లపైనా నిఘా ఉంచినట్లు ఆమె పేర్కొన్నారు. దాదాపు 40వేల మంది మ్యాచ్కు వచ్చే అవకాశముందని, 8వేలకు పైగా వాహనాలను సైతం పార్కింగ్ చేసుకునేలా స్థలాలను ఏర్పాటు చేశామని చెప్పారు. తొలుత ఆటగాళ్లు బంజారాహిల్స్లు అక్కడి నుంచి స్టేడియానికి వస్తారని తెలిపారు. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని, 8 షీ బృందాలు మఫ్టీలో ఉంటాయని



పేర్కొన్నారు. మ్యాచ్కు వచ్చేవాళ్లు వీలైనంత వరకు ఆర్టీసీ, మెట్రో సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. మ్యాచ్కు 2 గంటల ముందు స్టేడియంలోకి అనుమతిస్తామన్నారు.

యూట్యూబ్‌లో కోహ్లీ వీడియోలు చూసి నేర్చుకున్నా: ఆస్ట్రేలియా ఆటగాడు

భారత్-ఎతో ఇటీవల జరిగిన మూడు వన్డేల సిరీస్ను ఆస్ట్రేలియా-ఎ జట్టు 2-1 తేడాతో కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో ఆసీస్ బ్యాటర్ నాథన్ మెక్స్వీనీ ఒక సెంచరీ సహా 194 పరుగులు చేసి ‘ప్లేయర్ ఆఫ్ ది సిరీస్’గా నిలిచాడు. ఈ క్రమంలోనే అతడు తన విజయ రహస్యాన్ని వెల్లడిస్తూ.. టీమ్ఇండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ యూట్యూబ్ వీడియోలు చూసి, స్పిన్ బౌలింగ్ను ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నట్లు తెలిపాడు.

‘‘ఏ విదేశీ జట్టుకైనా భారత్లో సిరీస్ గెలవడం అంత సులభమైన విషయం కాదు. భారత్ పర్యటనకు వచ్చినప్పుడు సహజంగానే స్పిన్ బౌలింగ్ను ఎదుర్కోవడంపై ఎక్కువ దృష్టి పెట్టాల్సి ఉంటుంది. అందుకే స్పిన్నర్లను కోహ్లీ ఎలా హ్యాండిల్ చేస్తున్నాడో యూట్యూబ్ వీడియోల్లో చూశాను. అలాగే స్టీవ్ స్మిత్తోపాటు గతంలో ఇక్కడ రాణించిన ఆస్ట్రేలియన్ ఆటగాళ్ల శైలిని కూడా గమనించాను. అంతేకాకుండా విశ్లేషకుల డేటానూ అధ్యయనం చేశాను. వాటిని మైదానంలో ఆచరణలో



పెట్టి.. మంచి ఫలితాలు సాధించడం చాలా సంతోషాన్నిచ్చింది’’ అని మెక్స్వీనీ చెప్పాడు.

అంతకుముందు భారత్-ఎతో జరిగిన అనధికారిక టెస్టు సిరీస్లో తన ఆటతీరుపై స్పందిస్తూ.. ‘‘భారత్లో ఆడేటప్పుడు తొలి ఇన్నింగ్స్కు చాలా ప్రాధాన్యం ఉంటుంది. అయితే.. మ్యాచ్ సాగుతున్న కొద్దీ బ్యాటింగ్ కష్టమైంది. భవిష్యత్తులో భారత్లో ఆడే అవకాశం వస్తే టెస్టుల తొలి ఇన్నింగ్స్లోనే భారీ స్కోరుపై దృష్టి పెడతాను’’ అని తెలిపాడు. రెండు మ్యాచ్ల టెస్ట్ సిరీస్ను భారత్ 1-0తో గెలుచుకుంది. నాలుగు ఇన్నింగ్స్లో మెక్స్వీనీ (0, 35, 34, 36) పెద్దగా రాణించలేకపోయాడు.

భారత్-శ్రీలంక మ్యాచ్ వేదిక మార్పు వార్తలు.. స్పందించిన బీసీసీఐ

భారత్- శ్రీలంక మధ్య డిసెంబర్ 13న జరగనున్న తొలి వన్డే మ్యాచ్ వేదికను దిల్లీ నుంచి అహ్మదాబాద్కు మారుస్తున్నట్లు వస్తున్న కథనాలను బీసీసీఐ ఖండించింది. నిబంధనల ప్రకారమే ఆ మ్యాచ్ను దిల్లీకి కేటాయించారని, వేదిక విషయంలో ఎటువంటి మార్పు చేయలేదని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశారు.

‘‘దిల్లీలో జరగాల్సిన భారత్- శ్రీలంక తొలి వన్డేను అహ్మదాబాద్కు మారుస్తున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదు. బీసీసీఐ అలాంటి నిర్ణయమేదీ తీసుకోలేదు. నిర్ణీత ప్రామాణిక విధానాన్ని అనుసరించే ద్వైపాక్షిక మ్యాచ్ల వేదికలను కేటాయిస్తారు’’ అని సైకియా వివరణ ఇచ్చారు. దిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో నిర్మాణ పనులు జరుగుతున్నందున.. ఆ మ్యాచ్ను అహ్మదాబాద్కు మారుస్తున్నారనే ప్రచారం మొదలైంది. ఇదిలా ఉండగా.. భారత్ పర్యటనలో భాగంగా శ్రీలంక జట్టు మూడు వన్డేలతో పాటు మూడు టీ20ల సిరీస్ కూడా ఆడనుంది.

బ్రేకప్ అంటే బాధ కాదు..

అక్కడే అసలైన ఎదుగుదల ఉంటుంది: అనుపమ

మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ తన గత ప్రేమాయణం, బ్రేకప్ గురించి మరోసారి స్పందిస్తూ సోషల్ మీడియాలో నెటిజన్ల దృష్టిని ఆకర్షించారు. కొద్ది రోజుల క్రితమే తన మాజీ ప్రియుడు ఎంతో విచిత్రంగా ప్రవర్తించేవాడని, తన వ్యక్తిగత విషయాలతో పాటు సినిమా కెరీర్ను కూడా కంట్రోల్ చేయడానికి ప్రయత్నించాడని చెబుతూ సంచలనం సృష్టించారు. తాజాగా, మరోసారి తన బ్రేకప్ను గుర్తు చేసుకుంటూ, జీవితంలో ఎదురైన ఆ చేదు అనుభవం గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. సాధారణంగా జీవితంలో ప్రేమ ఎంత అందంగా ఉంటుందో, ఇద్దరు వ్యక్తులు విడిపోవడం కూడా అంతే అందమైన విషయమని అనుపమ అభిప్రాయపడ్డారు.

ఒక పార్ట్నర్ తో విడిపోవడం అనేది ప్రతీ ఒక్కరి జీవితంలో ఒక సహజమైన భాగమేనని ఆమె పేర్కొన్నారు. ఒక బంధం ముగిసిన తర్వాత ఆ వ్యక్తి నుంచి మనం ఎలా దూరమవుతామో, ఆ తర్వాత రోజుల్లో మనల్ని మనం ఎలా మెరుగుపరుచుకుని ఒక మంచి వ్యక్తిగా ఎదుగుతామో అనేది కేవలం ఆ విడిపోవడంతోనే మొదలవుతుందని ఆమె వెల్లడించారు. అందుకే తన కోణంలో చూస్తే బ్రేకప్ అనేది బాధ కాదని.. అది ఎంతో అందంగానే కనిపిస్తుందని స్పష్టం చేశారు. ప్రేమలో విఫలమైనప్పటికీ ధైర్యంగా నిలబడి, తన జీవితాన్ని మరింత అందంగా మలుచుకుంటున్న అనుపమ తీరును చూసి నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.





దాదాపు రెండు పదుల కాలంగా చిత్రపరిశ్రమలో కొనసాగుతున్న అదితి రావు హైదరీ, ఈ ప్రత్యేకమైన మైలురాయి వద్దకు చేరుకుంటున్న వేళ తన సినీ ప్రయాణంపై స్పందిస్తూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. అక్టోబర్ 23న తన 40వ పుట్టినరోజు జరుపుకోబోతున్న అదితి.. విజయం, ఓటములతో సంబంధం లేకుండా తన ప్రయాణం సాగుతున్నట్లు తెలిపారు. నేర్చుకున్న పాఠాలు, స్పష్టత, కృతజ్ఞతా భావంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఒకవేళ ఇప్పుడున్న తాను చిన్ననాటి తనను కలిస్తే, ఎలాంటి హడావుడి లేకుండా సంతోషంగా మనలా మనం ఉండమని సలహా ఇస్తానని అదితి చెప్పారు. బయట జరిగే విమర్శలను పట్టించుకోకుండా, మనల్ని ప్రోత్సహించే మంచి వాళ్లను నమ్మాలని అన్నారు. జీవితంలో ప్రతిదీ వెంటనే తెలిసిపోవాలని తొందరపడకూడదని, కొత్త విషయాలు నేర్చుకుంటూ ముందుకు వెళ్లాలని తెలిపారు. తప్పులు చేయడానికి ఎప్పుడూ భయపడకూడదని, ఆ తప్పుల నుంచే మనం మంచి పాఠాలు నేర్చుకుని గొప్పగా ఎదుగుతామని ఆమె వివరించారు. సినిమా రంగంలో తన ప్రయాణం ఎప్పుడూ అంత తేలిగ్గా సాగలేదని అదితి అన్నారు. ఎదురైన ఇబ్బందులను తలచుకుని బాధపడకుండా, ప్రతి అనుభవం తనకు ఎంతో నేర్పించిందని చెప్పడానికి సంతోషిస్తానని అన్నారు. ఇండస్ట్రీలో ఎదగడం కొండెక్కినంత కష్టంగా ఉంటుందని, కానీ ప్రతి అడుగు ముందుకు వేయడం వల్లనే అనుభవం వస్తుందని తెలిపారు. ఇకపై ఎవరితో పని చేయాలి, ఎలాంటి మంచి పాత్రలు ఎంచుకోవాలనే విషయంలో తనకు పూర్తి స్పష్టత ఉందని ఆమె స్పష్టం చేశారు. ఎవరైనా తప్పుడు పనులు చేస్తే లేదా తనను తక్కువగా అంచనా వేస్తే.. అది వారి కర్మకే వదిలేయాలని ఆమె అభిప్రాయపడ్డారు.

నన్ను తక్కువగా అంచనా వేస్తే అది వాళ్ల కర్మకే వదిలేస్తా.. అదితి రావు హైదరీ

‘AA-23’.. ఇంట్రెస్టింగ్ అప్డేట్స్ రాబోతున్నాయంటూ పోస్ట్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ వరుస భారీ పాన్ ఇండియా ప్రాజెక్టతో ఫుల్ బిజీగా ఉన్నారు. దర్శకుడు అట్లీతో ‘రాకా’ సినిమాతో పాటు, కోలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్తో ఒక మెగా ప్రాజెక్టు లైన్లో పెట్టిన విషయం తెలిసిందే. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యాన్స వర్కింగ్ టైటిల్ AA23తో ఈ సినిమా రూపుదిద్దుకోనుంది. అయితే ఈ కాంబినేషన్ అనౌన్స్మెంట్ వచ్చి చాలా రోజులు కావడం, ఆ తర్వాత ఎలాంటి అప్డేట్ లేకపోవడంతో ఈ భారీ ప్రాజెక్ట్ క్యాన్సిల్ అయిపోయిందంటూ సోషల్ మీడియాలో రకరకాల రూమర్లు షికారు చేశాయి. ఈ ప్రచారానికి చెక్ పెడుతూ తాజాగా, డైరెక్టర్ లోకేష్ కనగరాజ్, మైత్రీ మూవీ మేకర్స్ సోషల్ మీడియా వేదికగా క్లారిటీ ఇచ్చారు. అల్లు అర్జున్తో కలిసి దిగిన ఒక లేటెస్ట్ పిక్ను షేర్ చేస్తూ.. ఈ సినిమా ఆగలేదని, మరింత పవర్ఫుల్గా రూపుదిద్దుకుంటోందని స్పష్టం చేశారు. ‘ఏదో భారీ విషయం రూపుదిద్దుకుంటోంది. AA23 నుంచి త్వరలోనే ఆసక్తికరమైన అప్డేట్స్ రాబోతున్నాయి.. వేచి చూడండి’ అంటూ క్యాప్షన్ను జత చేశారు. ఈ ఒక్క పిక్తో ప్రాజెక్ట్పై వస్తున్న రూమర్లన్నింటికీ ఒకేసారి తెరపడింది. కాగా.. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ మోస్ట్ అవైటెడ్ యాక్షన్ ఎంటర్టైనర్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి పట్టాలెక్కనున్నట్లు సమాచారం. లోకేష్ కనగరాజ్ క్లారిటీ ఇవ్వడంతో అల్లు అర్జున్ అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.



రొమాంటిక్ డ్రామాతో రాబోతున్న సుహాస్ ‘హైడ్ సిల్క్’

టాలీవుడ్ టాలెంటెడ్ యంగ్ హీరో సుహాస్ వరుస పెట్టి వైవిధ్యమైన కథలతో దూసుకుపోతున్నారు. ఇటీవల తమిళ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ‘మండాడి’తో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకున్న సుహాస్.. తాజాగా, రొమాంటిక్ డ్రామాతో రాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించి అందరిలోనూ ఆసక్తిని రేకెత్తించారు. ఈ సినిమాకు ‘హైడ్ సిల్క్’ అనే విభిన్నమైన టైటిల్ను ఖరారు చేస్తూ, మేకర్స్ ఒక చిన్న గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో సుహాస్ మగ్గంపై చీర నేస్తూ కనిపించడం అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది. వీడియో వెనకాల సీనియర్ నటుడు తనికెళ్ల భరణి వాయిస్ ఓవర్ ఇస్తూ.. ‘ప్రతి చీర ఒక ప్రత్యేకమైన మహిళ కోసమే పుడుతుంది’ అనే డైలాగ్ చెబుతారు. ఇక ధారాల మధ్యే సుహాస్-సంజన ప్రేమ చిగురించిందని తెలుపుతూ.. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో అందరినీ ఆకర్షిస్తోంది. ఇక ఈ సినిమాలో సుహాస్ సరసన లబ్బర్ పండు, డీసీ చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి సంజన కృష్ణమూర్తి హీరోయిన్గా నటిస్తుండగా.. తనికెళ్ల భరణి, నందు కీలక పాత్రలో కనిపించనున్నారు. కోలీవుడ్లో ఎన్నో మంచి సినిమాలు తీసిన ప్రముఖ నిర్మాణ సంస్థ ‘స్టోన్ బెంచ్ స్టూడియోస్’, తెలుగులో నాలుగు సినిమాలు చేయడానికి ప్లాన్ చేస్తోంది. అందులో మొదటి ప్రాజెక్టా రాబోతున్న ‘హైడ్ సిల్క్’ను వర్తికా జైన్కు చెందిన ‘మిథిలాల్ పిక్చర్స్’తో కలిసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో రాజేంద్ర బాల దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇక ఈ సినిమా తెలుగు, తమిళంలో త్వరలోనే విడుదల కాబోతున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.